ఆంధ్రజ్యోతి
ప్రకాశం
మంగళవారం 15 అక్టోబరు 2024



ఊరంతా ఉద్యోగులు

వేంపాడులో ప్రతి ఇంట్లో ఒకరు

- అక్షరాస్యతలో మండలంలో ప్రథమ స్థానం
- రెండు దశాబ్దాల క్రితం ఆరుగురి స్ఫూర్తితో మొదలై..
- ప్రస్తుతం 300మందికిపైగా ఉద్యోగులు
- వీరిలో 60 మందికిపైగా అమెరికాలో సాఫ్ట్‌వేర్లు



వివరాలు 7వ పేజీలో

లాభాల పంట

- దక్షిణాదిలో ముగిసిన పొగాకు వేలం
- 153.58 మిలియన్ కిలోల అమ్మకం
- కిలో రూ.266.14 పలికిన సగటు ధర
- గత ఏడాది కన్నా రూ.50 అధికం
- ఉత్పత్తి పెరిగినా భారీ డిమాండ్
- పొగాకు బోర్డు చరిత్రలో అత్యధిక ధరలు లభ్యం
- మొత్తంగా రూ.4,085.50 కోట్ల మేర రాబడి
- రైతులలో జోష్ నింపిన మార్కెట్

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది ప్రాంత పొగాకు రైతులను ఈ ఏడాది లాభాలు ముంచెత్తాయి. పొగాకు బోర్డు చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో ధరలు లభించాయి. పంట ఉత్పత్తి అనుమతికి మించి సుమారు 75శాతం అధికంగా అయినప్పటికీ ధరలు



గతం కన్నా భారీగా పెరిగాయి. మొత్తంగా దక్షిణాదిలోని 11 పొగాకు వేలం కేంద్రాలలో ఈ ఏడాది (2023-24) సుమారు 153.58 మిలియన్ కిలోల విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.266.41 ధర లభించి పొగాకు రైతులకు దాదాపు రూ.4,085.50 కోట్ల మేర రాబడి వచ్చింది. సగటు ధరల్లో గత రెండేళ్ల కన్నా భారీగా పెరుగుదల కనిపించింది. ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డు దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2023-24 సంవత్సరానికి 57,767.39 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 88.96 మిలియన్ కిలోల ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 29,885 మంది రైతులు 24,130 బ్యారన్లకు లైసెన్సులు పొంది 72,345.90 హెక్టార్లలో పంట సాగు చేశారు. అలా సుమారు 15వేల హెక్టార్లలో పంట అధికంగా సాగు కాగా ఉత్పత్తి కూడా భారీగా పెరిగింది.

తొలుత ఇబ్బందులు

తొలుత పంట సాగులో రైతులు బాగానే ఇబ్బందులు పడ్డారు. సకాలంలో వర్షాలు లేక పంట సాగుకు ఇక్కట్లు పడగా ఆ తర్వాత నవంబరు, డిసెంబరు మాసాలలో కురిసిన వర్షాలు మరింత దెబ్బతీశాయి. అయితే అంతకు ముందు ఏడాది వచ్చిన లాభాలు, ప్రస్తుత సీజన్‌పై ఆశతో తిరిగి నాట్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో

మిగతా 6వ పేజీలో..



జలమయమైన ఒంగోలులోని కర్నూల్‌రోడ్డు

వాన గండం



ఒంగోలులో జోరుగా కురుస్తున్న వర్షం

- నేడు, రేపు భారీ వర్షాలు
- ఇప్పటికే ముసురుపట్టి కురుస్తున్న వాన
- నాలుగు రోజుల్లో 56మి.మీ వర్షపాతం
- ఒంగోలులో గరిష్టంగా 181.40 మి.మీ
- నగరంలో అధిక ప్రాంతాలు జలమయం
- ఇతర ప్రాంతాల్లోనూ వాగులు, వంకల్లో నీరు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ముందస్తు చర్యలపై దృష్టి
- తీరప్రాంత గ్రామాల్లో పర్యటన
- మంత్రి, కలెక్టర్‌తో సీఎం టెలికాన్ఫరెన్స్
- తక్షణ చర్యలపై సూచనలు
- రెండు రోజులు స్కూళ్లకు సెలవు ప్రకటించిన కలెక్టర్ అన్సారియా
- పంటలపై రైతుల్లో ఆందోళన

జిల్లాకు వానగండం పొంచి ఉంది. నాలుగైదు రోజులుగా ముసురుపట్టి వానలు పడుతుండగా ఆదివారం రాత్రి నుంచి తీవ్రత మరింత పెరిగింది. ప్రస్తుతానికి ఇప్పటివరకు కురిసిన వర్షాలే సరిపోయే అవకాశం ఉండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాన జోరు అధికమైంది. ఒంగోలు నగరంలో అయితే తెరపిలేకుండా పడుతూనే ఉంది. జిల్లావ్యాప్తంగా అత్యధిక ప్రాంతాల్లో సోమవారం పగలంతా ఇదే పరిస్థితి కనిపించింది. మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ మేరకు రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వానలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అలా ఈనెల 11నుంచి సోమవారం ఉదయం వరకు సగటున జిల్లాలో 56.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అత్యధికంగా 181.40 మి.మీ నమోదైంది. అలాగే సంతనూతలపాడు, కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో 100 మి.మీపైగా ఈ నాలుగు రోజుల్లో నమోదు కాగా ఇతర ప్రాంతాల్లోనూ మంచి వర్షాలే కురిశాయి. సాధారణంగా జిల్లాలో ఈ సమయంలో మంచి వర్షాలే కురుస్తాయి. అలాగే ఈనెల 10 నుంచి జిల్లా అంతటా జల్లులు పడుతున్నాయి. ఒక రకంగా ముసురు పట్టింది. అలా ఈనెల 11 నుంచి 13 వరకు జిల్లాలో 36.0 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. తిరిగి ఆదివారం రాత్రి నుంచి వానలు జోరు పెరిగింది. ఆదివారం

మిగతా 6వ పేజీలో..



పొంగి ప్రవహిస్తున్న హనుమాపురం వాగును పరిశీలిస్తున్న అధికారులు

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

ప్రకృతి విపత్తుల శాఖ ముందస్తు హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం ఆదివారం నుంచే అప్రమత్తమైంది. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆయా శాఖల వారీ చర్యలపై, అలాగే గ్రామాలలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆదివారమే అందరితో మాట్లాడారు. అలాగే కలెక్టరేట్‌తోపాటు ఒంగోలు ఆర్డీవో కార్యాలయంలోనూ కంట్రోలు రూంలు ఏర్పాటు చేశారు. మరోవైపు వర్షాలు అధికంగా ఉన్న ప్రాంతాలు, ప్రత్యేకించి తీరప్రాంత మండలాల్లో అధికారులు పర్యటించి ముందస్తు చర్యలు చేపడుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ అన్సారియా టంగుటూరు మండలంలో, ఎన్‌జీపాడు మండలంలో జేసీ గోపాలకృష్ణ పర్యటించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి భారీవర్షాలు కురుస్తుండటంతో జిల్లాలోని విద్యా సంస్థలకు కలెక్టర్ అన్సారియా సెలవు ప్రకటించారు. అలాగే మరో రెండు రోజులు భారీ వర్షాల హెచ్చరికతో మంగళవారం కూడా సెలవులు పొడిగించారు.

పొంగుతున్న వాగులు

ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సింగరాయకొండ మండలాల్లో ఎనిమిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియాలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. తీరప్రాంతంలోని ఐదు మండలాల్లో మండలానికి రెండు టీంలు, ఒక్కో టీంలో ఐదుగురు గజఈతగాళ్లను, బోట్లను సిద్ధం చేశారు. తాజా వర్షాలతో జిల్లాలోని అధిక ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎగువ నుంచి ఏడు వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా మూడు గేట్లు ఎత్తి 12 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు.





లాటరీ తీసి దుకాణం దక్కిన వారిని ప్రకటిస్తున్న కలెక్టర్ అన్సారియా

లాటరీలో దుకాణం దక్కిన మహిళ

లిక్కర్ లక్కు

మహిళలకు దక్కిన 15 దుకాణాలు

- భారీ వర్షం పడుతున్నా మద్యం షాపులకు లాటరీ
- తొలివిడత లైసెన్స్ ఫీజు రూ.17.50 కోట్లు
- దరఖాస్తుల ద్వారా రూ.69.32 కోట్లు
- రేపటి నుంచి ప్రైవేటు వైన్ షాపులు ప్రారంభం

ఒంగోలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభించనున్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పర్యవేక్షణలో లాటరీ ప్రక్రియ ద్వారా 171 వైన్ షాపులకు కేటాయింపులు పూర్తిచేశారు. మొత్తం 3,466 దరఖాస్తులు రాగా అందులో 50 మందికిపైగా మహిళలు ఉన్నారు. వారిలో 15 మందిని అదృష్టదేవత వరించింది. వారికి మద్యం దుకాణాలు కేటాయించారు. దరఖాస్తుల ద్వారా రూ.69.32 కోట్ల ఆదాయం రాగా, లైసెన్స్ ఫీజు రూపంలో తొలివిడతగా రూ.17.50 కోట్లు

మిగతా 6వ పేజీలో..

లిక్కర్ రాజకీయం ఆరంభం

- పాత వ్యాపారులు, రాజకీయ నేతల రంగప్రవేశం
- లాటరీలో అదృష్టవంతులను తరిమికొట్టే ప్రయత్నం
- షాపుల అమ్మకానికి ఒత్తిళ్లు, బేరసారాలు

6లో



ఒంగోలులో లాటరీ తీస్తున్న అంబేడ్కర్ భవన్ వద్ద వర్షంలోనే ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు



కొండపి మండలం పెట్లూరులో రూ.30 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామి, జిల్లా అధికారులు

ఉత్సాహంగా పల్లె పండుగ

- జోరువానలోనూ కార్యక్రమం
- పెట్లూరులో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర చోట్ల ఎమ్మెల్యేలు హాజరు
- రోడ్లు, ఇతర పనులకు శంకుస్థాపనలు

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఈనెల 20 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలో సుమారు రూ.126.19 కోట్ల ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధులతో చేపట్టే 1,168 పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు చేయనున్నారు రాష్ట్రవ్యాప్తంగా అలా సుమారు రూ.4,500 కోట్లతో 30వేల పనులు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కాగా జిల్లాలో సగటున ఒక్కో నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున కేటాయింపు జరిగింది. ప్రధానంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గ్రావెల్ రోడ్ల పనులు కూడా ఉన్నాయి. గత ఆగస్టు 23న ఒకేరోజు 729 గ్రామాల్లో సభలు నిర్వహించిన సందర్భంగా ఆయా పనుల నిర్వహణకు తీర్మానాలు చేశారు. అనంతరం వాటికి కలెక్టర్ అన్సారియా పాలనాపరమైన ఉత్తర్వులు ఇచ్చారు. కాగా ఆయా పనులకు ఈ వారంరోజుల్లో శంకుస్థాపనలు చేసి జనవరి ఆఖరు నాటికి పూర్తిచేయాలన్న లక్ష్యంతో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

57 గ్రామాల్లో 170 పనులకు భూమిపూజ

తొలిరోజైన సోమవారం జిల్లా అంతటా ఈ కార్యక్రమం సాగింది. సాంఘిక సంక్షేమశాఖ

మిగతా 6వ పేజీలో..



రఘురామకృష్ణంరాజు కేసు దర్యాప్తు అధికారిగా ఎస్పీ దామోదర్

మెయిన్‌లో..

గోపాల భైరవుడు

- గోమాతల సంరక్షణలో ఆనంద ఆశ్రమం
- దాతల సహకారంతో దినదినాభివృద్ధి

7లో



కుండపోత

ఒంగోలు నగర వీధులన్నీ జలమయం
నాలుగు రోజులుగా ముసురు వాతావరణం
ఎడతెరిపి లేనివాన
చర్యలు చేపట్టిన కార్పొరేషన్ యంత్రాంగం

ఒంగోలుకార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీవర్షానికి సోమవారం ఒంగోలు నగరం జలమయమైంది. మూడు రోజుల నుంచి వర్షం కురుస్తుండగా, సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షం వాన నగరాన్ని ముంచెత్తింది. ప్రధాన వీధుల్లో వర్షం నీరు ఏరులై పారగా, కొన్ని ప్రాంతాలు చెరువులను తలపించాయి. ఇదిలా ఉండగా శివారు కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ఇబ్బందులు పడిన ప్రజలు

నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురవడంతో ప్రజలకు పాట్లు తప్పలేదు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, నగర ప్రధాన రహదారుల్లో మోకాళ్ల లోతున నీరు నిలబడి చెరువులను తలపించాయి. భాగ్యనగర్‌లో పలు వీధుల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాలలో వర్షపు నీరుపోయే మార్గం లేకపోవడంతో పరిస్థితి మరింత జటిలమైంది. ధారావారితోట, దేవుడు చెరువు, సీఎస్ఆర్ శర్మాకళాశాల, బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఆర్టీసీ డిపో ఆవరణ, ఏకలవ్య నగర్, మస్తాన్ దర్గా సెంటర్, భాగ్యనగర్‌లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.


చెరువును తలపిస్తున్న కర్నూలు రోడ్డు

లోతట్టు ప్రాంతాలు జలమయం

విడవని వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వంటవారి కాలనీ, వెంకటేశ్వర కాలనీ, నెహ్రూకాలనీ, బలరాం కాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్‌కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజాషువా కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలలోని పలు ప్రాంతాలలో నీరు నిలిచి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ధారావారితోట, జర్నలిస్ట్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నిలిచి ప్రజలు, ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ప్రగతి భవన్, డ్వామా కార్యాలయం, ఇరిగేషన్ ఆఫీస్, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నీరు నిలిచి వాహన రాకపోకలకు ఆటంకం ఏర్పడింది.


పూడికతొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేషన్ అధికారులు

కార్పొరేషన్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు

నీటి మునిగిన ప్రాంతాల్లో కమిషనరు డాక్టర్ కే వెంకటేశ్వరరావు పర్యటించారు. ఆయా ప్రాంతాలలో వర్షపు నీటిని బయటకు పంపే ప్రయత్నాలు చేశారు. పోతురాజు కాలువ, వెంకటేశ్వర కాలనీ, నేతాజి కాలనీ, జర్నలిస్ట్ కాలనీల్లో పరిస్థితి మరింతదారుణంగా ఉండగా, ఎక్స్‌కవేటర్ ఏర్పాటు చేసి, వర్షపు నీరు తొలగించారు. అంతే కాకుండా ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు.

జిల్లాలో 19.9 మి.మీ. వర్షపాతం నమోదు


భాగ్యనగర్ 4వ లైనులో చెరువును తలపిస్తున్న వర్షం నీరు

ఒంగోలుకలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 19.9 మి.మీ.వర్షపాతం నమోదైంది. ఒంగోలులో 75.4మి.మీ., పొన్నలూరు 65.2, సిఎస్‌పురం 55.4, జరుగుమల్లి 53.8, కొండపి 48.8, సింగరాయకొండ 47.2, పామూరు 45.0, టంగుటూరు 40.4. కొత్తపట్నం 34.6, పిసిపల్లి 32.4, మద్దిపాడు 28.0, సంతనూతలపాడు 27.4 మి.మీ. వర్షం కురిసింది. హనుమంతునిపాడు 27.0, నాగులుప్పలపాడు 24.4, వెలిగండ్ల 18.0, పొదిలి 16.2, కనిగిరి 15.2, యర్రగొండపాలెం 124, మర్రిపూడి 10,4, చీమకుర్తి 10.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కొద్దిపాటి జల్లులు పడ్డాయి.

తీరంలో గజగజ

నీటి మునిగిన ఇళ్లు
అప్రమత్తమైన అధికారులు
గంగమ్మ కాలనీని ఖాళీ చేయించిన యంత్రాంగం
చేపల వేటకు వెళ్లని మత్స్యకారులు
ఆక్వా రైతుల్లోనూ అలజడి

కొత్తపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తపట్నం మండలంలోని తీర ప్రాంత గ్రామాలు గజగజలాడుతున్నాయి. భారీ వర్షాలతో కొన్ని కాలనీల్లో ఇళ్లు నీటమునగడంతోపాటు చలి వాతావరణంతో హడలిపోతున్నాయి. ఆదివారం రాత్రి నుంచే భారీ వర్షాలు కురుస్తున్నాయి. తీర ప్రాంత గ్రామాలు జలమయం కావడంతో అధికారులు సత్వరమే స్పందించి నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశారు. కొత్తపట్నంలోని గంగమ్మకాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరటంతో కాలనీవాసులను అధికారులు ఖాళీ చేయించారు. తహసీల్దార్ మధుసూదనరావు నీటిని బయటకు పంపించేందుకు మోటార్లు ఏర్పాట్లు చేశారు. నీట మునిగిన ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈతముక్కల-ఒంగోలు రహదారిలో బకింగ్‌హాం కెనాల్‌పై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కొత్తపట్నం పల్లెపాలెం వద్ద వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికుల సహకారంతో అధికారులు వరదనీటికి అడ్డుకట్టవేశారు. కాగా మండలంలోని మత్స్యకారులు ఆది, సోమవారాల్లో చేపల వేటను నిలుపుదల చేశారు. సోమవారం సముద్రం అలలు సాధారణం కంటే ముందుకొచ్చాయి. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా తుఫాన్ షెల్టర్లను సిద్ధం చేశారు. రెవెన్యూ, సచివాలయం సిబ్బంది గ్రామాల్లోనే ఉండి పరిస్థితిని తెలుసుకుంటున్నారు.


పూర్తిగా నీట మునిగిన ఒంగోలులోని ప్రగతి భవన్ కార్యాలయం

ఆందోళనలో ఆక్వా రైతులు

భారీ వర్షాలతో ఆక్వా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సోమవారం కురిసిన భారీ వర్షాలకు రొయ్యల చెరువుల నిండుకుండలా తొణికిసలాడుతున్నాయి. చెరువు కట్టలపై దాకా నీరు చేరాయి. సోమవారమే కొంత మంది రైతులు చెరువుల్లోని నీటిని బయటకు వదిలిపెట్టారు. మరో రెండు రోజులు ఇదే విధంగా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ఆక్వా రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఒంగోలు డివిజన్‌లో ఎనిమిది పునరావాస కేంద్రాలు

ఒంగోలుకలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు డివిజన్‌లో ఎనిమిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒంగోలు మండలంలో రెండు, టంగుటూరు మండలంలో రెండు, సింగరాయకొండలో రెండు, కొత్తపట్నం, ఎన్‌జీపాడులలో ఒక్కో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోకి 87 కుటుంబాలకు చెందిన 245 మందిని చేర్చారు. అలాగే పరిస్థితులను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన మీడియా వాచింగ్ రూంను కలెక్టర్, జేసీ పరిశీలించారు.

గ్రామాలలో అభివృద్ధికి పూర్తి సహకారం

ఉపాధి హామీ నిధులతో పలు పనులు
గ్రామసభల్లో గుర్తించిన పనులకు
రూ.1.40 కోట్లు మంజూరు:
ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలురూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చెప్పారు. ఒంగోలు మండలంలోని గుండాయపాలెం, దేవరంపాడు హెచ్‌డబ్ల్యూ, దేవరంపాడు, బి.వి. పాలెం, పాతపాడు గ్రామాలలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఐదు గ్రామపంచాయతీలలో ఒక కోటి 40లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. సముద్రతీర ప్రాంత గ్రామమైన గుండాయపాలేన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఉపాధి నిధులతో సిమెంట్‌రోడ్లు, సైడుకాలువలు, గోకులాలు లాంటి అభివృద్ధి పనులు చేసుకోవాలని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అభివృద్ధి పనులు గుర్తించి తీర్మానాలు చేశామన్నారు. ఆ మేరకు 15కోట్ల రూపాయలతో ఆ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. సర్వే చేయించి అర్హత ఉన్న వారికి రేషన్ కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేస్తామన్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాలలోని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, తహసీల్దార్ ఎస్.వాసు, ఈవోఆర్‌డీ బాలచెన్నయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నలమోతు బాలగంగాధర్, నాయకులు శింగోతు వెంకటేశ్వర్లు, మామయ్య, కొక్కిలగడ్డ ప్రభాకరరావు, చప్పిడి శేషయ్య, ముప్పవరపు శ్రీనివాసరావు పాల్గొన్నారు. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లద్దని ఎంపీడీవో రాజశేఖర్ చెప్పారు. ఆయన వెంటనే ఈఓఆర్‌డీ ఎ.బాలచెన్నయ్య ఉన్నారు.


బొద్దులూరివారిపాలెంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

భారీ వర్షాలకు పొంగిన వాగులు..

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్

నాగులుప్పలపాడు అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన కుండపోత వానలకు నాగులుప్పలపాడు-తిమ్మనపాలెం రోడ్డులోని హనుమాపురం, కొత్తకోట వాగులు పొంగి ప్రవహించాయి. మండల ప్రత్యేకాధికారి బేబిరాణి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో మహాలక్ష్మి, పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకొని పరిశీలించారు. ఆయా వాగుల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బందిని నియమించి ఇరువైపులా రాకపోకలను నిలిపివేశారు. నాగులుప్పలపాడు శివారులోని ఇంకొల్లు రోడ్డులో నున్న ఎస్టీ కాలనీలోకి వరద నీరు చేరింది. దీంతో అక్కడ నుంచి 20 మందిని పునరావాసానికి తరలించారు. జేసీ గోపాలకృష్ణ పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. మాచవరం-ఉప్పుగుండూరు గ్రామాల మధ్య నేలచప్టాపైకి వరదనీరు చేరడంతో అటువైపుగా రాకపోకలు నిలిచిపోయాయి. నాగులుప్పలపాడు-అమ్మనబ్రోలు రోడ్డులో మిరప పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. మండలంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటలకు 31.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

సంతనూతలపాడు, అక్టోబరు 14 : మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి చిరంజీవి సోమవారం రాత్రి 7గంటలకు తనిఖీచేశారు. ఈనెల 16, 17న మండలంలో ఆయా గ్రామాల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా చేయబోయే ఏర్పాట్లను సమీక్షించారు.

మద్యం షాపులు దక్కించుకున్నది వీరే

సంతనూతలపాడు, అక్టోబరు 14 : ఒంగోలులో సోమవారం నిర్వహించిన మద్యం లాటరీలో మండలంలోని షాపులను పలువురు దక్కించుకున్నారు. వారిలో తలసిల వినోద్‌కుమార్, యర్రగుంట చంద్రశేఖర్, నెప్పలి వెంకటేశ్వర్లు, రంపతోటి చినశ్రీనివాసరావులు దక్కించుకోగా, మద్దిపాడు మండలంలో రావూరి రవీంద్ర నాథ్, మండువ వెంకటస్వామి, ఇంటూరి భవానీ ప్రసాద్‌లు దక్కించుకున్నట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

నాగులుప్పలపాడులో....

నాగులుప్పలపాడు మండలంలో అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ నాయకులు వీరగంధం దేవేంద్రనాథ్‌చౌదరి సహచరులు చక్రధర్ 29 నంబరు, నల్లూరి హేమంత్‌కుమార్ 30, చుండూరి కిషోర్‌కుమార్ 27 దక్కించుకోగా అదే గ్రామానికి చెందిన మాజీఎంపీపీ వీరయ్యచౌదరి వర్గీయులు అభిరామ్ చౌదరి 28వ నంబరు, ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పాలడుగు ఏడుకొండలు 26 నంబరు షాపును దక్కించుకొన్నారు.

16,17న పల్లె పండుగ వారోత్సవాలు

సంతనూతలపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 16, 17వ తేదీల్లో జరగనున్న పల్లె పండుగ వారోత్సవాలను జయప్రదం చేయాలని ఎంపీడీవో డి.సురేష్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో సైడుకాలువలు, రోడ్ల నిర్మాణాల నిమిత్తం రూ.5కోట్ల కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.విజయ, సర్పంచ్ డి.నాగమణి, జడ్పీటీసీ సభ్యురాలు డి.రమణమ్మ, ఏపీవో వాసంతి పాల్గొన్నారు.

20న ఉచిత మెగా వైద్య శిబిరం

సంతనూతలపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామంలో హనుమంతరావు హైస్కూల్‌లో తానా వారి సహకారంతో సేవా సంకల్ప్ చారిటబుల్ ట్రస్టు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రస్టు ప్రతినిధి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్షాలు పడుతున్న నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సురేష్‌కుమార్ సూచించారు. స్థానిక వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం వైద్యశాఖ ప్రోగ్రాం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులు, దివ్యాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని తహసీల్దార్, ఎంపీడీవోల సహకారంతో సురక్షిత ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తాగునీటి వనరులను క్లోరినేషన్ చేయాలన్నారు.

ఈనెల 21, 22 తేదీల్లో ఆరోగ్య బృందాలు రాక

ఈనెల 21, 22 తేదీల్లో కేంద్ర ఆరోగ్య బృందాలు జిల్లాకు రానున్నాయని డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్ చెప్పారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా, జిల్లా ఆస్పత్రులలో అమలవుతున్న హెచ్‌ఎంఐఎస్, మాతృ, శిశుమరణాలు, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు, జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ తదితర కార్యక్రమాలను పరిశీలిస్తారన్నారు.

17న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఒంగోలు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17తేదీ ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో కె. రాజశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మారనున్న గ్రామాల రూపురేఖలు

ఏల్చూరులో రూ.40లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాపురం భూములకు త్వరలో పరిష్కారం

పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి రవికుమార్

ఏల్చూరు(అద్దంకి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ నిధులతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడు కాలువలకు సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో రూ.67కోట్లతో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు ద్వారా సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, గోకులాల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం ఇతర పలు రకాల పనులు చేపడతారన్నారు. ఆ సమయాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సీసీ రోడ్డు వేసినంత దూరం కచ్చితంగా సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేయాలని, పైప్ కల్వర్టుల స్థానంలో స్లాబ్ కల్వర్టులను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్యను ఏల్చూరు గ్రామస్థులు రవికుమార్ దృష్టికి తీసుకురాగా, గతంలో మూడు ఆర్వో ప్లాంట్‌లు, మంచినీటి పథకం ఏర్పాటు చేస్తే ఆర్వో ప్లాంట్‌లను వ్యాపారంగా మార్చి నిర్వీర్యం చేసి మూసి వేశారన్నారు. అసిస్ట్ సహకారంతో గ్రామంలో 4 కొత్త నీటి ప్లాంట్‌లను చేయిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఉదయం గ్రామాలలో పర్యటించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైన్‌లలో పూడిక తీత పనులు చేయించాలన్నారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైసీపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు నేరుగా పంచాయతీలకే జమ అవుతున్నాయని, ఆ నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నారు. గోపాపురం భూముల సమస్యను త్వరలో పరిష్కరించి సాగు రైతులకు పట్టాలు అందజేస్తామని మంత్రి రవికుమార్ రైతులకు తెలిపారు. ఎస్టీ కాలనీలో గుడిసెలు అడ్డదిడ్డంగా వేసుకొని ఉన్నందున అభివృద్ధి పనులకు అడ్డంకిగా ఉన్నాయని స్థానికులు, రెవెన్యూ అధికారులు కలిసి ప్లాట్లుగా విభజించి కేటాయిస్తే అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

పెద్దదోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌ను సచివాలయంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెనుకబడిన నియోజకవర్గంలో వైద్యశాలల అభివృద్ధి, పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు తోడ్పాటు నివ్వాలని ఆయనను కోరారు.

లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారుల, రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తుల ప్రభావం మళ్లీ ఆరంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపునకు పూర్తి పారదర్శక విధానం అవలంబించింది. అయినా వివిధ రూపాల్లో ఆరితేరిన లిక్కర్ వ్యాపారులు, రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తులు అధికసంఖ్యలో మద్యం షాపులను చేజిక్కించుకోగలిగారు. అయితే కొంతమందికి లాటరీ కలిసిరాలేదు. కొత్తగా ఆకర్షితులైన వారిని మాత్రం అదృష్టం వరించింది. స్థానికేతరులు సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆలోచనతో దరఖాస్తులు చేసి లాటరీలో దక్కించుకున్న వారికి అప్పుడే సమస్యలు ఆరంభమయ్యాయి. 'తులమో ఫలమో ఇస్తాం, మీ కొచ్చిన షాపులు మాకు ఇచ్చి వెళ్లిపోండి' అంటూ మద్యం వ్యాపారులు వారిపై ఒత్తిడి ఆరంభించారు.

- (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)



లిక్కర్ రాజకీయం ఆరంభం

- పాత వ్యాపారులు, రాజకీయ నేతలు రంగప్రవేశం
- లాటరీ అదృష్టవంతులను తరిమికొట్టే ప్రయత్నం
- షాపుల అమ్మకానికి ఒత్తిడి, బేరసారాలు

పకడ్బందీగా లాటరీ విధానం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 250కిపైగా మద్యం విక్రయ షాపులకు సోమవారం లాటరీ విధానంలో విక్రయదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకున్నా ఒకటి రెండు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా దరఖాస్తులు దాఖలు చేశారు. అయితే వారి కళ్లుగప్పి మరికొందరు చివరిక్షణంలో దరఖాస్తులు పెట్టుకున్నారు. దరఖాస్తు దాఖల్లో అంతోఇంతో లొసుగులు కనిపించినా లాటరీ విధానాన్ని ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించింది. దీంతో లాటరీలో అదృష్టవంతులకే షాపులు దక్కాయి. ఉదాహరణకు ఒంగోలు, సంతనూతలపాడులో లిక్కర్ వ్యాపారులు అలాగే అధికారపార్టీ స్థానిక నేతలు వేర్వేరుగా సిండికేట్ అయి దరఖాస్తులు వేశారు. రెండు గ్రూపుల వారిని కళ్లుగప్పి కొత్తగా ఈ వైపు దృష్టిసారించిన అనేకమంది యువకులు దరఖాస్తులు వేశారు. ఎక్కువ ఆ రెండు గ్రూపుల వారికే వచ్చినా మధ్యలో కొత్త వారిని కూడా అదృష్టం వరించి కొన్ని షాపులు దక్కాయి.

ప్రముఖుడికి దక్కని షాపులు

వ్యాపారంలో ఆరితేరిన ఒక ప్రముఖుడు జిల్లా మొత్తంగా 25 షాపులకు దరఖాస్తులు పెట్టుకున్నా అదృష్టం వరించలేదని తెలిసింది. మార్కాపురంలో ఎక్కువ షాపులు పాత వ్యాపార ప్రముఖులు, టీడీపీ, జనసేన నాయకుల మద్దతు ఉన్న వారికే దక్కాయి. నియోజకవర్గం మొత్తంపై మూడు షాపులు వైసీపీ సానుభూతిపరులకు, నాలుగైదు షాపులు కొత్తవారికి దక్కాయి. గిద్దలూరు సర్కిల్‌లో ఒక షాపునకు ఒకే ఒక్క దరఖాస్తు వేసిన వైసీపీ సానుభూతిపరుడిని అదృష్టం వరించింది. మిగిలిన షాపులు ఎక్కువ భాగం టీడీపీ అనుకూల వ్యక్తులకు దక్కగా అక్కడ కొన్ని షాపులు కొత్తవారు చేజిక్కించుకున్నారు. దర్శిలో స్థానికేతరులకు సైతం కొన్ని షాపులు దక్కాయి. కనిగిరిలో మద్యం వ్యాపారంలో ఆరితేరిన పాతవారు ఈసారి దూరంగా ఉండగా ప్రస్తుతం రాజకీయంగా చురుగ్గా ఉన్నవారే గ్రూపుగా షాపులు దక్కించుకున్నారు. అయితే ఈ నియోజకవర్గంలోను కొత్తవారిని కొన్ని వరించాయి.

స్థానికేతరులకు దక్కిన షాపులు

కొండపి నియోజకవర్గంలో కొన్నిచోట్ల స్థానికేతరులకు షాపుల దక్కాయి. కందుకూరు నియోజకవర్గంలో ఆరు, ఏడు షాపులకు దరఖాస్తులు చేసిన టీడీపీ స్థానిక నేతకు ఒక్క షాపు దక్కలేదు. లిక్కర్ వ్యాపారంలో కొందరికి ఒకటి అర షాపులు దక్కగా కొందరిని అదృష్టం వరించలేదు. ఈ నియోజకవర్గంలోను కొత్తగా ఆ వైపు దృష్టిసారించిన యువకులకు అడపాదడపా అదృష్టం వరించింది. అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ప్రముఖులకు ఒక్క షాపు లభించలేదు. పాత వ్యాపారులతోపాటు కొత్తగా రంగంలోకి వచ్చిన వారిని అదృష్టం వరించింది. పర్చూరు నియోజకవర్గంలో అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారిని అదృష్టం వరించింది. చీరాల నియోజకవర్గంలో రాజకీయ మద్దతు కూడా ఉన్న ఒకరిద్దరికీ ఒక్క షాపు దక్కకపోగా ఈ వ్యాపారంలో కొత్తగా అడుగు పెడుతున్న వారికి కొన్ని షాపులు దక్కాయి.

బేరసారాలు, బెదిరింపులు

లాటరీ విధానంలో షాపులు దక్కించుకోలేకపోయిన వ్యాపార ప్రముఖులు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు కొత్తవారితో బేరసారాలకు దిగారు. మీరే షాపులను నడుపుకోవాలంటే ఇబ్బందులు పడక తప్పదంటూ బెదిరింపులు కూడా చేస్తున్నారు. 'మీ దరఖాస్తు ఫీజుతోపాటు రెండేళ్లకు సంబంధించి కొంత మొత్తాన్ని ఇస్తాం, షాపులు మేము నడుపుకుంటాం అందుకు అంగీకరించండి' అంటూ బేరసారాలకు దిగారు. కాదు కూడదంటే బెదిరింపులకు దిగారు. ఇటు రాజకీయ పలుకుబడి లేని వ్యాపార అనుభవం లేని వారికి నిబంధనలు కూడా ఇబ్బందిగా మారాయి. ఒక్కరోజు వ్యవధిలో అంటే బుధవారానికి వారు షాపు ఏర్పాటు చేసుకోవాలి. లైసెన్స్ ఫీజు కట్టాలి. వెంటనే విక్రయాలు ప్రారంభించాలి. లిక్కర్‌ను ఆర్డర్ పెట్టి తగు పద్ధతిలో తెచ్చుకోగలగాలి. షాపు ఏర్పాటులో జాప్యం చేసుకుంటే రోజువారి వచ్చే ఆదాయం కోల్పోతారు. అనువైన ప్రాంతంలో షాపు పెట్టుకోలేకపోయినా, వ్యాపారపరంగా కొంత నష్టపోవాల్సి వస్తుంది. ఇవన్నీ కొత్తగా ఈ వ్యాపారంలోకి వచ్చిన వారికి ఇబ్బందికరంగా మారాయి. దీనికితోడు పాత వ్యాపారులు తమకు షాపు ఇవ్వకపోతే రేపు నిర్వహణలో ఎక్సైజ్ అధికారులతో తనిఖీలు, కేసులు పెట్టిస్తామంటూ బెదిరిస్తున్నారు. లాటరీలో షాపు పొందిన స్థానికేతరులకైతే మీకు స్థానికంగా పెట్టుకునేందుకు అద్దె షాపులు కూడా ఇవ్వనీయమంటూ బెదిరిస్తున్నారు. తద్వారా లాటరీలో అదృష్టం వరించిన కొత్తవారికి లిక్కర్ వ్యాపార ప్రముఖుల నుంచి ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురై లిక్కర్ రాజకీయం స్పష్టంగా కనిపిస్తోంది.

అప్రమత్తంగా ఉండాలి

వర్షాలకు ఎలాంటి నష్టాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆదేశం

నేడు పాఠశాలలకు సెలవు

పంటనష్టాలను నివారించాలని ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీవర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలోని విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ఇస్తున్నట్లు తెలిపారు. అత్యవసరమైతే తప్ప రానున్న నాలుగు రోజుల పాటు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని కలెక్టర్ కోరారు. వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అన్సారియా మండలాల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మరో నాలుగు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీర ప్రాంత మండలాల అధికారులు పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. మరో వారంరోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న గర్భిణులను అస్పత్రులలో చేర్పించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలను తక్షణమే తుఫాన్ షెల్టర్లకు, పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీవర్షాల నేపథ్యంలో మంగళవారం కూడా జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఏవైనా సంక్షేమ వసతి గృహాలు ప్రమాదకరస్థితిలో ఉంటే వాటిలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను తక్షణమే ఇతర వసతి గృహాల్లోకి, సమీపంలోని సురక్షిత భవనాల్లోకి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు.

పంట నష్టాలను నివారించాలి

భారీవర్షాల వల్ల పంటలు నీట మునగకుండా చూడాలన్నారు. ఈ విషయంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను ఇవ్వాలని వ్యవసాయాధికారులను కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చూడాలన్నారు. వారి పడవలను కూడా తీరంలో లంగరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడకుండా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాలలో ప్రమాదకర స్థితిలో ఉన్న హోర్డింగ్‌లను తక్షణమే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయిలోనే ఉండాలి

పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్, రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సెలవులను రద్దుచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వాగులు, కాలువల వైపు ప్రజలు వెళ్ళకుండా హెచ్చరిక బోర్డులు పెట్టడంతో పాటు రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల సిబ్బంది అక్కడ గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు.

వానగండం

(5వ పేజీ తరువాయి)

ఉదయం వరకు మూడురోజుల్లో నగరంలో 106.40 మి.మీ వర్షపాతం నమోదు కాగా సోమవారం మరో 74.40 మి.మీ.కురిసింది. తిరిగి సోమవారం పగటి పూట కూడా పడుతూనే ఉంది.

నగరం జలమయం

ఒంగోలు నగరంలో ఏ ప్రాంతంలో చూసినా రోడ్లు, కాలువలు ఏకమై చెరువులు, వాగులు, వంకలను తలపిస్తూ నీరు ప్రవహిస్తోంది. శివారు కాలనీల్లోనే కాక పలు ప్రధాన ప్రాంతాల్లోనూ కూడా జలమయమయ్యాయి. ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు ఇలా అందరూ ఇక్కట్లు పడుతున్నారు. ఒంగోలుతోపాటు ఎస్ఎన్‌పాడు, కొండపి నియోజకవర్గాల్లోని తీర ప్రాంత మండలాల్లో ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. చాలాచోట్ల లోతట్టు కాలనీలు జలమయంతోపాటు పలు ప్రాంతాల్లో వాగులు పొంగి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పశ్చిమప్రాంతంలో అయితే పొలాల్లో విస్తారంగా పంటలు ఉండగా ఈ వర్షాలతో అవి దెబ్బతినే ప్రమాదం కనిపిస్తోంది. పత్తి, మిర్చి, కంది పంటలకు ఇంకా వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

లాభాల పంట

(5వ పేజీ తరువాయి)

ఒకవైపు ముదురు తోటల్లో ఆకు రెలుపు, మరోవైపు మొక్కలు నాటడం సాగింది. సంక్రాంతి తర్వాత ఎండల తీవ్రత కూడా ఇబ్బందిపెట్టింది. అలా అనేక ప్రతికూల పరిస్థితులతో పంటను రైతులు సాగు చేయగా 145 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అంచనాతో ఫిబ్రవరి 29న కొన్ని వేలంకేంద్రాలలో, మార్చి 6న మరికొన్నింటిలో పొగాకు కొనుగోళ్లను బోర్డు అధికారులు ప్రారంభించారు. తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.230 పలుకగా దాదాపు నెల రోజులు అలాగే సాగాయి. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల నేపథ్యంలో ఆ ధరలతో రైతులు నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. అనంతరం క్రమంగా పెరుగుతూ మేలు రకం గరిష్ఠ ధర ఒక దశలో రూ.389 వరకు వెళ్లింది. అంతేకాక మీడియం, లోగ్రేడ్ ధరలు సైతం భారీగా పెరిగాయి. సగం సమయం గ్రేడ్‌తో సంబంధం లేకుండా అన్ని గ్రేడ్‌లను ఇంచుమించు ఒకే ధరకు కొనుగోలు చేశారు. గతంలో ధరల కోసం రోడ్డెక్కి రైతులు ఆందోళనలు చేసే పరిస్థితి ఉండేది. అలాంటిది రెండు, మూడేళ్లుగా బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. మొత్తంగా మార్కెట్ మంచి ఊపు మీద సాగడంతో సగటు ధరలు కూడా భారీగా లభించాయి.

కిలోకు సగటు ధర రూ.266

దక్షిణాదిలో ఫిబ్రవరి 29నుంచి ప్రారంభమైన కొనుగోళ్లు సెప్టెంబరు ఆఖరు నుంచి ఒక్కో కేంద్రంలో ముగుస్తూ వచ్చి చివరగా కందుకూరు-1 వేలం కేంద్రంలో సోమవారంతో పూర్తయ్యాయి. దీంతో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. తొలుత 145 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా వేసినా చివరకు 153.58 మిలియన్ కిలోలు దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలలో కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.266.14 ధర లభించింది. తద్వారా పొగాకు రైతులకు రూ.4085.50 కోట్ల మేర రాబడి లభించింది. దక్షిణాదిలో 2021-22లో 76.57 మిలియన్ల విక్రయాలు జరగ్గా రూ. 172.50 సగటు ధర లభించింది. అలాగే 2022-23లో 123 మిలియన్ల విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.216.28 ధర లభించింది. అంటే ఈ ఏడాది సగటు ధర కిలోకు గత ఏడాది కన్నా రూ 50 అలాగే అంతకు ముందు ఏడాదికన్నా రూ.94.09 మేర పెరిగింది. ఈ రకంగా ధరలు పెరగడంతో రైతులు భారీగానే ఆదాయం పొందారు. సొంత భూమి, బ్యారన్ ఉన్న రైతులు ఒక్కో బ్యారన్‌కు సగటున రూ 5 లక్షలకు పైగా, కౌలు రైతులు రూ 3 లక్షలకు పైగా లాభం పొందినట్లు తెలుస్తోంది.

వేలంకేంద్రాల వారీగా ఈ సీజన్‌లో పంట కొనుగోళ్లు, లభించిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి.

వేలం కేంద్రం	కొనుగోలు జరిగిన పంట పరిమాణం (మిలియన్ కిలోలు)	లభించిన సగటు ధర (రూపాయల్లో)
వెల్లంపల్లి	15.06	275.77
ఒంగోలు-1	18.58	272.75
ఒంగోలు-2	13.80	265.05
టంగుటూరు	16.80	271.54
కొండపి	17.71	265.61
పొదిలి	14.73	263.60
కనిగిరి	7.95	252.60
కందుకూరు-1	16.14	273.00
కందుకూరు-2	14.21	263.28
కలిగిరి	7.68	253.84
డిసిపల్లి	10.39	250.36
మొత్తం	153.58	266.14

పరుగులు పెడుతున్న అభివృద్ధి

టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు

పెద్దదోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలలో భాగంగా దోర్నాలలోని కొత్తమసీదు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కన, శ్రీ షిరిడీ సాయి బాబా మందిరం ఎదురు వీధిలో, గిరిజన సహకార సంస్థ పక్కన వీధిలో 5రోడ్లకు గానూ రూ.50లక్షల నిధులతో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణాలకు ఎరిక్షన్‌బాబు సోమవారం కొబ్బరి కాయ కొట్టి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులపై దృష్టి సారించి గత ఐదేళ్లుగా శిథిలావస్థకు చేరిన రహదారులను బాగు చేసే దిశగా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ ఇస్మాయిల్, షేక్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, కే రాజేంద్ర, షేక్ మంజూర్ బాష, బట్టు సుధాకర్ రెడ్డి,టీ చెన్నారెడ్డి, షేక్ మౌలాలి, రషీ తదితరులు పాల్గొన్నారు.

భారీవర్షాల నేపథ్యంలో అప్రమత్తత



చీమకుర్తి, అక్టోబర్14(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీచేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. చీమకుర్తి మున్సిపాలిటీతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేసి 24 గంటలూ సేవలందించేలా ఉద్యోగులను నియమించారు. పట్టణంలో ప్రధాన డ్రైనేజ్‌ల్లో అడ్డుగా ఉన్న చెత్త, పూడికలను యుద్ధప్రాతిపదికపై సోమవారం తొలగించారు. వర్షపాతం ఎక్కువగా నమోదైతే ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. పనులను ఆయన పరిశీలించారు. మరోవైపు పోలీస్‌శాఖ సైతం అప్రమత్తంగా ముందస్తు చర్యలు చేపట్టారు. కాగా సోమవారం చీమకుర్తిలో ఒక మోస్తరు వర్షం కురిసింది. ఈ వర్షంతో ప్రయోజనమే తప్ప ఎటువంటి నష్టం లేదు. భారీవర్షాలు నమోదైతే మంచికలపాడు, పల్లామల్లి తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధమైన సజ్జ పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

లిక్కర్ లక్కు

(5వ పేజీ తరువాయి)

వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జోరున వర్షం పడుతున్నా లాటరీ తీస్తున్న అంబేడ్కర్ భవన్ వద్ద దరఖాస్తుదారులలు తడుస్తూనే వేచి ఉన్నారు. అధికారులు రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఐదు గంటల్లో లాటరీ ప్రక్రియను పూర్తిచేశారు. ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఒంగోలు 1 నంబరు దుకాణానికి లాటరీ తీసి విజేతగా నెప్పలి శ్రీనివాసరావును ప్రకటించారు. అనంతరం రెండు కౌంటర్లలో జరిగిన లాటరీ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. అంతేకాకుండా ఒక్కో దుకాణానికి లాటరీలో విజేతలను ప్రకటించినప్పటికీ మరో ఇద్దరు రిజర్వు అభ్యర్థులను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, ఏఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15 మంది మహిళకు మద్యం దుకాణాలు

మహిళలకు 15 మందికి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కె.ఖాజామొహిద్దీన్ తెలిపారు. వాటిలో ఒంగోలు సర్కిల్ పరిధిలో 4, చీమకుర్తిలో 1, సింగరాయకొండలో 3, పొదిలిలో 1, గిద్దలూరులో 2, దర్శిలో 2, కంభంలో 2 దుకాణాలు వచ్చాయని ఆయన తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాలు లాటరీ ద్వారా పొందిన వారు 24 గంటలలో లైసెన్స్ ఫీజు ఆరవ వంతు చెల్లించి ప్రొవిజనల్ లైసెన్స్‌లు పొందాలని ఈఎస్ కోరారు.

అధికంగా కొండపి దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 171 దుకాణాలకు సంబంధించి 3,466 దరఖాస్తులు రాగా వాటిలో ఎక్కువ కొండపిలో 58 నంబరు దుకాణానికి 46 వచ్చాయి. పొదిలి రూరల్ 71 నంబరు దుకాణం, హెచ్‌ఎంపాడు 72 దుకాణం, దర్శిలో 88 నంబరు దుకాణాలకు అత్యంత తక్కువగా 11 దరఖాస్తులు చొప్పున రావడం గమనార్హం. ఒక దరఖాస్తు వేసిన రిటైర్డ్ ఎక్సైజ్ అధికారికి అదృష్టం వరించి దుకాణం దక్కడం విశేషం. అదేవిధంగా 46 దరఖాస్తులు వేసిన ఓ వ్యాపారికి ఒక్క దుకాణం కూడా దక్కకపోవడంతో నిరాశగా వెనుదిరిగాడు. పొన్నలూరులో రెండు మద్యం దుకాణాలు ఉండగా అదృష్టం అన్నదమ్ములను వరించింది. పల్లపోతు ప్రసాద్, రమేష్‌లకు ఆ దుకాణాలు దక్కాయి.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

మద్యం దుకాణాల లాటరీ సందర్భంగా భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఏఆర్ .దామోదర్ స్వయంగా పరిశీలించారు. అంబేడ్కర్ భవనం వెలుపల, లోపల ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కర్నూలు రోడులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద కూడా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అక్కడ లైసెన్స్ ఫీజు చెల్లించే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూశారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రాఘవేంద్రరావులు ఉన్నారు.

లాటరీని అడ్డుకునే ప్రయత్నం చేసిన మహిళా సంఘాలు

మద్యం లాటరీ జరుగుతున్న అంబేడ్కర్ భవన్ వద్దకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొంతమంది మహిళలు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కంకణాల రమాదేవి, బి.పద్మలను అదుపులోకి తీసుకొని వన్‌టౌన్‌కు తరలించారు. మద్యనిషేధం అమలుచేయాలని, ప్రభుత్వ ప్రకటించిన పాలసీని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా పల్లె పండుగ

(5వ పేజీ తరువాయి)

మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని కొండపి మండలం పెట్లూరులో రూ.30 లక్షలతో చేపట్టిన రోడ్డు పనికి ఈ శంకుస్థాపన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో అక్కడి అధికారపార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని అటు అధికార యంత్రాంగం, ఇటు స్థానిక అధికార పార్టీ నేతలు సమన్వయంతో నిర్వహించారు. తొలిరోజున 57 గ్రామాల్లో 170 పనులకు భూమిపూజ కార్యక్రమాలను అధికారులు ఏర్పాటు చేయగా వర్షం కారణంగా కొన్నిచోట్ల అటంకం ఏర్పడినా అత్యధిక పనులను అనుకున్న ప్రకారం చేశారు. కాగా తొలిరోజున మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మినహా అందరూ కార్యక్రమంలో పాల్గొన్నారు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో పాలొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్‌విజయకుమార్ మద్దిపాడు మండలంలో, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి మండలంలో, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గిద్దలూరు మండలంలో, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలంలో, వైపాలెంఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు దోర్నాల మండలంలోని గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు.

ముగ్గురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు

జిల్లా పంచాయతీ కార్యాలయంలో అక్రమాలే కారణం

ఒంగోలుక్రైం, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ పరిధిలో పనిచేసే గ్రేడ్-5, 6 (సచివాలయ ఉద్యోగులు) కార్యదర్శుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడిన ముగ్గురు ఉద్యోగులపై ఒంగోలులోని టుటౌన్ పోలీసులు సోమవారం రాత్రి క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు జారీచేసే విషయంలో జూనియర్ సహాయకులు ఎంపీ కిషోర్‌బాబు, జిల్లా పంచాయతీ కార్యాలయ పూర్వ ఏవో ఎన్. శివప్రసాద్, కందుకూరు మండలం మహాదేవపురం డిజిటల్ అసిస్టెంట్ పి.సాయికోటేశ్వరరావు అక్రమాలకు పాల్పడుతున్నారని ఒంగోలుకు చెందిన రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి పెండ్యాల వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణాధికారి లోకేశ్వరరావు ఉద్యోగులను విచారించారు. ఉద్యోగుల బదిలీల్లో ఆర్థికపరమైన అక్రమాలకు పాల్పడినట్లు విచారణాధికారి లోకేశ్వరరావు విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ నివేదికను పరిశీలించిన కలెక్టర్ ఆర్థిక అక్రమాలకు పాల్పడిన ముగ్గురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడును ఆదేశించారు.

ఊరంతా ఉద్యోగులు!

ఆదర్శంగా నిలుస్తున్న వేంపాడు



అక్షరాస్యతలో మండలంలో అగ్రస్థానం

వేంపాడు. ఇది పేరుకు చిన్న గ్రామం. వేరొక పంచాయతీలో కలిసి ఉన్న ఊరు. 399 గడపల పల్లె. మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని ఆ ఊళ్లో ఒకప్పుడు అంతా మట్టి మనుషులే. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న ఆ మట్టిమనుషులు మాణిక్యాలను తయారు చేశారు. ఆరుగురి స్ఫూర్తితో ఆ ఊరి స్వరూపాన్ని మార్చేశారు. రెండు దశాబ్దాల క్రితం ఎక్కడుందో ఎవరికీ తెలియని ఆ గ్రామాన్ని 'ఉద్యోగులు ఊరు'గా పేరు తెచ్చారు. అక్షరాస్యతలో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిపారు. మొత్తం 300 మందికిపైగా వివిధ రకాల ఉద్యోగాల్లో స్థిరపడేలా చేశారు. వీరిలో 60మందికిపైగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో రాణిస్తున్నారు. ఆ విజయ గాథ వెనుక కృషిని తెలిపేదే ఈ కథనం..

- రెండు దశాబ్దాల క్రితం ఆరుగురి స్ఫూర్తితో మొదలై..
- ప్రస్తుతం 300మందికిపైగా ఉద్యోగులు
- వీరిలో 60 మందికిపైగా అమెరికాలో సాఫ్ట్‌వేర్లు

ముండ్లమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముండ్లమూరు పంచాయతీ పరిధిలో వేంపాడు గ్రామం అద్దంకి - దర్శి ప్రధాన రహదారి పక్కన ఉంది. ఒకప్పుడు ఆ ఊళ్లో 50 కుటుంబాలే ఉండేవి. ఆ గ్రామం ప్రధాన రహదారికి రెండోవైపున ఉండేది. అది లోతట్టు ప్రాంతంలో ఉండటంతో చిన్న వర్షానికి కూడా ఇళ్లలోకి నీళ్లొచ్చి జనం అవస్థలు పడేవారు. 1983లో రోడ్డుకు రెండోవైపునకు కుటుంబాలన్నీ ఎత్తి వచ్చాయి. వ్యవసాయంపైనే ఆధారపడ్డాయి. ఆ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్వర్గీయ అమరా రామారావు, స్వర్గీయ గంగినేని శాంతయ్య, వి.గోపాలకృష్ణయ్య, వి.ప్రసాదరావు పేరు ప్రఖ్యాతలు గడించారు. వారి తరువాత పాతూరి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయుడిగా, ముప్పాళ్ల కోటేశ్వరరావు పంచాయతీ రాజ్ శాఖ తాగునీటి విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి మంచి గుర్తింపు పొందారు. వీరిని స్ఫూర్తిగా తీసుకున్న ఆ గ్రామంలో ఉన్న మిగతా కుటుంబాలు తమ పిల్లలను ఉన్నత మైన ఉద్యోగులుగా చూడాలని భావించాయి. ఎంత ఖర్చయినా పిల్లలను చదివించుకోవాలన్న చైతన్యాన్ని పొందాయి. ప్రతి ఒక్కరిలోనూ ఇదే తపన కనిపించేది. క్రమంగా వారి బిడ్డల్లోనూ అదే సంకల్పం పురుడు పోసుకుంది. పట్టుదలతో చదువుల్లో రాణించారు. ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, కొందరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా దేశవిదేశాల్లో కొనసాగిస్తున్నారు.

దేశవిదేశాల్లో సాఫ్ట్‌వేర్లుగా...

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా మేదరమెట్ల పూర్ణచంద్రరరావు, కంకణంపాటి రామకృష్ణ, శ్యామల, వట్టికొండ రాకేష్, మేదరమెట్ల రాధా, మేదరమెట్ల రాజశేఖర్, మేదరమెట్ల రజిత, మేదరమెట్ల రఘు, యండ్లూరి నరేష్, బోడపాటి శివలింగ మూర్తి, బోడపాటి సురేంద్ర, బోడపాటి ప్రవీణ్, గంగినేని భావన, గంగినేని ఆదిత్య, గంగినేని రేణు, గంగినేని ఆమని, సోమేపల్లి చిన వసంత, సోమేపల్లి దివ్య, గుత్తా అశోక్, గుత్తా అనంతలక్ష్మి, వాసిరెడ్డి అనిల్, బోడపాటి విజయ కుమార్, బోడపాటి శాంతి, భారతి, మేదరమెట్ల అజయ్, బోడపాటి స్వప్న, ముప్పాళ్ల శిరీష, ముప్పాళ్ల దీపిక, ముప్పాళ్ల అనిల్, బోడపాటి మౌనిక, మేదరమెట్ల రాధా, మేదరమెట్ల సుబ్బారావు, గోపీ, హేమంత్ కుమార్‌తో పాటు మరి కొంత మంది అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా రాణిస్తున్నారు. గంగినేని నాగార్జున, అశోక్ చక్రవర్తి, బోడపాటి అనిల్, గంగినేని ప్రతాప్, తాడికొండ బ్రహ్మయ్య, గంగవరపు భార్గవ్ హైదరాబాద్‌లో సాఫ్‌వేర్ ఉద్యోగులుగా వివిధ కంపెనీల్లో పని చేస్తున్నారు. గంగవరపు శ్రీనాథ్, బోడపాటి రామా నాయుడు, బోడపాటి అరుణ్ కుమార్, దొడ్డాల సత్యనారాయణ ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

399 కుటుంబాలు 300 మందికిపైగా ఉద్యోగులు

వేంపాడులో ప్రస్తుతం 399 గృహాలున్నాయి. 1967 మంది నివశిస్తున్నారు. ఈ గ్రామం నుంచి అమెరికాలో 60 నుంచి 65 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరిలో 20 మందికిపైగా మహిళలున్నారు. ఇక లండన్, ఐర్లాండ్, ఆస్ట్రేలియా దేశాలతో పాటు చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, విశాఖపట్నంలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా మరికొంత మంది స్థిరపడ్డారు. ఇలా దాదాపు 300 మంది ఆ గ్రామంలో పుట్టి పెరిగి ఇతర ప్రాంతాల్లో వివిధ రకాల ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ప్రతి ఇంట్లో ఒకరి నుంచి ఇద్దరు ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా ఉన్నారు.

చాలా గర్వంగా ఉంది



నేను ఉద్యోగంలో చేరే కొత్తల్లో కేవలం ఊరు మొత్తం మీద పది మంది కూడా ఉద్యోగులుగా లేరు. 15 ఏళ్లలో ఊరి స్వరూపం మారింది. ప్రతి ఇంటిలో ఉద్యోగులున్నారు. వివిధ హోదాల్లో రాణిస్తున్నారు. అందువల్లే మా ఊరికి మంచి గుర్తింపు వచ్చింది.

- మేదరమెట్ల వీరయ్య చౌదరి, సీఐ

ప్రతి ఒక్కరిలో పట్టుదల పెరిగింది



మా గ్రామంలో ప్రతి ఒక్కరూ తమ బిడ్డలను చదివించి మంచి ఉద్యోగులుగా చూడాలనే కోరిక మా పెద్దవాళ్లలో చాలా బలంగా ఉండేది. ఆర్థిక భారమైనా ఎవరూ లెక్కచేయలేదు. పొలాలమ్మి చదివించినవారు చాలా మంది ఉన్నారు. అవన్నీ కళ్లారా చూసి లక్ష్యంతో చదివి ఉద్యోగాలు సంపాదించాం. ఇప్పుడు మా ఊరిని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది.

-గంగినేని నారాయణ, రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూ ఉద్యోగి

విదేశాల్లో ఉద్యోగం చేయాలన్న కల నెరవేరింది



విదేశాల్లో ఉద్యోగం చేసి అటు కుటుంబానికి, ఇటు గ్రామానికి పేరు తీసుకురావాలన్న పట్టుదల నాలో ఎక్కువగా ఉండేది. కష్టపడి చదివాను, నేడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాను. నాలాగే చాలా మంది ఈ రోజు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. వేంపాడు అంతా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అనే పేరొచ్చింది.

-బోడపాటి అజయ్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అమెరికా

సీఐలు, ఎస్సైలుగా..



పెద నారాయణ స్వామి

ప్రభుత్వ ఉద్యోగ శాఖలైన పోలీసు, రెవెన్యూ, బ్యాంకింగ్ రంగాల్లో మరికొంత మంది పని చేస్తున్నారు. గ్రామంలో పుట్టి పెరిగి పోలీసు శాఖలో చేరిన మేదరమెట్ల వీరయ్య గుంటూరులోని కొత్తపేటలో సీఐగా పని చేస్తున్నారు. తాల్లూరు పెద నారాయణ స్వామి పెదకాకానిలో సీఐగా పని చేస్తున్నారు. సాధినేని కృష్ణ నరసరావు పేటలో ట్రాఫిక్ సీఐగా పని చేస్తున్నారు. శ్రీరామ్ ఏసోబు ఎస్ఐగా, శ్రీరామ్ పూర్ణయ్య ఎస్ఐగా చేస్తున్నారు.

గోపాల భైరవుడు



గోవులకు పూజలు చేస్తున్న ఆనంద ఆశ్రమ ధర్మకర్త భైరవానందస్వామి

- గోమాతల సంరక్షణలో ఆనంద ఆశ్రమం
- దాతల సహకారంతో దినదినాభివృద్ధి

ఎవరికీ హానిచేయని మూగజీవాలవి. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తుల పూజలందుకునే దైవ స్వరూపాలవి. అవే గోవులు. చరిత్రలో పోతులూరి బ్రహ్మంగారు అయినా, శ్రీకృష్ణుడు అలయినా గోపాలకులే. అందుకే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో వాటి పాత్ర ఎంతో ముఖ్యం. వీటి సంరక్షణా అంతే ముఖ్యం అనుకున్నాడు ఓ ధర్మకర్త. వాటి ఆలనాపాలనా చూసుకోవడం కన్నతల్లికి సేవ చేయడంగా భావించాడు. ఆయనే దొనకొండ అడ్డరోడ్డులోని ఆనంద ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి. తిండిలేక రోడ్ల వెంబడి బక్కచిక్కి పోయిన గోవుల తీసుకొచ్చి దాతల సహకారంతో పదేళ్లుగా నిర్వహిస్తున్న శ్రీ వీరప్పయ్య గోశాలపై ప్రత్యేక కథనం..

దొనకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసింహ నాయునిపాలేనికి చెందిన బ్రహ్మేంద్రస్వామికి పరమ భక్తుడు భైరవానందస్వామి. దొనకొండ అడ్డరోడ్డులో ఆయన ఆనంద ఆశ్రమం ఏర్పాటు చేశారు. దాని ఆవరణలో బ్రహ్మేంద్రస్వామికి ఎంతో ఇష్టమైన గోవులను సంరక్షించాలని భావించాడు. 2014లో ఒక్క గోవుతో శ్రీ విరప్పయ్య గోశాలను మొదలుపెట్టాడు. అప్పటి నుంచి దాతలు ఉచితంగా అందించిన వరిగడ్డిని గోవులకు ఉపయోగించేవాడు. గోసంరక్షణ పేరుతో పలువురు ఆర్యవైశ్యుల దుకాణాల్లో పెట్టిన హుండీల ద్వారా వచ్చిన నగదుతో గో సంరక్షణ చేపడుతున్నాడు. ప్రస్తుతం గోశాలలో ఇప్పుడు 12 గోవులను పెంచుతున్నాడు. గోశాలలోని గోవుల మల మూత్రాలను శుభ్రం చేయడం, స్నానాలు చేయించడం లాంటి పనులతో గోసేవలో కాలం గడిపేస్తున్నాడు.

గో రక్షణతో సౌభాగ్యం



"బ్రహ్మేంద్రస్వామికి గోవుల పట్ల ఎంతో మక్కువ. ఆయన పేరుతో నిర్వహించే ఆశ్రమంలో దాతల సహకారంతో గోశాలను ఏర్పాటు చేయాలని భావించాం. ఎక్కడ గోవులు రక్షించబడతాయో అక్కడ సౌభాగ్యం వెల్లివిరుస్తుందని భక్తుల నమ్మకం. గోవుల సంరక్షణకు నా శాయశక్తులా కృషి చేస్తా. దాతలు గోశాల అభివృద్ధికి మరింత సహకారం అందించాలని ఆశిస్తున్నా"

- కాకర్ల భైరవానందస్వామి, ఆనంద ఆశ్రమం ధర్మకర్త

డీసీఎంఎస్ నిధుల గోల్‌మాల్‌లో

ముగ్గురిపై క్రిమినల్ కేసులు

తాలూకా పోలీస్ స్టేషన్‌లో నమోదు

ఒంగోలు విద్య, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో జరిగిన నిధుల గోల్‌మాల్‌లో బాధ్యులైన ముగ్గురిపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అప్పటి డీసీఎంఎస్ చైర్‌పర్సన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్ చుండూరి సతీష్, అకౌంటెంట్ బొమ్మరాజు రామ చంద్రరావులపై ఫిర్యాదు చేశారు. వివరాల్లోకెళ్తే... డీసీఎంఎస్‌లో సుమారు రూ.3.5 కోట్లు గోల్‌మాల్ అయ్యాయి. ఇండియన్ పొటాష్ లిమిటెడ్(ఐపీఎల్)కు చెల్లించేందుకు డీసీఎంఎస్ ఖాతాకు పోగాకు బోర్డు జమ చేసిన రూ.3.5కోట్లు పక్కదారి పట్టాయి. రైతుల ఎరువుల బకాయిలు ఐపీఎల్‌కు చెల్లించేందుకు విడుదల చేసిన ఆ నిధులను అకౌంటెంట్ రామచంద్రరావు తన స్వంత బ్యాంకు ఖాతాకు మళ్లించుకొన్నారు. దీనిపై అప్పటి డీసీవో రాజశేఖర్ విచారణకు ఆదేశించారు. విచారాణాధికారి బి.సి.హెచ్. మాలకొండయ్య విచారణ నిర్వహించి రూ.52.95 లక్షలు దుర్వినియోగమైనట్లు తేల్చారు. రామచంద్రరావు తన బ్యాంకు ఖాతాకు మళ్లించిన రూ.3.5కోట్లను 11 విడతలుగా సుమారు రూ.3 కోట్లు ఐపీఎల్ బ్యాంకు ఖాతాకు జమ చేశారు. మిగిలిన మొత్తం రూ.52.95 లక్షలు దుర్వినియోగానికి కారకులైన డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పద్మావతి, బిజినెస్ మేనేజర్ సతీష్, అకౌంటెంట్ రామచంద్రరావుల నుంచి వసూలు చేయాలని సిఫార్సు చేశారు. విచారణాధికారి నివేదికను డీసీఎంఎస్ మహాజన సభ ఆమోదించింది. డీసీఎంఎస్ పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటి రికవరీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారిపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపట్టేందుకు ప్రాసిక్యూట్ అనుమతి కోసం డీసీవో శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌కు ఫైల్ పెట్టారు. కలెక్టర్ అన్సారియా ప్రాసిక్యూట్‌కు అనుమతిస్తూ ఒంగోలు డివిజనల్ సహకారాధికారిని ఆ ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు. సివిల్ చర్యల కింద ఈ ముగ్గురిపై సర్‌చార్జి నోటీసులు జారీ చేసి నిధులు వసూలు చేయాలని డీసీవోను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం ఆ ముగ్గురిపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్

ఎన్నికల షెడ్యూల్ విడుదల

రేపు నామినేషన్ల స్వీకరణ, 23నపోలింగ్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గవర్నమెంట్ నర్సుల అసోసియేషన్ జిల్లా నూతనకమిటీ ఎన్నికలకు ఒంగోలు సబ్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసు అసిస్టెంట్ రిజస్ట్రార్ మాలకొండయ్య నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సెక్రటరీ, కోశాధికారితోపాటు ఐదు ఎగ్జిక్యూటివ్ పదవులకు నోటిఫికేషన్ ఇచ్చారు. స్థానిక రిమ్స్‌లోని మొదటి అంతస్తులోని 11వ నెంబరు గదిలో ఈనెల 16వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారు. 17న పరిశీలన, 18న ఉపసంహరణ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉండే అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఈ నెల 23వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్లు లెక్కిస్తామని ఎన్నికల అధికారి మాలకొండయ్య తెలిపారు.

పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాధిక

ఒంగోలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా జి.ఆర్.రాధిక సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. గతంలో ఆమె శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా పనిచేశారు. ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకున్న రాధికను కళాశాల సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి



పెట్లూరులో పల్లెపండుగ ర్యాలీలో పాల్గొన్న స్వామి

కొండపి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. పల్లె పండుగ ద్వారా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. మండలంలోని పెట్లూరు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్య చౌదరి, హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసప్రసాద్, డీపీవో జి.వెంకటనాయుడు, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, పీఆర్ కొండపి సబ్‌డివిజన్ డీఈఈ జె.రవిబాబు, ఏపీడీ వెంకటస్వామి, ఎంపీడీవో బి.రామాంజనేయులు, తహసీల్దార్ పి.మురళి, పీఆర్ ఏఈ బి.ప్రసాదరావు, సర్పంచ్ ఆరితోటి ఝాన్సీరాణి, గ్రామ నాయకులు బొల్లినేని నరసింహం, ఆరితోటి బాబూరావు, ఉపసర్పంచ్ మూలె రామారావు, కందిమళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి స్వామి

టంగుటూరు : బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కోరారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. ప్రజలకు అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని మంత్రి సూచించారు.

పునరావాస కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ అన్సారియా



ఆలకూరపాడు పునరావాస కేంద్రంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అన్సారియా

టంగుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మండలంలోని ఆలకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడుతూ మునిసి అవతలి పాతపల్లారెడ్డిపాలెంలోని 11 గిరిజన కుటుంబాలకు చెందిన 35మందిని ఇక్కడికి తరలించినట్లు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ బాధితులతో మాట్లాడారు. వారి కోసం తెచ్చిన భోజనాన్ని ఆమె పరిశీలించి స్వయంగా వడ్డించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎంపీడీవో దేవసేనకుమారి, ఇతర అధికారులు ఉన్నారు.

పాకలలో..

సింగరాయకొండ : మండలంలోని పాకల హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. తీరం వెంబడి, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను ముందస్తు జాగ్రత్తగా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వారికి భోజన సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే విజయ్‌కుమార్



మద్దిపాడులో సిమెంట్‌రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

మద్దిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ చెప్పారు. సోమవారం మండలంలో మద్దిపాడు, వెల్లంపల్లి, ఏడుగుండ్లపాడు, తెల్లబాడు, దొడ్డవరం, ఇనమెనమెళ్లూరు గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. టీడీపీ ప్రభుత్వం నిరంతరం పేదల అభ్యున్నతికి కృషిచేస్తోందన్నారు. అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ఎంపీడీవో వి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డీఈ క్రిష్ణమోహన్, రాష్ట్ర టీడీపీ నేత అడకా స్వాములు, మండవ రంగారావు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, గోపిచంద్, రఘుబాబు, అనిల్‌కుమార్‌యాదవ్, శివక్రిష్ణ, భవానీ, గోవిందరాజులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'గుండ్లకమ్మ'లో మూడు గేట్ల ఎత్తివేత

మద్దిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ద్రోణి ప్రభావంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి సోమవారం నీటి ఉధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వర్షపునీరు 7వేల క్యూసెక్కులు చేరడంతో అధికారులు రిజర్వాయరులోని మూడు గేట్లను ఎత్తి 12వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

బాలికపై అత్యాచారయత్నం

మద్దిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాలికపై ఓవ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన ఘటన మండలంలోని సీతారాంపురం బీసీ కాలనీలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు కథనం మేరకు బీసీ కాలనీకి చెందిన ఎడవల్లి హనుమంతరావు ఎనిమిదేళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడని శనివారం మద్దిపాడు పోలీసులకు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదుచేశారు. నిందితుడిపై ఎస్సై శివరామయ్య పోక్సో కేసు నమోదు చేశారు.


కంభంలో నిర్వహిస్తున్న గ్రామోత్సవం

ముగిసిన గ్రామోత్సవం

కంభం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కంభంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఉదయంతో ముగిశాయి. ఆదివారం రాత్రి 11 గంటలకు వాసవీ దేవాలయం నుంచి అమ్మవారు మహిషాసురమర్ధిని అలంకారంలో సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని అన్ని ప్రధాన వీధుల్లో సోమవారం ఉదయం వరకు వర్షంలోనే గ్రామోత్సవం సాగింది. అమ్మవారికి భక్తులు కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలలో భాగంగా చివరి రోజు ఆదివారం రాత్రి ప్రారంభమైన గ్రామోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మార్కాపురం డీఎస్పీ మల్లికార్జున ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 150 మంది బందోబస్తు నిర్వహించారు.

తహసీల్దార్‌గా వెంకటేశ్వర్లు


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్లు

గిద్దలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండల తహసీల్దార్‌గా ఎల్.వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అర్థవీడు మండల డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వెంకటేశ్వర్లు ప్రమోషన్‌పై రాచర్ల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా సేవలు అందించాలని, అలాగే సమస్యలపై వచ్చిన అర్జీలను పూర్తిస్థాయిలో విచారణ జరిపి వేగవంతంగా ప్రజలకు న్యాయం చేయాలని సూచించారు.

రోడ్లపైనే ఆవుల సంచారం

- తరచూ ప్రమాదాలు


గాయపడిన ఆవుకు చికిత్స చేస్తున్న స్థానికులు

గిద్దలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆవులు జాతీయ రహదారిపై ఎక్కడపడితే అక్కడ తిరుగుతుండడం, రాత్రివేళల్లో రోడ్డు మార్జిన్లలో నిద్రిస్తుండడం చేస్తున్నాయి. దీని వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఢీకొని ఆవులు గాయపడడమో లేదా వాహన చోదకులు గాయపడడమో జరుగుతోంది. ఆవుల యజమానులు ఎవరో కూడా తెలియని పరిస్థితి ఉంటున్నది. నియంత్రణ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండగా ఈవారంలోనే రెండు మూడు చోట్ల గుర్తు తెలియని వాహనాలు ఢీకొని ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని ఆవుల యజమానులతో చర్చించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాలి


ఎమ్మెల్యే కందులతో పంచాయతీరాజ్ సిబ్బంది

మార్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలుచేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మార్కాపురం, తర్లుపాడు మండలాలకు చెందిన పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ సిబ్బంది సోమవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆయా మండలాల పరిధిలోని పలు విషయాలను ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఆయన్ను కలిసిన వారిలో వి.శ్రీనివాస్, రమణారెడ్డి, కోటేశ్వరరెడ్డి, ఝాన్సీ, బాలునాయక్, ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, అబ్రహాం, వలి తదితరులు ఉన్నారు.

అత్యధిక దుకాణాలు కూటమి నేతలకే

- సిండికెట్ అయ్యేందుకు యత్నాలు

మార్కాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం ఒంగోలులో సోమవారం మద్యం దుకాణాలకు లాటరీ తీశారు. మార్కాపురం నియోజకవర్గంలో ఎక్కువ మొత్తంలో దుకాణాలు లాటరీలో టీడీపీ, జనసేన కూటమి నాయకులకే దక్కాయి. నియోజకవర్గంలో మొత్తం 19 దుకాణాలకుగాను 15 కూటమి నాయకులే దక్కించుకున్నారు. మార్కాపురం పట్టణంలో నాలుగు దుకాణాలకుగాను రెండు టీడీపీ, రెండు జనసేన పార్టీయులు, మండల పరిధిలోని మూడు దుకాణాలకు గాను రెండు జనసేన, ఒకటి టీడీపీ నాయకులకు, పొదిలి నగర పంచాయతీ, మండల పరిధిలోని 7 దుకాణాల్లో 4 కూటమి నాయకులకు, కొనకనమిట్ల మండలంలోని మూడు దుకాణాల్లో రెండు టీడీపీ నాయకులకు, తర్లుపాడు మండలంలోని రెండు దుకాణాలు టీడీపీ నాయకులకే దక్కాయి. వైసీపీకి చెందిన వారు లాటరీలో మూడు షాపులు దక్కించుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోటీపడి దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారం చేసే అవకాశాలు తక్కువే.

ప్రారంభమైన మంతనాలు

మార్కాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేనకు చెందిన నాయకులు విడివిడిగా వర్గాలుగా విడిపోయి అన్ని దుకాణాలకు దరఖాస్తులు చేశారు. ఒకే పార్టీకి చెందిన వారు కూడా గ్రూపులుగా విడిపోయి దరఖాస్తులు చేసుకున్నారు. మార్కాపురం పట్టణంలోని నాలుగు దుకాణాలు దక్కించుకున్న వారు కూడా నాలుగు గ్రూపులకు చెందిన వాళ్లే. ఆయా గ్రూపుల్లో 10 నుంచి 20 మంది వరకు కలిసి దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం ప్రధాన నాయకులు రంగంలోకి దిగారు. అందరూ కలిసి సిండికేట్‌గా ఏర్పడేందుకు మంతనాలు మొదలుపెట్టారు. ఈ క్రమం లో ఒక్కో గ్రూపు ఎన్ని దరఖాస్తులు చేసిందో లెక్కలు వేసుకుంటున్నారు. అందరూ కలిసి సిండికేట్‌గా మారి వ్యాపారం చేయాలంటే వారందరూ కలిసి దరఖాస్తు రుసుముకు పెట్టిన పెట్టుబడులు ఎంతో తేల్చుకోవాలి. ప్రస్తుతం ఈ ప్రక్రియే సాగుతోంది. తర్లుపాడు మండలంలో ఒక దుకాణం దక్కించుకున్న టీడీపీ గ్రూపు మొత్తం 12 దరఖాస్తులు వేశారు. మొత్తం మీద 20 మంది వరకు ఆ గ్రూపులో ఉన్నారు. అందరూ కలిసి దుకాణం ఏర్పాటు చేస్తారా లేక సిండికెట్‌లో కలిసిపోతారా అనేది తేలాల్సివుంది. పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో వైసీపీకి చెందిన ముగ్గురు షాపులు దక్కించుకున్నారు. వీరు ఎలా ముందుకు వెళతారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఏది ఏమైనా నియోజకవర్గంలో మార్కాపురం, పొదిలి పట్టణాలతోపాటు అన్ని మండలాల్లో సిండికేట్‌గా మారేందుకే దుకాణాలు దక్కించుకున్న వారు మొగ్గుచూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

రేపటి నుంచి నూతన మద్యం షాపులు

కొమరోలు, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కొమరోలు మండలంలోని మూడు మద్యం షాపులకు సోమవారం ఒంగోలులో కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీ డిప్ జరిగింది. మొత్తం మద్యం షాపులకు 48 దరఖాస్తులు రాగా అందులో లాటరీ ద్వారా ముగ్గురు దక్కించుకున్నారు. వీరిలో 144నెంబరుకు 18దరఖాస్తులు రాగా అందులో కొమరోలు మండలం బాదినేనిపల్లి గ్రామానికి చెందిన బండి తిరుమలనాథ్, 145 నెంబరు గల షాపునకు 15 దరఖాస్తులు రాగా అందులో గిద్దలూరుకు చెందిన డాక్టర్ నాగిరెడ్డి బ్రహ్మానందరెడ్డి, 146 నంబర్ షాపునకు 15 దరఖాస్తులు రాగా అందులో బేస్తవారిపేట మండలానికి చెందిన కొయ్య రాజ్యలక్ష్మి దేవి దక్కించుకున్నారు. ఈషాపులు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

పొదిలి పరిధిలో..

పొదిలి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ఎక్సైజ్ పరిధిలో 16 షాపులకు సోమవారం లక్కీడిప్‌తీశారు. 7 షాపులకు గాను 65 నుంచి 71వరకు పేరం రామాంజనేయులు, ఆవులూరి కోటేశ్వరరావు, బోయిళ్ళ నాగేశ్వరరెడ్డి, టంగుటూరి వెంకట్రావు, మట్టా వేణు, ఈర్ల వెంకటేశ్వర్లు, జరుబుల రమణయ్య, అలాగే హనుమంతునిపాడు మండలంలో 72, 73 షాపులకు మల్లెల వెంకటరెడ్డి, సంగా బాలరాజులు, కొనకనమిట్ల మండలంలో 74, 75, 76 షాపులకు వరికూటి లక్ష్మీతాయారు, ముక్కల నరసింహారెడ్డి, ముతుకుల నాగేశ్వరరావు , మర్రిపూడి మండలంలో 77, 78 షాపులకు ఉమ్మనబోయిన సుబ్బారావు, గొంటు హనుమారెడ్డిలు, తర్లుపాడు మండలంలో 79, 80 షాపులకు కూనపులి దత్తాత్రేయ మహేష్, ముక్కళ్ళ శ్యామ్‌కుమార్‌లు దక్కించుకున్నట్లు సీఐ అరుణకుమారి తెలిపారు. ఈ నూతన మద్యం విధానం 16వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని చెప్పారు.

లక్కీడిప్‌లో పలువుకి మద్యం దుకాణాలు

గిద్దలూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల్లోని 13 మద్యం దుకాణాలకు ఇటీవల ప్రభుత్వం నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో సోమవారం కలెక్టర్ సమక్షంలో లక్కీడిప్ తీయగా 13 షాపులను కైవసం చేసుకున్నారు. మొత్తం 13 దుకాణాలకు 230 దరఖాస్తులు రాగా లక్కీడ్రాలో విజేతలను కలెక్టర్ ప్రకటించారు. గిద్దలూరు పట్టణంలోని షాపు నెంబరు 136కు కె.రవీంద్రరెడ్డి, 137వ షాపునకు పిడతల పద్మజ, 138వ షాపునకు సి.హెచ్.సురేష్‌రెడ్డి, 139వ షాపునకు వాడకట్టు సాయికుమార్, 140వ షాపునకు బండారి నోవెల్, రూరల్ 141వ షాపునకు ఎం.సుదర్శన్, 142వ షాపునకు నాగిరెడ్డి కేతిరెడ్డి, 143వ షాపునకు కంచర్ల కిరణ్ గెలుపొందారు. కొమరోలు మండలంలోని 144వ షాపునకు బండి తిరుమలనాథ్, 145వ షాపునకు బి.నాగిరెడ్డి, 146వ షాపునకు కె.రాజ్యలక్ష్మీదేవి, రాచర్ల మండలంలోని 147వ షాపునకు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, 148వ షాపునకు పగడాల రమేష్‌లు కైవసం చేసుకున్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

పల్లె పండుగ వారోత్సవాలు ప్రారంభం


కెఎస్‌పల్లెలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


గిద్దలూరు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గ్రామంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించే బాధ్యతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి అన్నారు. పల్లె పండుగ వారోత్సవాలను సోమవారం ఆయన మండలంలోని కెఎస్‌పల్లె పంచాయతీలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అశోకొరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి చేసే దిశగా నేడు తొలి అడుగు పడిందని ఆయన అన్నారు. గత వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమని, నేడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో అన్ని రంగాలలో ముందుకు నడిపించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కెఎస్‌పల్లె పంచాయతీలోని ఉప్పలపాడులో రూ. 10లక్షలు, అక్కులరెడ్డిపల్లెలో రూ. 10లక్షలు, కెఎస్‌పల్లెలో రూ. 30లక్షలతో నిర్మించనున్న అంతర్గత సిమెంటు రోడ్లకు అశోకొరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బుడత మధుసూదన్, మండలపార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, టీడీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించండి

నిరంతరం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందించి వారి ఆదరాభిమానాలు పొందాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోకొరెడ్డి అన్నారు. సోమవారం రాత్రి గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చి వైద్య సేవలు పొందే రోగుల పట్ల వైద్యులు ప్రేమానురాగాలతో సేవలు అందించాలన్నారు. తాను ఈ వైద్యశాల పట్ల అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నానని, నిరంతరం పేదలకు వైద్యసేవలు అందే విధంగా చూడాలన్నారు. ఈవైద్యశాలలో 100 పడకల కోసం గతంలో తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నిరంతరం ప్రజలకు సేవలు అందిస్తూ వైద్యులు ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదామ్, డాక్టర్ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ దాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో మెలగాలి

కొమరోలు : ప్రజలు సుఖశాంతులతో మెలగాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామంలో గార్శియా పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు ఎమ్మెల్యే అశోకొరెడ్డి దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కులమతాలకు అతీతంగా జరుపుకుంటూ కలసిమెలసి ఉండేందుకు ఈ పండుగ దోహదపడుతుందన్నారు. అనంతరం ముస్లింలతో కలసి భోజనం చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు, నాయకులు గోడి ఓబుల్‌రెడ్డి, ముత్తుముల సంజీవరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సచివాయలంలో సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన వైపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్‌బాబు

సీఎంకు రూ. 30.85 లక్షల చెక్కు అందజేత

పుల్లలచెరువు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):విజయవాడ వరద బాధితులకు టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సీఎం చంద్రబాబు నాయుడిని కలిసి రూ. 30.85 లక్షల చెక్కును అందజేశారు. సోమవారం అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి ఈమేరకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా వరద బాధితులకు అండగా నిలిచిన దాతలను, ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు,చేపట్టాల్సి అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, మేకల వలరాజు,టీడీపీ నాయకులు శనగ నారాయణరెడ్డి, కాకర్ల కోటయ్య,షేక్ బాబు,బీవి సుబ్బారెడ్డి,గోట్టం శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత నగరోత్సవం


ప్రత్యేక అలంకరణలో వాసవీమాత

మార్కాపురం వన్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో వెలసియున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. 10రోజుల పాటు అమ్మవారికి వివిధ అలంకారాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి వాసవీమాత ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో పులి వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలు, మంగళ వాయిద్యాలు, తీన్మార్ తప్పెట్లు భక్తుల కోలాట ప్రదర్శనల నడుమ అమ్మవారి నగరోత్సవం జరిగింది. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి సూరె వెంకటసుబ్బారావు, కోశాధికారి ఆమడుగు వెంకట రమేష్, కమిటీ ఆధ్వర్యంలో నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అడుగడుగునా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అక్రమ పద్ధతిలో తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పని చేస్తున్న 20 మంది ఇంజనీరింగ్ కార్మికులను ఎటువంటి సమాచారం లేకుండా అక్రమంగా తొలగించటం దారుణమన్నారు. కార్మిక చట్టాలను పాటించకుండా ఏకపక్షంగా తొలగించడాన్ని ఆయన ఖండించారు. అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి ఇటువంటి చర్యలకు పూనుకోవటం విచారకరమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కె.సుబ్బరాయుడు, హరి, రమణ, చెన్నయ్య, శేశిరెడ్డి, యూసఫ్, సలాంఖాన్, షేక్ ఇమాంసా తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో భాగ్యవతి

మార్కాపురం రూరల్ , అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాలలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో వై. భాగ్యవతి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బండి లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల పరిధిలోని లైన్ డిపార్ట్‌మెంట్‌ల మండల స్థాయి అధికారులు తమ శాఖల పరిధిలో ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వ రాయితీ, సంక్షేమ పథకాల వివరాలను సభలో వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాలలో అభివృద్ధికి సహకరించాలని కోరారు. జడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి మాట్లాడుతూ గజ్జలకొండ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను కొందరు యంత్రాలతో నీటి కుంటలను తవ్వుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఎంఈవో రాందాస్ నాయక్, ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏపీవో జీవరత్నం, వెలుగు ఏపీఎం డి. పిచ్చయ్య, విద్యుత్ శాఖ ఏఈ నాగేంద్రరెడ్డి, వైద్య ఆరోగ్య, పశుసంవర్ధక , ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వసంతోత్సవం

గిద్దలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రులలో భాగంగా సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో వసంతోత్సవం నిర్వహించారు. అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు సాగింది. అనంతరం ఆర్యవైశ్యులు, మహిళా మండలి సభ్యులు అమ్మవారిశాల ఎదుట ప్రత్యేక పూజలు అనంతరం వసంతోత్సవంలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

అధ్యాపకుడు సురేష్‌బాబు మృతి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీహెచ్‌ఆర్ విద్యా సంస్థలలోని చైతన్య కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న బడుగు సురేష్ బాబు ఆదివారం రాత్రి మృతి చెందారు. బాపట్ల జిల్లా కారంచేడు మండలం కుంకలమర్రుకు చెందిన సురేష్ బాబు గుంటూరులో ఓ ప్రైవేట్ వైద్యశాలలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయారు. వీహెచ్‌ఆర్ విద్యాసంస్థ అధినేత వెన్నా హనుమారెడ్డి, కరస్పాండెంట్ వెన్నా ఇందిరలు కుంకలమర్రు వెళ్లి సురేష్‌బాబు మృతదేహానికి నివాళులర్పించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మార్కాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఉచిత శిక్షణకు ఈ నెల 21 వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎన్ అరుణకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుకు మూడు నెలల పాటు ఉచిత బోధన, భోజన, వసతి సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులు శిక్షణ పొందుటకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుగు ప్రయాణంలో..

తప్పని తిప్పలు

బస్ సౌకర్యం లేక.. ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక అవస్థలు



ప్రయాణికులతో రద్దీగా ఉన్న దొనకొండ రైల్వేస్టేషన్

దొనకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎన్నో వ్యయప్రయాసలకోర్చి దసరా వేడుకలకు సొంతూళ్లకు వచ్చిన పలుగ్రామాలకు చెందిన ప్రజలకు తిరుగు ప్రయాణంలో తిప్పలు తప్పలేదు. దొనకొండ ప్రాంత ప్రజలకు రోడ్డుమార్గాన బస్ సౌకర్యం లేకపోవటంతో రైలు ప్రమాణం తప్పనిసరి. ఈక్రమంలో దొనకొండ రైల్వేస్టేషన్ మీదుగా పగలు ప్రయాణించే రైళ్ల ప్రయాణికులతో కిటకిటలాడటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఈప్రాంతానికి చెందినవారు వివిధ ప్రాంతాల్లో వివిధ వృత్తుల్లో ఉన్నారు. బెంగుళూరు. విశాఖపట్టణం, హైదరాబాద్ తదితర ముఖ్య పట్టణాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నవారు, విద్యార్థులు స్వగ్రామాలకు వచ్చారు. శుక్ర, శని, ఆదివారాలు సెలవులు కావటంతో దసరా పండగకు ఇబ్బందులు పడుతూ వచ్చారు. స్వగ్రామాల్లో బంధుమిత్రుల మధ్య దసరా వేడుకలు సంతోషంగా జరుపుకొని ఆదివారం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు.

అయితే, ముఖ్య పట్టణ ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు దొనకొండ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ లేదు. దానికితోడు బస్సు సౌకర్యం లేదు. దీంతో వృద్ధులు, చిన్నారులతో ప్రయాణికులు తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు రైలు ప్రయాణం తప్ప మరో మార్గంలేదు. దీంతో రైళ్లలో కిక్కిరిసి ప్రయాణం కొనసాగించారు. రైళ్లు ఎక్కలేని మరికొందరు ప్రైవేట్ వాహనాలు మాట్లాడుకొని తిరుగు ప్రయాణమయ్యారు. అధికారులు, పాలకులు పండగల సమయంలో దొనకొండ మీదుగా ప్రత్యేక బస్సులు, రైళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టి ప్రజలకు రవాణా ఇబ్బందులను తొలగించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వర్షాలకు పైర్లలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి

కనిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు పైర్లలో నీరు నిల్వలేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో సోమవారం కురిసిన వర్షాలకు రైతులకు తగు జాగ్రత్తలు సూచించారు. సీఎస్‌పురం, పీసీపల్లి మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఈ వర్షం మెట్ట పైర్లకు జీవం పోసిందని చెప్పారు. కనిగిరి మండలంతో పాటు ఇతర ఆరు మండలాల్లో అత్యధికంగా కంది సాగులో ఉందన్నారు.

కంది సాగు చేపట్టిన రైతులు పైరులో నీరు నిలవకుండా చూసుకోవటంతో పాటు ప్రస్తుతం నేల అదునుగా మారిన ఈ సమయంలో మెట్ల పైర్లు వేసుకుంటే ఆశాజనకంగా ఉంటుందన్నారు. జొన్న, సజ్జ, శనగ పంటలకు ఎంతో అదనుగా మారిందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దోపిడీ కేసులో నిందితుడికి జైలుశిక్ష

దొనకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు వస్తువులను దోపిడీ చేసిన నిందితుడికి దర్శి మేజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. దొనకొండలోని అరబస్తాన్ వీధిలోని ప్రదాన రహదారిలో చిల్లంచర్ల వెంకట రమేష్, భార్య రామలక్ష్మీలు కూల్‌డ్రింక్స్ షాపు నిర్వహిస్తున్నారు. జనవరి 5, 2019లో పల్నాడు జిల్లా, ఆత్మకూరు గ్రామానికి చెందిన పొన్నూరి చిన్నసత్యానందం ఇంట్లో ఒంటరిగా ఉన్న రామలక్ష్మీని బెదిరించి మెడలో ఉన్న బంగారు తాళిబొట్టు తీసుకున్నాడు. తన వద్ద ఉన్న కత్తితో చెవి దిద్దులు కోయబోగా ఆమె గట్టిగా కేకలు వేయడంతో పరారయ్యాడు.

ఈ మేరకు దొనకొండ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలి పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు చిన్నసత్యానందంకు దర్శి అసిస్టెంట్ సెషన్స్ న్యాయాధికారి ఎస్. శివశంకరరెడ్డి సోమవారం మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.3వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

భక్తి శ్రద్ధలతో చెన్నకేశవస్వామి కొలుపులు

పామూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : చెన్నకేశవస్వామి కొలుపులను ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం సీఎస్‌పురం రోడ్డులోగల శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

మద్యం వ్యాపారంలో మిలాఖత్!



ముందుగానే వాటాల ఒప్పందం

గుట్టుగా కూటమి వర్గీయుల

పేర్లతోనే దరఖాస్తులు

ఈ గ్రూపులకు దక్కిన మూడు షాపులు

వైసీపీతో అంటకాగిన వ్యవహారాన్ని పరిశీలిస్తున్న నియోజకవర్గ నాయకులు

దర్శి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో లిక్కర్ వ్యాపారంలో కొంతమంది స్థానిక కూటమి నాయకులతో వైసీపీ నాయకులు మిలాఖత్ అయినట్లు తెలుస్తుంది. ముందుగానే వాటాల విషయం, ఆర్థిక లావాదేవీలు, తదితర అంశాలపై ఒక అవగాహన కుదుర్చుకొని కూటమి వర్గీయుల పేర్లతోనే దరఖాస్తులు దాఖలు చేసినట్లు సమాచారం. మిలాఖత్ అయిన ఇరువర్గాలకు చెందిన నాయకులకు మూడు షాపులు దక్కినట్లు సమాచారం.

నియోజకవర్గంలో మిలాఖత్ వ్యాపారాలు, చీకటి ఒప్పందాలు సర్వసాధారణంగా మారాయి. ఎన్నికల సమయంలో ఆయా పార్టీల కోసం సామాన్య కార్యకర్తలు ప్రాణాలొడ్డి పోరాడుతుంటారు. కొందరు స్థానిక నాయకులు తమ వ్యాపార లబ్ధి కోసం పార్టీలను పక్కనపెట్టి మిలాఖత్ అవుతుండటంతో ప్రజలు విస్తుపోతున్నారు. గత కొంతకాలంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం, లిక్కర్ వ్యాపారం మరికొన్ని వ్యాపారాలు కూటమి, వైసీపీ నాయకులు కొంతమంది కలిసి చేస్తున్న విషయం తెలిసిందే. సాధారణ ఎన్నికల్లో నువ్వా, నేనా అన్నట్లు తలపడిన సంఘటనలు మర్చిపోయి కొంతమంది లిక్కర్ వ్యాపారంలో మళ్లీ మిలాఖత్ కావటం తీవ్ర చర్చనీయాంశమైంది. ఒక కూటమి నేత బియ్యం వ్యాపారంలో ఒక వైసీపీ నాయకుడిని కలుపుకొని సిండికేట్‌లో చేరినట్లు తెలుస్తుంది. అయితే, ఆ వైసీపీ నాయకుడి పేరు బయటకు రాకుండా మొత్తం వాటా తనదేనంటూ బయట చెప్పుకుంటున్నాడు. తాజాగా లిక్కర్ వ్యాపారంలో కూడా ఆ కూటమి నేత కొంతమంది వైసీపీ నాయకులతో కలిసి ఒప్పందం కుదుర్చుకొని దరఖాస్తులు చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఆ కూటమి నేతకు షాపు దక్కటంతో ఈవిషయం చర్చనీయాంశమైంది. అదేవిధంగా మరికొన్ని షాపులకు సంబంధించి కూడా కూటమి, వైసీపీ నాయకులు కలిసి దరఖాస్తులు వేయటంతో ఆమేరకు రహస్యంగా వాటాలు ఏర్పాటుచేసుకునే ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం అలాంటి చీకటి ఒప్పందాలు ఏమిలేవని వారు పైకి బుకాయిస్తున్నప్పటికీ కాలక్రమంలో ఈ మిలాఖత్ వ్యాపారాలు ఖచ్చితంగా బట్టబయలయ్యే అవకాశం ఉంది.

నిశితంగా పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

జరుగుతున్న పరిణామాలను నియోజకవర్గ టీడీపీ నాయకులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఆ నాయకులు దర్శి నియోజకవర్గ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తూ ముందుకు సాగుతున్నారు. అదేవిధంగా కూటమి నాయకులను అందరినీ కలుపుకొని వారికి అవసరమైన సహకారం అందిస్తున్నారు. నియోజకవర్గ నాయకులు ఎంతో చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నా స్థానిక నాయకులు ఇవేమి తమకు పట్టనట్లు ఇష్టానుసారంగా మిలాఖత్ వ్యాపారాలకు దిగుతుండటంతో భవిష్యత్తులో ఇలాంటి వారికి తగిన గుణపాఠం జరుగుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సీసీ రోడ్లకు శంకుస్థాపన



ఏరువారిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

కనిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పునుగోడు, బొమ్మిరెడ్డిపల్లి, ఏరువారిపల్లి గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందినప్పుడే ప్రగతి సాధ్యమన్నారు. అందుకోసమే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సుదుద్దేశంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా నరేగా నిధులతో గ్రామాల్లో రోడ్డు రవాణా మెరుగుపరచేందుకు సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టినట్టు చెప్పారు. అందులో భాగంగా రా ష్ట్రంలో కనిగిరి నియోజ కవర్గం ఎంపికైందన్నా రు. తొలి విడత కింద కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.15 కోట్ల వ్యయంతో 62 సీసీ రోడ్లు వేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు.

కనిగిరి మండలంలో ఆరు పంచాయతీల్లో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు వేయనున్నట్టు చెప్పారు. బొమ్మిరెడ్డి పల్లి పంచాయతీ ప రిధిలో గుండ్లపాలెంలో రూ.40 లక్షలతో, బొమ్మిరెడ్డిపల్లిలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. తక్కెళ్ళపాడు, పునుగోడు, ఏరువారిపల్లి, చల్లగి రగల గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పాలన పడకేసి కనీస రోడ్లకు తట్ట మట్టి కూడా పోసిన పాపాన పోలేదన్నారు. ప్రజలు రోడ్లపై ప్రయాణం చేస్తున్నప్పుడు నరకాన్ని చవిచూశారన్నారు. ఇక నుంచి అలాంటి ఇబ్బందులు లేకుండా చేయటమే తన కర్తవ్యంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీ డీవో హనుమంతరావు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, నంబుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొ న్నారు.

రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు

తాళ్లూరు, అక్టోబరు 14 (ఆంధ్యజ్యోతి): పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో కల్లూరి సుందరరామయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ- ప్రగతికి అండగా కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు సోమవారం భూమి పూజచేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 16 పంచాయతీల్లో 58 పనులకు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆ పనులు పంచాయతీరాజ్ పర్యవేక్షణలో జరుగుతాయని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఏగ్రామంలో కూడా అభివృద్ధి పనులు చేపట్టిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వ చ్చి నాలుగు నెలలు కాక ముందే గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ కాలువలకు అధిక ప్రాధాన్యత నిచ్చిందన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి తాళ్లూరు మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేయించారన్నారు. బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు.

కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మందా శ్యాంసన్, ఎం.కోటేశ్వరమ్మ, ఎంపీటీసీ బాలకోటయ్య, ఈసీ ప్రసాద్, టీడీపీ నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్ బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, పోలం రెడ్డి రమణారెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, లక్ష్మయ్య గోవిందరెడ్డి, వీరనాగిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు

ముండ్లమూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించనున్నట్లు ఎంపీడీవో ఆర్.జనార్దన్ అన్నారు. సోమవారం మండలంలోని పోలవరంలో పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా రూ.14 లక్షలతో సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు.

ఈసందర్భంగా ఎంపీ డీవో జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఉపాధి పథకం నిధులు విడుదల చేసినట్టు చెప్పారు. ఆ నిధులతో గ్రామాల్లో రహదారులను నిర్మించటం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలను గుర్తించి సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించనున్నట్టు చెప్పారు. జనవరి కల్లా నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు.

కార్యక్రమంలో సర్పంచ్ నంబూరి లీలమ్మ, ఏసు, పంచాయతీ రాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, ఏపీవో కె.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, మల్లికార్జునరావు, కొర్రపాటి బుచ్చిబాబు, విజయలక్ష్మి, పర్చూరు శ్రీనివాసరావు, కొర్రపాడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు దక్కింది వీరికే!

దర్శి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో 9 మద్యం షాపులకు ఒంగోలులో సోమవారం దరఖాస్తుదారులకు లాటరీ ద్వారా షాపులను కేటాయించారు. దర్శి పట్టణంలో ఐదు షాపులు ఉండగా టి. నారాయణరెడ్డి, నిడమానూరి నాగేశ్వరరావు, ధూళిపాళ్ల రమ్యకృష్ణకు ఒక్కో షాపు, దండే ప్రసాద్‌కు రెండు దక్కాయి. దర్శి రూరల్‌లో ఉన్న నాలుగు షాపులకు మదుమంచి ఏడుకొండలు, పుల్లలచెరువు చిన్నా, టి. వెంకటరావు, టి.నాగేశ్వరరెడ్డిలకు ఒక్కో షాపు దక్కింది. లాటరీలో షాపులు దక్కిన వారు, భాగస్వాములు ఆనందంతో పొంగిపోతున్నారు. రూ.2లక్షల చొప్పున డీడీలు కట్టి డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తులు దిగాలు చెందారు.

కురిచేడులో..

కురిచేడు: కురిచేడు మండలంలో మూడు మద్యం షాపులను లాటరీ ద్వారా కేటాయించారు. కురిచేడులోని. 93వ నంబరు షాపు ఇంటూరి శ్రీనివాసరావు, 94వ నంబరు షాపు పి.రామాంజనేయులు, 95వ నంబరు షాపు గద్దం బాలయ్యకు దక్కాయి.

తాళ్లూరులో..

తాళ్లూరు: మండలంలోని నాలుగు మద్యం షాపుల్లో ఒకటి మాత్రం తాళ్లూరు మండల వాసికి రాగా, మిగిలినవి ఇతర ప్రాంతా వారు దక్కించుకున్నారు. బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పోలంరెడ్డి సుధాకర్‌రెడ్డి ఒక మద్యం దుకాణం దక్కగా, ఇతరప్రాంతాలకు చెందిన కూనం సత్యనారాయణ, యర్రంరెడ్డి వెంకటరెడ్డి, గనపర్తి సంజయ్‌లకు లాటరీలో దక్కాయి.

దొనకొండలో..

దొనకొండ: దొనకొండ మండలంలోని మూడు మద్యం షాపులు ఇతర ప్రాంతాలకు చెందిన వారికి దక్కాయి. దర్శికి చెందిన పులిగడ్డ సాయికృష్ణ, తుపాకుల శివకృష్ణకు రెండు షాపులు దక్కాయి, మార్కాపురం మండలం రాజుపాలెంకు చెందిన తాండ్ర వెంకటేశ్వర్లుకు ఒక షాపు దక్కింది.

హోంగార్డుకు ఎస్పీ ప్రశంస

కనిగిరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పారిపోతున్న వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న హోంగార్డును ఎస్పీ ఏఆర్ దామోదర్ ప్రశంసించారు. సోమవారం ఒంగోలులో ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు.

కనిగిరి పట్టణంలోని కొండ దిగువన ఉన్న అయ్యప్ప ఆలయంలోని సీసీ కెమెరాలను దొంగ ధ్వంసం చేసి రూ.15 వేలు విలువైన మూడు కలశాలు తీసుకుని పారిపోతుండగా, భక్తులు హోంగార్డు సీతారాం ప్రసాద్‌కు సమాచారం అందించారు. దీంతో హోంగార్డు అని గుర్తుపట్టకుండా ఉండేందుకు షర్టును విప్పి కొండ ఎక్కి దొంగను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడింది కనిగిరి పట్టణానికి చెందిన పొలా అంకయ్యగా పోలీసులు గుర్తించి కేసు నమోదు చేశారు. పారిపోతున్న వ్యక్తిని చాకచక్యంగా పట్టుకున్న హోంగార్డును ఎస్పీతన కార్యాలయానికి పిలిపించి అభినందించి నగదు అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు.

ఎడతెరిపిలేని వర్షం



దర్శి: తూర్పు చౌటపాలెంలో వర్షానికి తడవకుండా సజ్జ కంకులకు కప్పిన పరదాలు

దర్శి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం నుంచి ముసురుతో కూడిన వర్షం కురిసింది. ఈవర్షంతో రైతులు కొంతమేర ఇబ్బందిపడ్డారు. మండలంలో సాగుచేసిన సజ్జ పంట కోసి కళ్లాలు చేస్తున్న పనులు చివరి దశలో ఉన్నాయి. కొంతమంది రైతులు కంకులు కోసి పొలాల్లో ఆరబెట్టారు. ప్రస్తుతం వర్షం రావటంతో హడావుడిగా పరదాలు తెచ్చి కంకులు తడవకుండా కప్పుతున్నారు. మొక్కజొన్న పైరు గింజ పోసుకునే దశలో ఉంది. మిర్చి పైరు పూత, పిందె దశలో ఉంది. పొగాకు ఏపుగా పెరుగుతుంది. ఈ వర్షం ఇంతటితో ఆగిపోతే ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇంకా భారీ వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. సజ్జ కంకులు తడిసి మొలకెత్తి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంటుంది.

పామూరు: మండలంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా ఓ మోస్తరు వర్షం కురిసింది. దాంతో ప్రజా జీవితానికి అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం కంది, మినుము, జొన్న పైర్లకు మేలు జరిగింది. పట్టణంలో కురిసిన వర్షానికి వర్షపు నీరు, మురికి కాలువల్లో నీరు పొంగి రోడ్లపై పారింది.

కురిచేడు: కురిచేడులో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. 30 మి.మీ వర్ష పాతం సాయంత్రానికి రికార్డు అయింది. సోమవారం కురిసిన వర్షం రైతులకు మేలు చేకూర్చే విధంగా ఉన్నది. మరో రెండు రోజుల పాటు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ సూచిస్తుండటంతో రైతులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట పైర్లలో నీరు నిలబడి ఉరకెత్తుతాయోమోనని ఆందోళన చెందుతున్నారు.

తాళ్లూరు: తాళ్లూరు మండలంలో సోమవారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఈ వర్షంతో సాధారణ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షంలోనూ అధికారులు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు.

పంటల సాగులో..

ఆధునిక పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

దర్శి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఇందుకోసం రైతులను చైతన్యవంతులను చేయాలన్నారు. సోమవారం దర్శిలో ఎనిమిది మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పంట జీవన దశలు, తెగుళ్లు, పురుగుల నివారణ, పోషకలోపాలు తదతర అంశాలను రైతులకు తెలిపితే సకాలంలో అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందించాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ పీడీ ఎం.సుబ్రమణేశ్వరరావు, కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.రమేష్‌బాబు, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ పి.సంధ్యారాణి, జేడీఏ కె.బాలాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
బాపట్ల
మంగళవారం 15 అక్టోబరు 2024


ఏల్చూరు గ్రామంలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

112 పనులకు శంకుస్థాపన

- ఊరూర వేడుకగా పల్లె పండుగ
- 58 గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ఏల్చూరులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

బాపట్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 58 గ్రామ పంచాయతీల పరిధిలోని 112 పనులకు సోమవారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో శంకుస్థాపన జరిగింది. సంతమాగులూరు మండల పరిధిలోని ఏల్చూరులో జరిగిన పల్లె పండుగలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ పలు అభివృద్ధి. పనులకు శ్రీకారం చుట్టారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వివరించారుట. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి రూ.19 కోట్లను ప్రభుత్వం కేటాయించడం జరిగిందన్నారు. పారిశుధ్యంతో రోడ్ల మరమ్మతులను త్వరిత గతిన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. చుండూరు మండల పరిధిలోని యడ్లపల్లిలో జరిగిన పల్లెపండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లలో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. యడ్లపల్లిలో రూ.25 లక్షలు, అమర్తలూరులో రూ.30 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

తమ్ముళ్ల అత్యుత్సాహం

- ఏల్చూరు గ్రామ పంచాయతీ కార్యాలయానికి పసుపు రంగు


పసుపు రంగు వేసిన ఏల్చూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ జెండాను పోలిన రంగులు వేశారు. అనంతరం కోర్టుల నుంచి చీవాట్లు రావడంతో కొంతమేర మార్పు చేసినా చాలాచోట్ల వైసీపీ రంగులను పోలినవిధంగానే కనిపించేవి. 4నెలల కిందట టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తెలుగుతమ్ముళ్లకు కూడా రంగుల పిచ్చిపట్టినట్లు కన్పిస్తుంది. సంతమాగులూరు మండలం ఏల్చూరు పంచాయతీ భవనం మొత్తం పసుపురంగును వేయించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం ఏల్చూరు పంచాయతీ కార్యాలయానికి వస్తున్న సందర్భంగా తమ్ముళ్లు గ్రామ పంచాయతీకి పసుపురంగును వేయించారు. సాధారణంగా ప్రభుత్వభవనాలకు లైట్ గోపీకలర్ లేదా తెలుపు వేస్తారు. అయితే ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ జెండాలను పోలిన రంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వేయడం పరిపాటిగా మారింది. ఈ రంగులపిచ్చిని గమనించిన పలువురు వైసీపీ నేతలకు ఎక్కిన రంగుల పిచ్చే తెలుగుతమ్ముళ్లకూ పాకిందని మాట్లాడుకుంటున్నారు.

- సూర్యలంక రోడ్డులో బెలూన్ థియేటర్
- పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా
- దేశవ్యాప్తంగా ఓ సంస్థ పరిచయం..


సూర్యలంక రోడ్డులో ఉన్న బెలూన్ థియేటర్

భళారే... బెలూన్ బొమ్మ

గ్రామీణ ప్రాంతాల్లో టూరింగ్ టాకీసుల్లో సినిమాలు చూశాం... తర్వాత డీటీఎస్ సౌండ్ సిస్టమ్ థియేటర్లు....మల్టీప్లెక్స్‌లు....త్రీడీ టెక్నాలజీ స్క్రీన్లు ఇలా ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా ఎప్పటికప్పుడు సినిమా థియేటర్లు మారుతూ వస్తున్నాయి. వీటన్నింటిని తలదన్నేలా ఇప్పుడు బెలూన్ థియేటర్లు అందుబాటులోకి వచ్చి సినీ ప్రియులకు కొత్త అనుభూతిని పంచుతున్నాయి. నెలల తరబడి నిర్మాణం అక్కర్లేదు...భారీ పెట్టుబడి అవసరమే లేదు...ఇవేవీ లేకుండానే బెలూన్ థియేటర్‌లు ఇప్పటికే దేశవ్యాప్తంగా అందుబాటులోకి రాగా, ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా బాపట్లలో ఆ సరికొత్త అనుభూతి అనుభవంలోకి వచ్చింది. ఒకసారి ఆ బెలూన్‌లోకి వెళ్లి అక్కడి వింతలు, విశేషాలు చూసొద్దాం రండి......

బాపట్ల సమీపంలోని సూర్యలంక బీచ్‌కు పర్యాటకులు అత్యధిక సంఖ్యలో వస్తుంటారు. వారాంతాల్లో అయితే వీరి తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. హైదరబాద్, బెంగళూరు ల నుంచి బీచ్‌లో సేద తీరడానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు సూర్యలంకబీచ్‌కు క్యూ కడతారు. బాపట్లలో ఇప్పుడు ఏర్పాటు చేసిన బెలూన్ థియేటర్ కూడా సూర్యలంకరోడ్డులోనే ఉండడంతో పర్యాటకులకు మరింత కన్నులపండువగా ఉంది. ఆ థియేటర్‌ను కూడా సందర్శించాల్సిన పర్యాటక ప్రదేశాల జాబితాలో చేర్చి సినిమా చూసి కొత్త అనుభూతిని పొందుతున్నారు

బెలూన్ వంటి షీట్లలో గాలి నింపి...

బెలూన్ వంటి షీట్లలో గాలి నింపడం ద్వారా థియేటర్ నిర్మాణాన్ని చేపడతారు. నలుపక్కలా ఈ బెలూన్‌లే ఉంటాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, అగ్నిప్రమాదాలను తట్టుకునేలా ఈ బెలూన్లలో తయారీలో టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దాని వల్ల ఎలాంటి అసౌకర్యం లేకుండా సినిమాను వీక్షించే సౌకర్యం ప్రేక్షకులకు అందుబాటులోకి వస్తోంది. ఒకేసారి ఈ థియేటర్‌లో 120 మంది వరకు కూర్చొని సినిమాను వీక్షించొచ్చు. 5.1 డాల్బీ సౌండ్ సిస్టమ్ ఉండడం, ఎయిర్ టెంట్‌లు ఉండడం వలన రీసౌండ్ రాకపోవడం వలన మ్యూజిక్‌ను పూర్తి స్థాయిలో ఆనందించడానికి వీలుంటుంది. జీఎస్‌ఎం ఫైర్ మెటీరియల్ వాడడం వలన ఫైర్ సేఫ్టీ ఉంటుంది. బయటి నుంచి చూసిన వారికి ఇది ఒక ప్లే స్టేషన్‌లా అనిపిస్తుందే తప్ప థియేటర్‌లాగా కనిపించదు. కానీ లోనికి వెళితే మాత్రం ఓ ప్రత్యేక అనుభూతి మిగలడం ఖాయం. బయట నుంచి చూస్తే బెలూన్‌లు మొత్తం గాలి నింపుకుని ఓ భారీ సెట్టింగ్‌లాగా కనబడుతోంది. థియేటర్ స్థలాన్ని వేరే చోటకు మార్చడానికి అనువుగా ప్లాస్టిక్, స్పాంజ్‌లను ధికంగా వినియోగించారు. మొత్తం తొలగించి వేరే చోట థియేటర్ అమర్చడానికి గంటల వ్యవధిలోనే సిద్ధం చేసుకోగలగడం దీని ప్రత్యేకత. ఈ బెలూన్ థియేటర్లలో ఉన్న మరో సౌలభ్యం వీటిని మినీ ఫంక్షన్ల నిర్వహణకు అద్దెకు కూడా ఇవ్వవచ్చు. దీంతో రెండు విధాలుగా ఈ బెలూన్ థియేటర్ వల్ల ఉపయోగాలు ఉన్నాయి

ప్రేక్షకులను థియేటర్ల వైపు మళ్లించడానికి....

కరోనా తర్వాత ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ హవా నడుస్తుండడం, వినోదం రకరకాల రూపాలలో ప్రజలకు అందుబాటులో ఉండడం వలన జనాలు థియేటర్లకు వెళ్లడం తగ్గించేశారు. దీంతో మల్టిప్లెక్స్‌లతో పాటు థియేటర్లలో కూడా ఆక్యుపెన్సీ భారీగా పడిపోయింది. ఏదో పెద్ద సినిమాలు వస్తే తప్ప జనం థియేటర్ల ముఖం చూడడానికి కూడా ఇష్టపడని పరిస్థితులు వచ్చేశాయి. ఇలాంటి సమయంలో ప్రేక్షకులను తిరిగి థియేటర్ల బాట పట్టించేందుకు రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వచ్చిన వినూత్న ప్రయోగమే ఈ బెలూన్ థియేటర్లు. సినీ ప్రియులను తిరిగి థియేటర్ల వైపు ఆకర్షించడానికి ఈ బెలూన్ తెరల ప్రయోగం ఉపకరిస్తుందనేది నిర్వాహకుల అభిప్రాయంగా ఉంది. 120 సీట్లతో పరిమిత సంఖ్యలో థియేటర్ ఉండడం ఒక ఎత్తయితే మారుమూల గ్రామాల్లో సైతం ఈ బెలూన్ థియేటర్లను తేలికగా ఏర్పాటు చేసే వీలుంటుంది. విపత్కర పరిస్థితుల్లో ఈ టెంట్‌లను సులువుగా వేరే అవసరాలకు ఉపయోగించుకోవడం అనేది మరో సౌలభ్యంగా ఉంది. కరోనా నాటికే ఉత్తరాదిన ఈ థియేటర్లు ఉన్నాయి. మెడికల్ ఎమర్జెన్సీ కోసం వీటిని తాత్కాలికంగా ఉపయోగించారు కూడా

పిల్లలకు ప్రత్యేక ఆకర్షణగా....

బెలూన్ థియేటర్లు చిన్నారులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. చుట్టూ బెలూన్‌లు ఉండడంతో పాటు లోపల ఆకర్షణీయమైన సెట్టింగ్ ఉండడంతో పాటు థియేటర్ చుట్టూరా బొమ్మలతో నింపడం కూడా ప్రత్యేకంగా ఉంటోంది. బెలూన్ థియేటర్లలో పూర్తిగా గ్రామీణ వాతావరణం ఉండడం కూడా చిన్నారులకు ప్రత్యేకంగా ఉండనుంది. ప్రాచీన ఆటలను తలపించే బొమ్మలను థియేటర్ చుట్టూ ఉన్న గోడలమీద ప్రదర్శించడం చిన్నారులకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వీటితో పాటు సంక్రాంతి ముగ్గులు వివిధ పండగల సంప్రదాయాలను గోడల మీద కళాకృతులుగా మలచడం కూడా బెలూన్ థియేటర్లను ప్రత్యేకంగా నిలుపుతోంది

దేశవ్యాప్తంగా ఓ సంస్థ పరిచయం...

ఈ బెలూన్ థియేటర్లను దేశవ్యాప్తంగా ఓ కార్పొరేట్ సంస్థ పరిచయం చేస్తోంది. ఆయా రాష్ట్రాలలో ఔత్సాహికులైన ఫ్రాంఛైజీలను వెతికిపట్టుకుని వారి భాగస్వామ్యంతో వీటిని ప్రేక్షకుల ముందుకు తెస్తోంది. సంప్రదాయ థియేటర్లతో పోలిస్తే ఈ బెలూన్ థియేటర్‌కు అయ్యే ఖర్చు కూడా తక్కువే. సుమారు కోటి రూపాయల వ్యయంలోనే ఇది పూర్తవుతుంది. ఈ పెట్టుబడి మొత్తాన్ని సదరు కార్పొరేట్ సంస్థ, ఫ్రాంఛైజీ ఫిఫ్టీ-ఫిఫ్టీ భాగస్వామ్య పద్ధతిలో భరిస్తున్నారు.

- బాపట్ల

సింగిల్స్‌కూ లక్

- ఫలించిన సిండికేట్ మంత్రం
- నలుగురైదుగురు జట్టు కట్టి పదుల సంఖ్యలో దరఖాస్తు చేసినా నిరాశే
- రెండుమూడు దరఖాస్తులతోనే వరించిన అదృష్టలక్ష్మి
- ఆరు షాపులు దక్కించుకున్న మహిళలు
- రేపటి నుంచి మద్యం షాపులు ప్రారంభం



లాటరీలో భాగంగా టోకెన్ నంబరును తీస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): నలుగురైదుగురు కలిసి పదు ల సంఖ్యలో దరఖాస్తు చేశారు......అయినా తప్పని నిరాశ....ఒక్కటే దరఖాస్తుతో వరించిన లక్.. సిండికేట్ మంత్రం ఫలించి షాపుల వశం.. బంధువులయ్యే నలుగురికి 6 షాపుల కైవశం.. చెల్లి సెంటిమెంట్‌తో విజయాన్ని అందుకున్న అన్నయ్య.. ఆరు దరఖాస్తులతోనే రెండు షాపులు దక్కించుకున్న ఒకే మహిళ.. 20 దరఖాస్తులను ఐదు షాపులకువేస్తే ఒక్కదానితో సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి.. 30 దరఖా స్తులను నలుగురు కలిసి వేస్తే కనీసం ఒక్కటీ దక్కని వైనం.. మొత్తం గా చూస్తే నలుగురైదుగురు కూటమి కట్టి ఎక్కువ షాపులు దక్కించుకోవాలని చూసినవారికి లక్ మొహం చాటేయగా, సింగిల్ దరఖా స్తుతో పాటు, ధైర్యం చేసి ఒక్క షాపుకు ఒక్కరే రెండు లేదా మూడు దరఖాస్తులు వేసినవారినే లక్ ఎక్కువగా పలకరించింది. రేపల్లె నియోజకవర్గంలో సిండికేట్ మంత్రం ఫలించి ఆశించిన స్థాయిలో షాపులు.. దీంతో మద్యంషాపుల లాటరీ కొంతమందికి ఖేదాన్ని మిగి లిస్తే, సింగిల్స్‌కు మోదాన్ని మిగిల్చింది. పెద్దసంఖ్యలో దరఖాస్తు చేయడంవల్ల తమను దాటి లాటరీ వేరేవాళ్లను వరించద న్న ధీమా తో ఉన్నవాళ్ల చేతిలో డబ్బు పోయెనే అని మదనపడుతున్నారు

117 షాపులకు లాటరీ....

జోరు వర్షం కురుస్తున్నప్పటికీ సోమవారం ఉదయం 8 గంటలకే దరఖాస్తుదారులంతా బాపట్లలోని ఎమ్మెస్సార్ కల్యాణమండపానికి చేరుకున్నారు. రెండు కౌంటర్లలో లాటరీ ప్రక్రియ ప్రారంభించగా కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్ సారథ్యంలో లాటరీ ద్వారా విజేతలను ఎంపిక చేశారు.మధ్యాహ్నానికే 117 షాపుల లాటరీ పూర్తి కాగా, వెంటనే లైసెన్సు ఫీజులో తొలివాయిదా కట్టించుకోవడంలో ఎక్సైజ్‌శాఖ నిమగ్నమైంది. ప్రతి షాపుకు రెండు రిజర్వ్ పేర్లను తీసినప్పటికీ వాటి అవసరం ఎక్కడా రాలేదని అధికారులు తెలిపారు

ఆరు షాపులను దక్కించుకున్న మహిళలు...

117 షాపులకు దరఖాస్తు చేసే విషయంలో మహిళలు కూడా పెద్దసంఖ్యలోనే పోటీపడగా జిల్లావ్యాప్తంగా ఆరుషాపులను మహిళ లు దక్కించుకున్నారు. నిజాంపట్నంకు చెందిన మోపిదేవి చంద్రకళ షాపు నెం.48, 49 రెండు షాపులను ఆరు దరఖాస్తులతోనే దక్కించుకున్నారు. అలాగే సీఏ ఫైనలియర్ విద్యార్థిని కొప్పాక తులసి సంత మాగులూరు మండలంలోని షాపు నెం.95ను సింగిల్ దరఖాస్తుతోనే కైవసం చేసుకున్నారు. చెల్లి పేరుతో వేస్తే కలిసి వస్తుందని ఆమె అన్నయ్య దరఖాస్తు చేయడం, ఆమెనే విజయలక్ష్మి వరించడం సెంటి మెంట్ ఫలించినట్లైంది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో షాపు నెం.5 ను ఇమ్మడి అరుణ దక్కించుకోగా, కర్లపాలెం మండలంలోని 33వ షాపును లావు సునీత కైవసం చేసుకున్నారు. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని ఓ షాపును ఇగుటూరి శివకుమారి వశం చేసుకున్నారు

30 దరఖాస్తులు వేస్తే నిల్.. కానీ ఒక్కరికే రెండు షాపులు

బాపట్ల నియోజకవర్గ పరిధిలోని రియల్టర్లు నలుగురు కలిసి 30 దరఖాస్తులను ఐదు షాపులకు వేయగా ఒక్క షాపుకూడా లాటరీలో రాలేదు. మరోచోట నలుగురైదుగురు కలిసి 21 షాపులకు దరఖాస్తు చేస్తే ఒక్కషాపుతో సరిపెట్టుకోవాల్సివచ్చింది. పెద్దసంఖ్యలో దరఖాస్తు చేసినవారి పరిస్థితి ఇలాఉంటే పరిమిత సంఖ్యలో దరఖాస్తు చేసి ఒక్కరే రెండుషాపులు దక్కించుకున్నవారూ ఉన్నారు. బాపట్ల రూరల్ పరిధిలోని గోకరాజు రామకృష్ణంరాజు బాపట్లటౌన్‌లో 3, కర్లపాలెం మండలంలో 34 షాపు దక్కించుకున్నారు. అలాగే గోకరాజు శ్రీధర్ రెండు షాపులు కైవసం చేసుకోగా వీరి బంధువులైన మరో ఇద్దరు చెరోషాపును దక్కించుకోవడంతో మొత్తం ఆరు షాపులు ఒకే కుటుంబంలోని బంధువులు దక్కించుకున్నారు. అదేవిధంగా కొరిశపా డుకు చెందిన బి.సుబ్బారావు రెండుషాపులను కైవసం చేసుకున్నారు

రేపల్లె నియోజకవర్గంలో ఫలించిన ఒత్తిళ్లు

జిల్లాలో రేపల్లె నియోజకవర్గ పరిధిలో మద్యం షాపులకోసం పెద్ద ఎత్తున సిండికేట్ నడిచిందనే ఆరోపణలు వచ్చాయి. లాటరీలోనూ అందుకు తగ్గట్లుగానే ఫలితాలు రావడం చర్చకు దారితీసింది. రేపల్లె తో పాటు చెరుకుపల్లి మండల పరిధిలో ఒక్కొక్కరు రెండు షాపులు దక్కించుకోవడంతోపాటు అక్కడ పడిన పరిమిత సంఖ్యలో దరఖాస్తులన్నీ వీరివేనన్న చర్చ నడుస్తోంది. దీంతో ఇక్కడ ఒత్తిళ్లు ఫలించి తమ అనుకూలరుకు షాపులు దక్కించుకోవడంలో కొంతమేర సఫలీ కృతం అయ్యారనే చర్చ నడుస్తోంది

రేపటి నుంచి షాపులు ప్రారంభం....

లాటరీలో షాపులు దక్కించుకున్న వారంతా లైసెన్సు ఫీజు కట్టడా నికి 24 గంటల వ్యవధిని ఎక్సైజ్‌శాఖ ఇచ్చింది. ఆ మొత్తాలను చాలా వరకు సోమవారం సాయంత్రానికే చెల్లించి ప్రొవిజనల్ లైసెన్సును లాటరీలో విజేతలుగా నిలిచినవారు పొందారు. వీటికి స్టాక్ విషయం లో మంగళవారం ఇండెంట్ పెట్టి బుధవారం షాపులను ప్రారంభించుకోవచ్చని అధికారులు తెలిపారు


షాపుల లొకేషన్ నోటిఫైపై తకరారు....

లాటరీలో షాపు దక్కించుకున్నవారు దానిని ఏర్పాటుచేసుకునే లొకేషన్ విషయంలో కొంతసమయం ఇవ్వాలని ఎక్సైజ్‌శాఖ నిర్ణయిం చింది. వెంటనే స్టాక్ తెచ్చుకుని అమ్మకాలు తాత్కాలికంగా జరుపుకో వచ్చని తెలిపింది. మరోవైపు లాటరీలో షాపులు ద క్కించుకున్నవారు సోమవారం నుంచే రద్దీ లొకేషన్‌ల వేట ప్రారంభించారు. నోటి ఫికేషన్‌లో షాపు లొకేషన్ నోటిఫై చేయకపోవడంతో వీటి విషయంలో తకరారు నడిచే సూచనలు కనిపిస్తు న్నాయి. ఇప్పటికే బాపట్ల పట్టణంలో ఓ షాపు లోకేట్ విషయంలో ఇద్దరు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. రెండుమూడు రోజుల్లో వీటి పై స్పష్టత వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి.

సరైన ప్రణాళిక, విధివిధానాలు లేకుండా హడావిడిగా గత ప్రభుత్వం నూతన జిల్లాల ఏర్పాటుకు తెరతీసింది. తాంబూలాలు ఇచ్చాం తన్నుకు చావండి అన్న రీతిలో జిల్లాను అయితే ఏర్పాటు చేశారు కాని వసతులు మొదలుకుని సిబ్బంది వరకు ఎన్నో బాలారిష్టాలు రెండున్నరేళ్ల నుంచి జిల్లాను వెంటాడుతూనే ఉన్నాయి. కీలకశాఖలకు సైతం రెగ్యులర్ అధికారులను నియమించకుండా ఇంచార్జిలతో పాలన నెట్టుకొస్తున్నారు. తాజాగా జరిగిన బదిలీల్లో అయినా జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ విభాగాలకు అధికారులను నియమించడంతో పాటు నిబంధనల ప్రకారం ఉండాల్సిన నిష్పత్తిలో కార్యాలయాల్లో సిబ్బంది కేటాయింపులు జరుగుతాయనుకుంటే ప్రస్తుతం కూడా నిరాశే ఎదురైంది.

ఇంకెన్నాళ్లీ.. ఇన్‌చార్జ్‌ల పాలన..?

- జిల్లాలో కీలకశాఖలకు ఎఫ్ఏసీ బాధ్యతలే దిక్కు
- తాజా బదిలీల్లోనూ భర్తీ విషయంలో నిరాశే
- వసతుల విషయంలో ఇంకా కుదురుకోని బాపట్ల జిల్లా
- ఇక్కడకు రావడానికి పలువురి నిరాసక్తత
- కింది స్థాయి సిబ్బంది విషయంలోనూ భారీగా ఖాళీలు



బాపట్ల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆవిర్భవించి రెండున్నరేళ్లు దాటినా ఇంకా వివిధ విభాగాలకు ఇప్పటి వరకు సరైన కార్యాలయాలే లేవు. పైగా ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారుల పర్యవేక్షణలోనే ఇంకా కొన్ని కార్యకలాపాలు జరగడంతో పాటు ఇటీవల జరిగిన బదిలీల్లో సైతం పలు శాఖలకు ఇన్‌చార్జిలనే నియమించడంతో ఇంకెన్నాళ్లు ఇన్‌చార్జిల పాలన అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అత్యంత కీలకమైన డీఆర్‌డీఏ పీడీ పోస్టుకు రేపల్లె డీఎల్‌డీవోగా నియమితులైన పీ పద్మకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. హార్టికల్చర్ విభాగం జిల్లా అధికారిణిగా ఉన్నటువంటి జెన్నమ్మను ఏపీఎంఐపీ ఇన్‌చార్జి పీడీగా ఎప్పటినుంచో కొనసాగిస్తున్నారు. సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పోస్టుకు అదనపు బాధ్యతలే. పల్లపట్టు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఉన్నటువంటి ఉమను ఐసీడీఎస్ పీడీగా ఎఫ్ఏసీ ఇచ్చారు. అత్యంత కీలకమైన జిల్లా ఉపాధికార్యాలయం అధికారిగా జూనియర్ ఉద్యోగికి బాధ్యతలు అప్పగించారు. డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఇక్కడ సైతం ఇన్‌చార్జీలే దిక్కయ్యారు. అత్యంత ప్రాధాన్యం గల మెప్మా పీడీ పోస్టు విషయంలో జిల్లా ఆవిర్భావం నుంచి గుంటూరు జిల్లా పీడీనే ఇక్కడ ఎఫ్ఏసీగా ఇచ్చి నెట్టుకొస్తున్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షించే అధికారే కరువయ్యారు. అటు ఒంగోలు నుంచి కొంత, ఇటు తెనాలి డివిజన్ నుంచి మరికొంత పూర్తి స్థాయి బాధ్యతల నిర్వహణే కరువయింది. జిల్లా పరిశ్రమల అధికారి పోస్టు ఇంకా ఖాళీగానే దర్శనమిస్తోంది. సీపీడీసీఎల్ ఈఈనే ఎస్ఈగా ఎఫ్ఏసీ నిర్వర్తిస్తున్నారు. మత్స్యశాఖ డీడీగా ఉన్నటువంటి సురేష్‌నే సుదీర్ఘకాలంగా ఎఫ్ఏసీపైన జేడీగా కొనసాగిస్తున్నారు. డిస్ట్రిక్ట్ డ్రగ్స్ కంట్రోల్ విభాగం ఎఫ్ఏసీ పర్యవేక్షణలోనే ఉంది. ఆర్ అండ్ బీ విభాగంలో ఈఈనే ఎస్ఈగా ఎఫ్ఏసీ బాధ్యతల్లో ఉన్నారు. పంచాయతీరాజ్ విభాగానిదీ ఇదే దారిగా ఉండడంతో దాదాపు సగం శాఖలకు రెగ్యులర్ అధికారులు కాకుండా ఎఫ్ఏసీలే దిక్కయ్యారు.

మండలస్థాయిలోనూ.. కార్యాలయాల్లో....

ఇటీవల పెద్ద ఎత్తున రెవెన్యూ బదిలీలు జరిగినప్పటికీ ఇంకా రేపల్లె, భట్టిప్రోలు, కారంచేడు, బాపట్ల మండలాలకు తహసీల్దార్లుగా ఇన్‌చార్జిలే విధులు నిర్వహించడం గమనార్హం. కలెక్టరేట్ ఏవోతోపాటు సూపరింటెండెంట్‌లుగా తహసీల్దార్ కేడర్ ఉద్యోగులే ఉంటారు. ఇక్కడ కూడా మూడు ఖాళీలు నెలల తరబడి ఉండడంతో పాలన గాడి తప్పుతోంది. జిల్లా అధికారుల పోస్టులే దాదాపు సగం శాఖలకు ఇన్‌చార్జీల పర్యవేక్షణలో నడుస్తుంటే, కార్యాలయాల్లోని కిందిస్థాయి సిబ్బంది విషయంలో సగానికి సగం పోస్టులు భర్తీకాక ఖాళీగా ఉన్నాయి. జిల్లా ఆవిర్భావం నుంచి ఏ విభాగానికి ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది కేటాయింపు జరగలేదు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన బదిలీల్లో అయినా ఖాళీగా ఉన్న కింది స్థాయి సిబ్బంది భర్తీ మీద దృష్టి పెడతారనుకుంటే అలా జరగకపోవడం నిరాశపరిదేగా ఉంది. మార్కెటింగ్ విభాగంలో నెలల తరబడి నలుగురు సిబ్బందితో పనులు చక్కబెడుతున్నారు. ఇక్కడ ఉండాల్సిన ఉద్యోగుల సంఖ్య 11 మంది కాగా ఆ దిశగా గత ప్రభుత్వం కానీ, ప్రస్తుతం కానీ దృష్టి పెట్టిన దాఖలాలే లేవు. ఒక్క మార్కెటింగ్ విభాగం అనే కాకుండా డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్, డీపీవో ఇలాంటి కీలకశాఖలన్నింటిలో కూడా సిబ్బంది కొరత వెంటాడుతూనే ఉంది

ఇటీవల జరిగిన బదిలీల్లోనూ చిన్నచూపే...

వైసీపీ ప్రభుత్వంలో కీలక శాఖలకు పూర్తి స్థాయి అధికారులను నియమించకుండా ఇన్‌చార్జిలతోనే కాలం వెళ్లదీసింది. ఎన్నికలకు ముందు ఆ ప్రక్రియలో విధులు నిర్వహించడానికి పెద్ద ఎత్తున గెజిటెడ్ ఆఫీసర్ల అవసరం ఏర్పడడంతో ఎక్కువ మంది ఎఫ్ఏసీ బాధ్యతల్లోనే ఉండడంతో గెజిటెడ్ అధికారుల నియామకం అప్పట్లో తలకు మించిన భారంగా తయారయిన సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వంలో ఇటీవల జరిగిన బదిలీల్లో అన్ని విభాగాలకు పూర్తి స్థాయి అధికారులను నియమించడంతో పాటు కిందిస్థాయి సిబ్బంది భర్తీ విషయంలో దృష్టిపెడతారనుకుంటే ఇప్పుడు కూడా నిరాశే ఎదురైంది. బదిలీల ప్రక్రియ ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరగడం కూడా బాపట్ల జిల్లాకు శాపంగా పరిణమించింది. దీనికి తోడు వసతుల విషయంలో ఇంకా జిల్లా కేంద్రంలో అవే బాలారిష్టాలు వెంటా డుతుం డడంతో ఇక్కడకు అధికారులు రావడా నికి పలువురు విముఖత చేయడం కూడా ఈ ఎఫ్ ఏసీలకు కారణంగా కనబడుతోంది. జిల్లా ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా సరైన ప్రణాళికలు లేకుండా ఆదరాబా దరాగా కొత్త జిల్లాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం పూనుకోవడం, అందు కు సంబంధించిన సాంకేతిక తప్పిదాలు ఇప్పటికీ వెంటాడుతుండడం కూడా కొన్ని పోస్టుల భర్తీకి ప్రతిబంధకంగా మారింది. తాజాగా జరిగిన బదిలీల్లో ఇటు గుంటూరు, అటు ప్రకాశం జిల్లా పరిధిలోకి వచ్చే మండలాల విషయంలో తకరారు ఏర్పడడం అస్తవ్యస్త విధానానికి అద్దం పడుతోంది. జిల్లా ఏర్పడిన రెండేళ్ల తర్వాత గాని ఆయా విభాగాల ఖాతాల విభజన జరగలేదంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందనడానికి ఓ ఉదాహరణగా కనబడుతోంది. సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ ప్రతిపాదనలను గత ప్రభుత్వం అటకెక్కించింది. ప్రస్తుతం కూడా దానిపై కదలిక లేకపోవడంతో పలు కార్యాలయాలు ఇప్పటికీ ప్రైవేటు భవనాల్లోనే అరకొర సదుపాయాలతో నెట్టుకు రావాల్సిన దుస్థితి నెలకొని ఉంది

బాపట్ల డీఎల్‌డీవో పోస్టు విషయంలో రాని స్పష్టత...

బాపట్ల డీఎల్‌డీవోగా నారాయణరెడ్డిని నియమిస్తూ ఇటీవలే ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈయన వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లా డీపీవోగా విధులు నిర్వహించారు. అప్పట్లో ఆయన వ్యవహారశైలిపై పలు ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుత బదిలీల్లో భాగంగా ఆయనను బాపట్ల డీఎల్‌డీవోగా కేటాయించారు. కానీ ఆయన రాకను కొంతమంది కూటమినేతలు స్వాగతించకపోవడంతో ఆ ఉత్తర్వులు ప్రస్తుతం త్రిశంకుస్వర్గంలో ఉన్నట్టు సమాచారం

మారనున్న గ్రామాల రూపురేఖలు

ఏల్చూరులో రూ.40లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాపురం భూములకు త్వరలో పరిష్కారం

పల్లెపండుగ కార్యక్రమంలో మంత్రి రవికుమార్

ఏల్చూరు(అద్దంకి), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పల్లె పండుగ నిధులతో గ్రామాల రూపురేఖలు మారనున్నాయని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, సైడు కాలువలకు సోమవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో రూ.67కోట్లతో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు ద్వారా సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌లు, గోకులాల నిర్మాణం, పండ్ల తోటల పెంపకం ఇతర పలు రకాల పనులు చేపడతారన్నారు. ఆ సమయాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. సీసీ రోడ్డు వేసినంత దూరం కచ్చితంగా సైడ్ డ్రైన్‌ల నిర్మాణం చేయాలని, పైప్ కల్వర్టుల స్థానంలో స్లాబ్ కల్వర్టులను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్యను ఏల్చూరు గ్రామస్థులు రవికుమార్ దృష్టికి తీసుకురాగా, గతంలో మూడు ఆర్వో ప్లాంట్‌లు, మంచినీటి పథకం ఏర్పాటు చేస్తే ఆర్వో ప్లాంట్‌లను వ్యాపారంగా మార్చి నిర్వీర్యం చేసి మూసి వేశారన్నారు. అసిస్ట్ సహకారంతో గ్రామంలో 4 కొత్త నీటి ప్లాంట్‌లను చేయిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు ఉదయం గ్రామాలలో పర్యటించి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు డ్రైన్‌లలో పూడిక తీత పనులు చేయించాలన్నారు. వర్షాకాలం అయినందున పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైసీపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు విడుదలయ్యే నిధులు పక్కదారి పట్టించారన్నారు. ఇప్పుడు నేరుగా పంచాయతీలకే జమ అవుతున్నాయని, ఆ నిధులు దుర్వినియోగం కాకుండా పనులు చేయించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నారు. గోపాపురం భూముల సమస్యను త్వరలో పరిష్కరించి సాగు రైతులకు పట్టాలు అందజేస్తామని మంత్రి రవికుమార్ రైతులకు తెలిపారు. ఎస్టీ కాలనీలో గుడిసెలు అడ్డదిడ్డంగా వేసుకొని ఉన్నందున అభివృద్ధి పనులకు అడ్డంకిగా ఉన్నాయని స్థానికులు, రెవెన్యూ అధికారులు కలిసి ప్లాట్లుగా విభజించి కేటాయిస్తే అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ నాయకులు

పెద్దదోర్నాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్‌ను సచివాలయంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గ బీజేపీ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెనుకబడిన నియోజకవర్గంలో వైద్యశాలల అభివృద్ధి, పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు తోడ్పాటు నివ్వాలని ఆయనను కోరారు.

లిక్కర్ వ్యాపారంలో ఆరితేరిన వ్యాపారుల, రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తుల ప్రభావం మళ్లీ ఆరంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపుల కేటాయింపునకు పూర్తి పారదర్శక విధానం అవలంబించింది. అయినా వివిధ రూపాల్లో ఆరితేరిన లిక్కర్ వ్యాపారులు, రాజకీయ నేపథ్యం కలిగిన వ్యక్తులు అధికసంఖ్యలో మద్యం షాపులను చేజిక్కించుకోగలిగారు. అయితే కొంతమందికి లాటరీ కలిసిరాలేదు. కొత్తగా ఆకర్షితులైన వారిని మాత్రం అదృష్టం వరించింది. స్థానికేతరులు సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆలోచనతో దరఖాస్తులు చేసి లాటరీలో దక్కించుకున్న వారికి అప్పుడే సమస్యలు ఆరంభమయ్యాయి. 'తులమో ఫలమో ఇస్తాం, మీ కొచ్చిన షాపులు మాకు ఇచ్చి వెళ్లిపోండి' అంటూ మద్యం వ్యాపారులు వారిపై వత్తిడి ఆరంభించారు.

- (ఆంధ్రజ్యోతి, ఒంగోలు)



లిక్కర్ రాజకీయం ఆరంభం

- పాత వ్యాపారులు, రాజకీయ నేతలు రంగప్రవేశం
- లాటరీ అదృష్టవంతులను తరిమికొట్టే ప్రయత్నం
- షాపుల అమ్మకానికి వత్తిడి, బేరసారాలు

పకడ్బందీగా లాటరీ విధానం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 250కిపైగా మద్యం విక్రయ షాపులకు సోమవారం లాటరీ విధానంలో విక్రయదారులను ఎంపిక చేశారు. ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకున్నా ఒకటి రెండు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా దరఖాస్తులు దాఖలు చేశారు. అయితే వారి కళ్లుగప్పి మరికొందరు చివరిక్షణంలో దరఖాస్తులు పెట్టుకున్నారు. దరఖాస్తు దాఖల్లో అంతోఇంతో లొసుగులు కనిపించినా లాటరీ విధానాన్ని ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహించింది. దీంతో లాటరీలో అదృష్టవంతులకే షాపులు దక్కాయి. ఉదాహరణకు ఒంగోలు, సంతనూతలపాడులో లిక్కర్ వ్యాపారులు అలాగే అధికారపార్టీ స్థానిక నేతలు వేర్వేరుగా సిండికేట్ అయి దరఖాస్తులు వేశారు. రెండు గ్రూపుల వారిని కళ్లుగప్పి కొత్తగా ఈ వైపు దృష్టిసారించిన అనేకమంది యువకులు దరఖాస్తులు వేశారు. ఎక్కువ ఆ రెండు గ్రూపుల వారికే వచ్చినా మధ్యలో కొత్త వారిని కూడా అదృష్టం వరించి కొన్ని షాపులు దక్కాయి.

ప్రముఖుడికి దక్కని షాపులు

వ్యాపారంలో ఆరితేరిన ఒక ప్రముఖుడు జిల్లా మొత్తంగా 25 షాపులకు దరఖాస్తులు పెట్టుకున్నా అదృష్టం వరించలేదని తెలిసింది. మార్కాపురంలో ఎక్కువ షాపులు పాత వ్యాపార ప్రముఖులు, టీడీపీ, జనసేన నాయకుల మద్దతు ఉన్న వారికే దక్కాయి. నియోజకవర్గం మొత్తంపై మూడు షాపులు వైసీపీ సానుభూతిపరులకు, నాలుగైదు షాపులు కొత్తవారికి దక్కాయి. గిద్దలూరు సర్కిల్‌లో ఒక షాపునకు ఒకే ఒక్క దరఖాస్తు వేసిన వైసీపీ సానుభూతిపరుడిని అదృష్టం వరించింది. మిగిలిన షాపులు ఎక్కువ భాగం టీడీపీ అనుకూల వ్యక్తులకు దక్కగా అక్కడ కొన్ని షాపులు కొత్తవారు చేజిక్కించుకున్నారు. దర్శిలో స్థానికేతరులకు సైతం కొన్ని షాపులు దక్కాయి. కనిగిరిలో మద్యం వ్యాపారంలో ఆరితేరిన పాతవారు ఈసారి దూరంగా ఉండగా ప్రస్తుతం రాజకీయంగా చురుగ్గా ఉన్నవారే గ్రూపుగా షాపులు దక్కించుకున్నారు. అయితే ఈ నియోజకవర్గంలోను కొత్తవారిని కొన్ని వరించాయి.

స్థానికేతరులకు దక్కిన షాపులు

కొండపి నియోజకవర్గంలో కొన్నిచోట్ల స్థానికేతరులకు షాపుల దక్కాయి. కందుకూరు నియోజకవర్గంలో ఆరు, ఏడు షాపులకు దరఖాస్తులు చేసిన టీడీపీ స్థానిక నేతకు ఒక్క షాపు దక్కలేదు. లిక్కర్ వ్యాపారంలో కొందరికి ఒకటి అర షాపులు దక్కగా కొందరిని అదృష్టం వరించలేదు. ఈ నియోజకవర్గంలోను కొత్తగా ఆ వైపు దృష్టిసారించిన యువకులకు అడపాదడపా అదృష్టం వరించింది. అద్దంకి నియోజకవర్గంలో ఇద్దరు ప్రముఖులకు ఒక్క షాపు లభించలేదు. పాత వ్యాపారులతోపాటు కొత్తగా రంగంలోకి వచ్చిన వారిని అదృష్టం వరించింది. పర్చూరు నియోజకవర్గంలో అమెరికా నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న వారిని అదృష్టం వరించింది. చీరాల నియోజకవర్గంలో రాజకీయ మద్దతు కూడా ఉన్న ఒకరిద్దరికీ ఒక్క షాపు దక్కకపోగా ఈ వ్యాపారంలో కొత్తగా అడుగు పెడుతున్న వారికి కొన్ని షాపులు దక్కాయి.

బేరసారాలు, బెదిరింపులు

లాటరీ విధానంలో షాపులు దక్కించుకోలేకపోయిన వ్యాపార ప్రముఖులు, రాజకీయ పలుకుబడి కలిగిన వారు కొత్తవారితో బేరసారాలకు దిగారు. మీరే షాపులను నడుపుకోవాలంటే ఇబ్బందులు పడక తప్పదంటూ బెదిరింపులు కూడా చేస్తున్నారు. 'మీ దరఖాస్తు ఫీజుతోపాటు రెండేళ్లకు సంబంధించి కొంత మొత్తాన్ని ఇస్తాం, షాపులు మేము నడుపుకుంటాం అందుకు అంగీకరించండి' అంటూ బేరసారాలకు దిగారు. కాదు కూడదంటే బెదిరింపులకు దిగారు. ఇటు రాజకీయ పలుకుబడి లేని వ్యాపార అనుభవం లేని వారికి నిబంధనలు కూడా ఇబ్బందిగా మారాయి. ఒక్కరోజు వ్యవధిలో అంటే బుధవారానికి వారు షాపు ఏర్పాటు చేసుకోవాలి. లైసెన్స్ ఫీజు కట్టాలి. వెంటనే విక్రయాలు ప్రారంభించాలి. లిక్కర్‌ను ఆర్డర్ పెట్టి తగు పద్ధతిలో తెచ్చుకోగలగాలి. షాపు ఏర్పాటులో జాప్యం చేసుకుంటే రోజువారి వచ్చే ఆదాయం కోల్పోతారు. అనువైన ప్రాంతలో షాపు పెట్టుకోలేకపోయినా, వ్యాపారపరంగా కొంత నష్టపోవాల్సి వస్తుంది. ఇవన్నీ కొత్తగా ఈ వ్యాపారంలోకి వచ్చిన వారికి ఇబ్బందికరంగా మారాయి. దీనికితోడు పాత వ్యాపారులు తమకు షాపు ఇవ్వకపోతే రేపు నిర్వహణలో ఎక్సైజ్ అధికారులతో తనిఖీలు, కేసులు పెట్టిస్తామంటూ బెదిరిస్తున్నారు. లాటరీలో షాపు పొందిన స్థానికేతరులకైతే మీకు స్థానికంగా పెట్టుకునేందుకు అద్దె షాపులు కూడా ఇవ్వనీయమంటూ బెదిరిస్తున్నారు. తద్వారా లాటరీలో అదృష్టం వరించిన కొత్తవారికి లిక్కర్ వ్యాపార ప్రముఖుల నుంచి ఆరంభంలోనే ఇబ్బందులు ఎదురై లిక్కర్ రాజకీయం స్పష్టంగా కనిపిస్తోంది.

లిక్కర్ లక్కు

- మహిళలకు దక్కిన 15 దుకాణాలు
- వర్షంలోనూ మద్యం షాపులకు లాటరీ
- తొలివిడత లైసెన్స్ ఫీజు రూ.17.50 కోట్లు
- దరఖాస్తుల ద్వారా రూ.69.32 కోట్లు
- రేపటి నుంచి ప్రైవేటు వైన్ షాపులు ప్రారంభం

ఒంగోలు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం షాపుల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. ఈనెల 16 నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభించనున్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పర్యవేక్షణలో లాటరీ ప్రక్రియ ద్వారా 171 వైన్ షాపులకు కేటాయింపులు పూర్తిచేశారు. మొత్తం 3,466 దరఖాస్తులు రాగా అందులో 50 మందికిపైగా మహిళలు ఉన్నారు. ఇందులో 15 మందిని అదృష్టదేవత వరించింది. వారికి మద్యం దుకాణాలు కేటాయించారు. దరఖాస్తుల ద్వారా రూ.69.32 కోట్ల ఆదాయం రాగా లైసైన్సీ ఫీజు రూపంలో తొలివిడతగా రూ.17.50 కోట్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. జోరున వర్షం పడుతున్నా లాటరీ తీస్తున్న అంబేడ్కర్ భవన్ వద్ద దరఖాస్తుదారులలు తడుస్తూనే వేచి ఉన్నారు. అధికారులు రెండు కౌంటర్లు ఏర్పాటు చేసి ఐదు గంటల్లో లాటరీ ప్రక్రియను పూర్తిచేశారు. ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఒంగోలు 1 నంబరు దుకాణానికి లాటరీ తీసి విజేతగా నెప్పలి శ్రీనివాసరావును ప్రకటించారు. అనంతరం రెండు కౌంటర్లలో జరిగిన లాటరీ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. అంతేకాకుండా ఒక్కో దుకాణానికి లాటరీలో విజేతలను ప్రకటించినప్పటికీ మరో ఇద్దరు రిజర్వు అభ్యర్థులను కూడా లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీలత, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, జడ్పీ సీఈవో చిరంజీవి, ఏఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

15 మంది మహిళకు మద్యం దుకాణాలు

మహిళలకు 15 మందికి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కె.ఖాజామొహిద్దీన్ తెలిపారు. వాటిలో ఒంగోలు సర్కిల్ పరిధిలో 4, చీమకుర్తిలో 1, సింగరాయకొండలో 3, పొదిలిలో 1, గిద్దలూరులో 2, దర్శిలో 2, కంభంలో 2 దుకాణాలు వచ్చాయని ఆయన తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాలు లాటరీ ద్వారా పొందిన వారు 24 గంటలలో లైసైన్స్ ఫీజు ఆరవ వంతు చెల్లించి ప్రొవిజనల్ లైసెన్స్‌లు పొందాలని ఈఎస్ కోరారు.

అధికంగా కొండపి దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 171 దుకాణాలకు సంబంధించి 3,466 దరఖాస్తులు రాగా వాటిలో ఎక్కువ కొండపిలో 58 నంబరు దుకాణానికి 46 వచ్చాయి. పొదిలి రూరల్ 71 నంబరు దుకాణం, హెచ్‌ఎంపాడు 72 దుకాణం, దర్శిలో 88 నంబరు దుకాణాలకు అత్యంత తక్కువగా 11 దరఖాస్తులు చొప్పున రావడం గమనార్హం. ఒక దరఖాస్తు వేసిన రిటైర్డ్ ఎక్సైజ్ అధికారికి అదృష్టం వరించి దుకాణం దక్కడం విశేషం. అదేవిధంగా 46 దరఖాస్తులు వేసిన ఓ వ్యాపారికి ఒక్క దుకాణం కూడా దక్కకపోవడంతో నిరాశగా వెనుదిరిగాడు. పొన్నలూరులో రెండు మద్యం దుకాణాలు ఉండగా అదృష్టం అన్నదమ్ములను వరించింది. పల్లపోతు ప్రసాద్, రమేష్‌లకు ఆ దుకాణాలు దక్కాయి.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

మద్యం దుకాణాల లాటరీ సందర్భంగా భద్రత ఏర్పాట్లను ఎస్పీ ఏఆర్ .దామోదర్ స్వయంగా పరిశీలించారు. అంబేడ్కర్ భవనం వెలుపల, లోపల ఎలాంటి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కర్నూలు రోడులోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద కూడా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. అక్కడ లైసెన్స్ ఫీజు చెల్లించే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూశారు. ఆయన వెంట ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్రరావులు ఉన్నారు.



లాటరీ తీసి దుకాణం దక్కిన వారిని ప్రకటిస్తున్న కలెక్టర్ అన్సారియా

లాటరీని అడ్డుకునే ప్రయత్నం చేసిన మహిళా సంఘాలు

మద్యం లాటరీ జరుగుతున్న అంబేడ్కర్ భవన్ వద్దకు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొంతమంది మహిళలు వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు కంకణాల రమాదేవి, బి.పద్మలను అదుపులోకి తీసుకొని వన్‌టౌన్‌కు తరలించారు. మద్యనిషేధం అమలుచేయాలని, ప్రభుత్వ ప్రకటించిన పాలసీని వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

లాభాల పంట

- దక్షిణాదిలో ముగిసిన పొగాకు వేలం
- 153.58 మిలియన్ కిలోల అమ్మకం

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది ప్రాంత పొగాకు రైతులను ఈ ఏడాది లాభాలు ముంచెత్తాయి. పొగాకు బోర్డు చరిత్రలో ఎన్నడూ లేనంత స్థాయిలో ధరలు లభించాయి. పంట ఉత్పత్తి అనుమతికి మించి సుమారు 75శాతం అధికంగా అయినప్పటికీ ధరలు గతం కన్నా భారీగా పెరిగాయి. మొత్తంగా దక్షిణాదిలో 11 పొగాకు వేలం కేంద్రాలలో ఈ ఏడాది (2023-24) సమారు 153.58 మిలియన్ కిలోల విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ 266.41 ధర లభించి పొగాకు రైతులకు దాదాపు రూ.4,085.50 కోట్ల మేర రాబడి వచ్చింది. సగటు ధరల్లో గత రెండేళ్ల కన్నా భారీగా పెరుగుదల కనిపించింది. ఒంగోలు కేంద్రంగా ఉన్న పొగాకు బోర్డు దక్షిణాదిలోని రెండు రీజియన్ల పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 2023-24 సంవత్సరానికి 57,767.39 హెక్టార్ల విస్తీర్ణంలో పంట సాగుకు, 88.96 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చింది. అయితే 29,885 మంది రైతులు 24,130 బ్యారన్లకు లైసెన్సులు పొంది 72,345.90 హెక్టార్లలో పంట సాగు చేశారు. అలా సుమారు 15వేల హెక్టార్లలో పంట అధికంగా సాగు కాగా ఉత్పత్తి కూడా భారీగా పెరిగింది.

తొలుత ఇబ్బందులు

తొలుత పంట సాగులో రైతులు బాగానే ఇబ్బందులు పడ్డారు. సకాలంలో వర్షాలు లేక పంట సాగుకు ఇక్కట్లు పడగా ఆ తర్వాత నవంబరు, డిసెంబరు మాసాలలో కురిసిన వర్షాలు మరింత దెబ్బతీశాయి. అయితే అంతకు ముందు ఏడాది వచ్చిన లాభాలు, ప్రస్తుత సీజన్‌పై ఆశతో తిరిగి నాట్లు వేశారు. కొన్ని ప్రాంతాల్లో ఒకవైపు ముదురు తోటల్లో ఆకు రెలుపు, మరోవైపు మొక్కలు నాటడం సాగింది. సంక్రాంతి తర్వాత ఎండల తీవ్రత కూడా ఇబ్బందిపెట్టింది. అలా అనేక ప్రతికూల పరిస్థితులతో పంటను రైతులు సాగు చేయగా 145 మిలియన్ కిలోల పంట ఉత్పత్తి అంచనాతో ఫిబ్రవరి 29న కొన్ని వేలంకేంద్రాలలో, మార్చి 6న మరికొన్నింటిలో పొగాకు కొనుగోళ్లను బోర్డు అధికారులు ప్రారంభించారు. తొలిరోజు గరిష్ఠ ధర కిలో రూ.230 పలుకగా దాదాపు నెల రోజులు అలాగే సాగాయి. పెరిగిన ఉత్పత్తి ఖర్చుల నేపథ్యంలో ఆ ధరలతో రైతులు నష్టపోతామన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమైంది. అనంతరం క్రమంగా పెరుగుతూ మేలు రకం గరిష్ఠ ధర ఒక దశలో రూ.389 వరకు వెళ్లింది. అంతేకాక మీడియం, లోగ్రేడ్ ధరలు సైతం భారీగా పెరిగాయి. సగం సమయం గ్రేడ్‌తో సంబంధం లేకుండా అన్ని గ్రేడ్‌లను ఇంచుమించు ఒకే ధరకు కొనుగోలు చేశారు. గతంలో ధరల కోసం రోడ్డెక్కి రైతులు ఆందోళనలు చేసే పరిస్థితి ఉండేది. అలాంటిది రెండు, మూడేళ్లుగా బేళ్ల కోసం వ్యాపారులు పోటీ పడి కొనుగోలు చేశారు. మొత్తంగా మార్కెట్ మంచి ఊపు మీద సాగడంతో సగటు ధరలు కూడా భారీగా లభించాయి.

కిలోకు సగటు ధర రూ.266

దక్షిణాదిలో ఫిబ్రవరి 29నుంచి ప్రారంభమైన కొనుగోళ్లు సెప్టెంబరు ఆఖరు నుంచి ఒక్కో కేంద్రంలో ముగుస్తూ వచ్చి చివరగా కందుకూరు-1 వేలం కేంద్రంలో సోమవారంతో పూర్తయ్యాయి. దీంతో ఈ సీజన్ పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. తొలుత 145 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా వేసినా చివరకు 153.58 మిలియన్ కిలోలు దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాలలో కొనుగోళ్లు జరగ్గా సగటున కిలోకు రూ.266.14 ధర లభించింది. తద్వారా పొగాకు రైతులకు రూ.4085.50 కోట్ల మేర రాబడి లభించింది. దక్షిణాదిలో 2021-22లో 76.57 మిలియన్ల విక్రయాలు జరగ్గా రూ. 172.50 సగటు ధర లభించింది. అలాగే 2022-23లో 123 మిలియన్ల విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.216.28 ధర లభించింది. అంటే ఈ ఏడాది సగటు ధర కిలోకు గత ఏడాది కన్నా రూ 50 అలాగే అంతకు ముందు ఏడాదికన్నా రూ.94.09 మేర పెరిగింది.

వేలంకేంద్రాల వారీగా ఈ సీజన్‌లో పంట కొనుగోళ్లు, లభించిన ధరల వివరాలు ఇలా ఉన్నాయి.

వేలం కేంద్రం	కొనుగోలు జరిగిన పంట పరిమాణం (మిలియన్ కిలోలు)	లభించిన సగటు ధర (రూపాయాల్లో)
వెల్లంపల్లి	15.06	275.77
ఒంగోలు-1	18.58	272.75
ఒంగోలు-2	13.80	265.05
టంగుటూరు	16.80	271.54
కొండపి	17.71	265.61
పొదిలి	14.73	263.60
కనిగిరి	7.95	252.60
కందుకూరు-1	16.14	273.00
కందుకూరు-2	14.21	263.28
కలిగిరి	7.68	253.84
డిసిపల్లి	10.39	250.36
మొత్తం	153.58	266.14

రఘురామకృష్ణరాజు కేసు

దర్యాప్తు అధికారిగా ఎస్పీ ఏఆర్.దామోదర్

ఒంగోలుక్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మాజీ ఎంపీ, ప్రస్తుతం ఉండి శాసనసభ్యులు రాఘురామకృష్ణరాజుపై కేసుకు సంబంధించి విచారణాధికారిగా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్‌ను నియమించారు. ఇప్పటివరకు గుంటూరు జిల్లా ఏఎస్పీగా పనిచేస్తున్న రమణమూర్తిని ఆ బాధ్యతల నుంచి తప్పించి ఎస్పీ దామోదర్‌కు అప్పగించారు. కేసుకు సంబంధించిన ఫైల్స్‌ను ఆయనకు అప్పగించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఏఆర్.దామోదర్ ప్రొబెషనరీ డీఎస్పీగా ప్రకాశం జిల్లాలో పనిచేసిన సమయంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హైవే కిల్లర్ మున్నా గ్యాంగ్ ఆట కట్టించిన అధికారిగా మంచిగుర్తింపు తెచ్చుకున్నారు. ముక్కు సూటితనం, పోలీసు ప్రతిష్ఠను పెంచాలనే ఆశయంతో పనిచేసి అనేక ముఖ్యమైన కేసులు ఛేదించారు. దామోదర్‌కు ఈ కేసు అప్పగించడంతో దర్యాప్తు వేగవంతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం అవుతోంది. అప్పట్లో సీఐడీలో ఏఎస్పీగా పనిచేస్తున్న విజయపాల్ తనను విచారణ కోసం పిలిచి హత్యాయత్నం చేశారని ఈ ఏడాది జూలై 11న గుంటూరు జిల్లా నగరపాలెం పోలీసు స్టేషన్‌లో రఘురామకృష్ణరాజు ఫిర్యాదు చేశారు. అందుకు బాధ్యులుగా అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోపాటు, నాటి సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్, నిఘా విభాగం అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, మరికొందరిపై కూడా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు కేసు విచారణాధికారి రమణమూర్తి ఈనెల 11న ప్రసుత్తం రిటైర్డ్ ఏఎస్పీ విజయపాల్‌ను విచారణకు పిలిచారు. అయితే విజయపాల్ విచారణకు సహకరించలేదని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. దీంతో ఎస్పీ స్థాయిలో ఉన్న దామోదర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన సంబంధిత కేసు ఫైల్స్‌ను పరిశీలించిన తర్వాత విచారణ ప్రారంభించే అవకాశం ఉంది.

ఉత్సాహంగా పల్లె పండుగ

- జోరువానలోనూ కార్యక్రమం
- పెట్లూరులో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- ఇతర చోట్ల ఎమ్మెల్యేలు హాజరు
- రోడ్లు, ఇతర పనులకు శంకుస్థాపనలు

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. ఈనెల 20 వరకు జరగనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలో సుమారు రూ.126.19 కోట్ల ఉపాధి పథకం మెటీరియల్ కోటా నిధులతో చేపట్టే 1,168 పనులకు శంకుస్థాపనలు, భూమిపూజ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు చేయనున్నారు రాష్ట్రవ్యాప్తంగా అలా సుమారు రూ.4,500 కోట్లతో 30వేల పనులు చేపట్టేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. కాగా జిల్లాలో సగటున ఒక్కో నియోజకవర్గానికి రూ.15 కోట్ల వంతున కేటాయింపు జరిగింది. ప్రధానంగా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, గ్రావెల్ రోడ్ల పనులు కూడా ఉన్నాయి. గత ఆగస్టు 23న ఒకేరోజు 729 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన సందర్భంగా ఆయా పనుల నిర్వహణకు తీర్మానాలు చేయడం అనంతరం వాటికి పాలనాపరమైన ఉత్తర్వులు కలెక్టర్ ఇచ్చారు. కాగా ఆయా పనులకు ఈ వారంరోజుల్లో శంకుస్థాపనలు చేసి జనవరి ఆఖరుకు పనులు పూర్తిచేయాలన్న లక్ష్యంతో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

57 గ్రామాల్లో 170 పనులకు భూమిపూజ

తొలిరోజైన సోమవారం జిల్లా అంతటా ఈ కార్యక్రమం సాగింది. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన నియోజకవర్గ పరిధిలోని కొండపి మండలం పెట్లూరులో రూ.30 లక్షలతో చేపట్టిన రోడ్డు పనికి ఈ శంకుస్థాపన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలలో అక్కడి అధికారపార్టీ ఎమ్మెల్యేలు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నా పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని అటు అధికార యంత్రాంగం, ఇటు స్థానిక అధికార పార్టీ నేతలు సమన్వయంతో నిర్వహించారు. తొలిరోజున 57 గ్రామాల్లో 170 పనులకు భూమిపూజ కార్యక్రమాలను అధికారులు ఏర్పాటు చేయగా వర్షం కారణంగా కొన్నిచోట్ల అటంకం ఏర్పడినా అత్యధిక పనులను అనుకున్న ప్రకారం చేశారు. కాగా తొలిరోజున మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మినహా అందరూ కార్యక్రమంలో పాల్గొన్నారు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో పాలొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్‌విజయకుమార్ మద్దిపాడు మండలంలో, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కనిగిరి మండలంలో, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గిద్దలూరు మండలంలో, టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి కురిచేడు మండలంలో, వైపాలెంఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు దోర్నాల మండలంలోని గ్రామాల్లో ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు.

వానగండం

జిల్లాకు వానగండం పొంచి ఉంది. ఇప్పటికే నాలుగైదు రోజులుగా ముసురుపట్టి వానలు పడుతుండగా ఆదివారం రాత్రి నుంచి తీవ్రత మరింత పెరిగింది. ప్రస్తుతానికి ఇప్పటివరకు కురిసిన వర్షాలే సరిపోయే అవకాశం ఉండగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచి వాన జోరు అధికమైంది. ఒంగోలు నగరంలో అయితే తెరపి లేకుండా పడుతూనే ఉంది. జిల్లావ్యాప్తంగా అత్యధిక ప్రాంతంలో సోమవారం పగలంతా ఇదే పరిస్థితి కనిపించింది. మంగళ, బుధవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆ మేరకు రాష్ట్ర ప్రకృతి విపత్తుల విభాగం హెచ్చరికలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది.

- నేడు, రేపు భారీ వర్షాలు
- నాలుగు రోజుల్లో 56మి.మీ వర్షపాతం
- ఒంగోలులో గరిష్ఠంగా 181.40 మి.మీ
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- తీరప్రాంత గ్రామాల్లో పర్యటన
- రెండు రోజులు స్కూళ్లకు సెలవు ప్రకటించిన కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మళ్లీ వానలు ప్రారంభమయ్యాయి. అలా సోమవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో జిల్లాలో సగటున 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. పలుచోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షమే కురిసింది. అలా ఈనెల 11నుంచి సోమవారం ఉదయం వరకు సగటున జిల్లాలో 56.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అత్యధికంగా ఏకంగా 181.40 మి.మీ నమోదైంది. అలాగే సంతనూతలపాడు, కొండపి, కనిగిరి, మార్కాపురం, దర్శి నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో 100 మి.మీపైగా ఈ నాలుగు రోజుల్లో నమోదు కాగా ఇతర ప్రాంతాల్లోనూ మంచి వర్షాలే కురిశాయి. సాధారణంగా జిల్లాలో ఈ సమయంలో మంచి వర్షాలే కురుస్తాయి. అలాగే ఈనెల 10 నుంచి జిల్లా అంతటా జల్లులు పడుతున్నాయి. ఒక రకంగా ముసురు పట్టి వాన పడుతోంది. అలా ఈనెల 11 నుంచి 13 వరకు జిల్లాలో 36.0 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. తిరిగి ఆదివారం రాత్రి నుంచి వానలు జోరు పెరిగింది. ఆదివారం ఉదయం వరకు మూడురోజుల్లో నగరంలో 106.40 మి.మీ వర్షపాతం నమోదు కాగా సోమవారం మరో 74.40 మి.మీ.కురిసింది. తిరిగి సోమవారం పగటి పూట కూడా పడుతూనే ఉంది.

నగరం జలమయం

ఒంగోలు నగరంలో ఏ ప్రాంతంలో చూసినా రోడ్లు, కాలువలు ఏకమై చెరువులు, వాగులు, వంకలను తలపిస్తూ నీరు ప్రవహిస్తోంది. శివారు కాలనీల్లోనే కాక పలు ప్రధాన ప్రాంతాల్లోనూ కూడా జలమయమయ్యాయి. ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు ఇలా అందరూ ఇక్కట్లు పడుతున్నారు. ఒంగోలుతోపాటు ఎస్‌ఎన్‌పాడు, కొండపి నియోజకవర్గాల్లోని తీర ప్రాంత మండలాల్లో ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. చాలాచోట్ల లోతట్టు కాలనీలు జలమయంతోపాటు పలు ప్రాంతాల్లో వాగులు పొంగి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పశ్చిమప్రాంతంలో అయితే పొలాల్లో విస్తారంగా పంటలు ఉండగా ఈ వర్షాలతో అవి దెబ్బతినే ప్రమాదం కనిపిస్తోంది. పత్తి, మిర్చి, కంది పంటలకు ఇంకా వర్షం కురిస్తే నష్టం వాటిల్లుతుందని రైతాంగం ఆందోళన చెందుతున్నారు.


ఏల్చూరులో శంకుస్థాపన అనంతరం మాట్లాడుతున్న మంత్రి

పల్లెలకు అభివృద్ధి కళ

» మంత్రి గొట్టిపాటి
» పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రైన్లు, గోకులాలకు శంకుస్థాపనలు


అన్నంబొట్లంవారిపాలెంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

సంతమాగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో అంతర్గత మట్టిరోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో మంత్రి రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో రూ.60లక్షల వ్యయంతో నూతనంగా సీసీరోడ్ల నిర్మణానికి శంకుస్తాపన చేశారు. రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లెలను అబివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. పల్లెల్లో చేపట్టనున్న అభివృద్ధిపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో పనులన్నీ చేపడతామన్నారు. కార్యక్రమంలో పీడీ విజయలక్ష్మి, ఆర్డీవో అఖిల, ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ రవిబాబు, డీపీవో, ఎంఈవో కోటేశ్వరరావు, గాలియ్య, రమేష్, పెదగాలియ్య శ్రీనివాసరావు, వాసిరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బల్లికురవ : ఉపాధి హామీ నిధులతో గ్రామాలలోని మట్టి రోడ్లకు మహర్దశ పట్టనుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం గ్రామాలలో సోమవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. మూడు గ్రామాలలో సీసీ రోడ్లకు ఎంపీడీవో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మాధవ్, సర్పంచ్‌లు వెంకటసుబ్బారావు, శాంతి, ఏపీవో రమాదేవి, ఈవోపీఆర్డీ సుమతి, గ్రామ పెద్దలు నరేంద్ర, వినోద్, శ్రీనివాసరావు, మారుతి పాల్గొన్నారు.

పంగులూరు : ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, గోకులం షెడ్లను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఎంపీడీవో కేస్వరూపారాణి సూచించారు. చందలూరు, నూజెళ్లపల్లి, తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్లపాడు గ్రామాలలో సోమవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణానికి ఎంపీడీవో భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఏఈ హనుమంతరావు, జి.వీరాంజనేయులు, ఈవోపీఆర్డీ కె.సుమంత్, ఏపీవో సంతోషం, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కేవీ సుబ్బారావు, సర్పంచ్‌లు పెంట్యాల కిషోరా వు, కల్యాణి, రవిబాబు, రామలింగస్వామి, నేతలు పాల్గొన్నారు.

చినగంజాం : సంతరావూరులో పల్లెపండుగలో భాగంగా సీసీ రోడ్లకు, మినీ గోకులాలకు భూమి పూజ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో రూ.15లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు, గ్రామంలో మంజూరైన తొమ్మిది మినీ గోకులాలకు అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసమూర్తి, టీడీపీ సీనియర్ నాయకురాలు యార్లగడ్డ లక్ష్మీ, ఈవోపీఆర్డీ బి.సుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మీదేవి, పంచాయతీరాజ్ ఏఈ కే.రామచంద్రుడు, కార్యదర్శి కే.కృపారావు, నాయకులు కేశనపల్లి శ్యాంబాబు పాల్గొన్నారు.

ఇంకొల్లు : పూసపాడు, వంకాయలపాడు గ్రామాలలో రోడ్ల అభివృద్ధికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూసపాడులో రూ.50లక్షలతో సీసీ రోడ్లు, ఇడుపులపాడులో రూ.30లక్షలతో సీసీ రోడ్లు, వంకాయలపాడులో రూ25లక్షలతో సీసీ రోడ్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో రేణుకా, పీఆర్ జేఈ ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పర్చూరు : గ్రామాల్లో రహదారులను అభివృద్ధి చేసి ప్రజల ఇక్కట్లను తీర్చేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె పండుగ కార్యక్రమం సోమవారం అధికారులు, పార్టీ నేతల సారథ్యంలో అట్టహాసంగా ప్రారంభించారు. దేవరపల్లి, తిమ్మరాజుపా లెం, చిన్నంబొట్లవారిపాలెం, అన్నంబొట్లవారిపాలెంలో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ పీఆర్ కె.ఆదినారాయణ, ఏఈ శ్రీనివాసరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు శేఖర్‌బాబు, షంషుద్దీన్, పంచాయతీ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : గ్రామీణ ప్రాంతాలల్లో సదుపాయాల కల్పనలో భాగంగా సైడ్ కాలువలు, సీసీ రోడ్లు నిర్మించుకుందామని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి మస్తాన్‌రావు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా తిమ్మనపాలెం, ఎర్రబాలెంలో అబివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తిమ్మనపాలెం సర్పంచ్ లక్ష్మి శ్రీనివాసరావు, యర్రబాలెం సర్పంచ్ మోరవినేని బాలాజీ, పంచాయతీ రాజ్ ఏఈ ప్రసాద్, టీడీపీ నాయకులు వెంకటరావు, సాధినేని మస్తాన్‌రావు, రాంబాబు, కోటపూరి లక్ష్మణరావు పాల్గొన్నారు. మంగళవారం పమిడిపాడులో జరిగే పలె పండుగ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొంటారని ఎంపీడీ రాజ్యలక్ష్మి తెలిపారు.

నిలిచిన వేట.. ఒడ్డుకు బోట్లు


సంద్రంలో లంగరు వేసిన పడవలు (ఇన్‌సెట్‌లో) ఒడ్డున ఉన్న బోట్లు

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటను నిలిపివేశారు. కొందరు బోట్లను ఒడ్డుకు చేర్చారు. మరికొందరు తీరం వెంట సముద్రంలో లంగర్లు వేశారు. తిరిగి వాతావరణ పరిస్థితులు చక్కబడిన తరువాతే వేటకు వెళతామని మత్స్యకారులు చెప్తున్నారు.

- చీరాల

వైభవంగా జ్వాలాముఖి తెప్పోత్సవం


తెప్పోత్సవంలో కొలువైన అమ్మవారు

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా చీరాల దండుబాటలోని శ్రీ జ్వాలాముఖి అమ్మవారి తెప్పోత్సవాలు వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా కొలనులో కనుల పండువగా దేదీప్యమానంగా హంస వాహనంపై అమ్మవారిని అలంకరించి వేడుకలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ వేడుకలకు భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆద్యంతం అమ్మ నామాన్ని జపిస్తూ భక్తి శ్రద్ధలతో భక్తులు పరవసించారు.

డ్రైనేజీ సమస్య లేకుండా చూడండి

మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే కొండయ్య సూచన


మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తీవ్రత వలన ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌తో ఎమ్మెల్యే కొండయ్య ఫోన్‌లో మాట్లాడారు. పురపాలక సంఘం పరిధిలో డ్రైన్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. దీంతో కమిషనర్ తన సి బ్బందితో పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. డ్రైన్‌లు సమస్యలు ఉన్నచోట్ల పూడికలు, మరమ్మతులు చేయించారు. దీనిపై ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏడుగురిపై కేసులు

» రూ.1.75లక్షల అపరాధ రుసుము విధింపు
» వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల దుర్వినియోగంపై స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను దుర్వినియోగం చేస్తూ చేపల చెరువులకు నీటి పంపింగ్‌కు వినియోగిస్తున్న ఏడుగురిపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసి వారికి రూ.లక్షా75వేల అపరాధ రుసుము విధించినట్లు విద్యుత్ రూరల్ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. ఆం ధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌ల దుర్వినియోగం అనే కథనంపై స్పందిచిన ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తనఖీలకు ఆదేశించడంతో రూరల్ ఏఈ శివప్రసాద్ సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు చేపట్టారు. తరచూ తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

గోతుల మయం

» పంగులూరు, ముప్పవరం ప్రధాన రహదారిలో నరక ప్రయాణం


పంగులూరు-ముప్పవరం ప్రధాన రహదారిలో గోతులు

పంగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంగులూరు, ముప్పవరం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై పలు చోట్ల ఏర్పడిన గోతులతో రాకపోకలకు అంతరాయంగా ఉంది. నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో రాక పోకలు సాగించలేక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇంకొల్లుతో పాటు పంగులూరు పరిసర ప్రాంతాల ప్రజలు వివిద పనుల నిమిత్తం 16వ నెంబరు జాతీయ రహదారిని చేరుకునేందుకు ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం సాగిస్తుంటారు. అద్దంకి నుంచి ఇంకొల్లుకు ప్రజా రవాణా కోసం నడిపే ఆర్టీసీ బస్సులతో పాటు ఇటుక, ఇతర రవాణా సరుకులు చేరవేసే ట్రాక్టర్లు, లారీలు, ఇతర వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా జనకవరం, ముప్పవరం గ్రామాల మధ్య భారీ గోతులు దర్శన మిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులకు అధికారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టలేదు. రాత్రివేళ ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు భారీ వాహనాలు ఎదురైన సందర్భంలో లైట్ల వెలుగులో గోతులను గుర్తించ లేక తరచూ ప్రమాదలబారిన పడుతున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల నిడివిలో జనకవరం, కొండమూరు అడ్డరోడ్డు నుంచి ముప్పవరం వరకు రోడ్డుపై అడుగడుగునా ఏర్పడిన గుంతలపై ప్రయాణం ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు పునర్ నిర్మించే వరకు కనీస మరమ్మతులనైనా చేపట్టాలని సంబంధిత అధికారులను వాహన చోదకులు, ఈ ప్రాంత ప్రజలు వేడుకుంటున్నారు.


కొండమూరు, ముప్పవరం మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

వాన అవస్థలు

» రోడ్లు జలమయం
» పొంగిపొర్లుతున్న వాగులు
» మత్స్యకారుల వేటకు వెళ్లొద్దని హెచ్చరిక


చీరాలలో ప్రధాన రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కుండపోతగా కురిసిన వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులు, కుంటలు నీటితో నిండి వాగులను తలపించాయి. గాలివానకు వాహనదారులకు రోడ్లు సైతం మూసుకుపోయి ప్రయాణం నరకంగా మారింది. మరో మూడు రోజులు వానలు కురిసే అవకాశం ఉండడంతో అధికారులు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

నిండిన పొలాలు

బల్లికురవ : అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు సోమవారం ఎడ తెరపి లేకుండా కురవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు. అన్ని గ్రామాలలో వాన ఆగకుండా పడుతుండడంతో సాగు చేసిన రైతుల్లో ఆందోళన నెలకుంది. మరో మూడు రోజులు వర్షాలు పడతాయని అధికారులు చేసిన ప్రకటనతో పొగాకు రైతులు తమ పంటకు ముప్పు తప్పదని అంటున్నారు. జూట్ పంట కాపు మీద ఉందని, ఇప్పుడు వర్షాలు పడితే పంట చేతికి వచ్చే అవకాశం ఉండదని వారు అంటున్నారు. భారీ వర్షాల ప్రభావంతో గ్రామాలలోని రోడ్లు జలమయమయ్యాయి. బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో రోడ్లు వాగలును తలపిస్తున్నాయి. చెన్నుపల్లి అనంతవరం రోడ్డు లో క్వారీల వద్ద రోడ్డు బురదగా మారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రానైట్ నేల క్వారీలలో పనులు నిలిచి పోయాయి

చినగంజాంలో భారీ వర్షం

చినగంజాం : చినగం జాం మండలంలో భారీ వర్షం కురిస్తుంది. సోమవారం వేకువ జాము నుం చి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. భారీ వర్షం కారణంగా మండల పరిధిలో పలు చోట్ల పోసిన వరి నారుమడులలో వర్షపునీరు నిలిచింది. వేసిన వరినాట్లు కూడా వర్షపునీటిలోనే ఉన్నాయి. వర్షం ఇలాగా కొనసాగితే వరినారుముడులు, వేసిన నాట్లు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెదగంజాం గ్రామంలో పిట్టు నాగార్జునరెడ్డికి చెందిన మట్టిగోడల పూరిల్లు చుట్టూ వర్షపునీరు చేరడంతో మట్టిగోడలు నాని కూలిపోయాయి. గ్రామాల్లో అంతర్గత రోడ్లపై వర్షపునీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చినగంజాం గ్రామ శివారు కాలనీలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు నరకయాతన పడుతున్నారు. కడవకుదురు వద్ద చీరాల, ఒంగోలు ఆర్‌అండ్‌బీ రహదారిపై వర్షపునీరు చేరి చెరువును తలపించాయి. దీనితో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు పలు ఇబ్బందులు పడ్డారు. వర్షాల వలన ఆక్వా చెరువులలో కూలింగ్ సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు తెలిపారు.

పొంగిన వంకాయలపాడు వాగు

ఇంకొల్లు : వర్షాలకు పాతమద్రాసు రోడ్డులో ఇంకొల్లు నుండి పర్చూరు పోవు రహదారిలో వంకాయలపాడు వద్ద కప్పలవాగు పొంగి ప్రవహిస్తుంది.ఇక్కడ వాగుపై ఉన్న బ్రిడ్జి శిధిలావస్థకు చేరుకోవడంతో నేలచప్టా నిర్మాణం చేసారు.చిన్నపాటి వర్షానికే నేల చప్టా పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.ఎగువన వర్షాలు కురిసినా రాకపోకలు ఆగిపోతున్నాయి.ఎటు వాహనాలు అటు నిలిచిపోతున్నాయి.ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు.

పర్చూరు : వర్షాలతో జన జీవనం స్తంభించింది. ప్రజలు ఇంటికే పరిమితమయ్యారు. రహదారులు జలమయం కావడంతో అనేక చోట్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాగులు, కాలువల్లోకి భారీగా నీరుచేరింది. భారీ వర్షాల కారణంగా అధికారులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలువు ప్రకటించారు. పర్చూరు - చీరాల ప్రధాన రహదారిలో పెద్ద ఎత్తున నీరు రోడ్డుపై చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వేకువ జామునుండి ఎడతెరపు లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో శివారు కాలనీల్లో వరద నీరు చేరింది. ఇందిరా కాలనీ, నెహ్రూనగర్, అంబేద్కర్ కాలనీ, బోడవాడ శివారు కాలనీలతో పాటు పలు ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాల్లోని నివాసాల్లోకి వాన నీరు చేరింది.


నక్కబొక్కలపాడులో పొగాకు పంటలో నిలిచిన వర్షపు నీరు


ప్రవహిస్తున్న వంకాయలపాడు వాగు

లక్కు వీరులు



డ్రాలో దక్కిన మద్యం దుకాణాలు

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నియోజకవర్గంలో లక్కు వీరులు తమ అదృష్టంలో నెగ్గారు. 23 మద్యం షాపులకు దక్కించుకున్న వ్యక్తుల వివరాలను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అద్దంకి సర్కిల్ సీఐ భవాని ప్రకటించారు. అద్దంకి పట్టణంలోని 19వ నెంబరు షాపును బొడ్డపాటి రవిబాబు, పరిటాల ఆదినారాయణకు 20వ షాప్, నాగేంద్రబాబుకు 21, 22 వ డి.హరికృష్ణకు 22, కోనేటి శేఖర్‌బాబు 23వ నెంబర్ దుకాణం దక్కింది. అద్దంకి రూరల్ మండలంలో 85వ నెంబర్ షాపును జి.హరిబాబుకు, 86ను కొటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, బల్లికురవ మండలంలో 87 ప్రత్తిపాటి నరేంద్రకు, 88 మొరసా సురేష్‌కు, 89, 90 కట్టా వెంకటసుధాకర్, కొరిశపాడు మండలంలోని 91, 93 దుకాణాలను బి.సుబ్బారావు, 92 రవి, 94ను టీ అంజయ్య దక్కించుకున్నారు. సంతమాగులూరు మండలంలో 95వ నెంబర్ దుకాణం కొప్పాక తులసికి, 96 చేవూరి వాసురెడ్డి, 97 డాకా హనుమారెడ్డి, 98 జి.ఖాదర్‌బాబు, 99 శ్రీనివాస్ పొందారు. పంగులూరు మండలంలో 100వ నెంబరు షాపును బాచిన భానుప్రకాష్, 101 కానుమూరి ఆంజనేయులు, 102 గరిమిడి జగన్మోహనరావు దక్కించుకున్నారు. ఆయా మండలాలలో షాపులు దక్కించుకున్న వారిలో అత్యధిక శాతం స్థానిక టీడీపీ నేతలే కావడం విశేషం. దరఖాస్తులు దాఖలు సమయంలోనే అత్యధిక శాతం టీడీపీ నేతలు వేయడం తో వారిలో కొందరికి వైన్ షాపులు దక్కాయి. అయితే దరఖాస్తు చేసిన వారు ఎక్కువ శాతం సిండికేట్‌గా ఏర్పడ్డంతో వాటాల మేర షాపులను నిర్వహించే అవకాశం కన్పిస్తుంది. అయితే కొందరు నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా తమ లక్కును పరీక్షించుకునేందుకు వెళ్లి దక్కకపోవడంతో నిరుత్సాహంలో ఉన్నారు.

ముగిసిన మద్యం షాపుల లాటరీ

నేడు సరుకుకు డీడీల చెల్లింపు

చీరాలటౌన్ : ఎట్టకేలకు ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మద్యం పాలసీకి సంబందించి చీరాల సర్కిల్ పరిధిలోని 24 షాపులకుగాను సోమవారం లాటరీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈక్రమంలో చీరాల పురపాలక పరిధిలోని 8వ నెంబర్ దుకాణం ఎగుటూరి శివకుమారికి, నర్రా బాలకృష్ణకు 9, బెల్లం నాగార్జునకు 10, పృధ్వీ పవన్‌కుమార్ 11, సూరగాని నరసింహారావు 12, కీర్తి వెంకటరావుకు 13, యార్లగడ్డ కౌషిక్‌కు 14, దంతం వెంకటేశ్వర్లుకు 15, రూరల్ పరిధిలో 69వ నెంబర్ షాప్‌ను దొడ్డ శ్రీనివాసరావుకు, కర్పూరపు రామారావుకు 70, సూరగాని కుమార్‌రాజకు 71, ఎస్ చిరంజీవికి 72, నాగేంద్రుడు 73, ఉప్పలమర్తి వెంకట సుబ్బారావు 74, వేటపాలెం పరిధిలో 80వ షాప్, సూరగాని నరసింహారావు, 81 రామకిరణ్, 82ను జెట్టి చంద్రశేఖర్‌కు, రావిపాటి హను ప్రసాద్‌కు 83, నర్రా బాలకృష్ణకు 84, చిన గంజాం పరిధిలో 75వ షాప్‌ను నాయుడు హనుమంతురావుకు, 76ను రాములుకు, 77ని బత్తుల శ్రీనివాసరావుకు కేటాయించారు. కారంచేడు పరిధిలో 78వ దుకాణం నల్లూరి రవికి, యార్లగడ్డ వెంకటప్పయ్య 78 దక్కాయి. షాపులు సాధించిన వారు సరుకు కోసం మంగళవారం డీడీ చెల్లించనున్నారు. పాత దుకాణాలు నేటి రాత్రికి అధికారికగా మూతపడ్డాయి. మిగిలిన సరుకును అధికారులు స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన దుకాణదారులు బుధవారం ఉదయం నుంచి విక్రయాలు జరుపనున్నారు. ఒకవైపు నూతన దుకాణాలు, మరోవైపు పాత బ్రాండ్‌లు మార్కెట్‌లోకి రానుండడంతో మద్యం ప్రియుల్లో సందడి నెలకుంది.

ఇంకొల్లు మండలంలో మూడు మద్యం దుకాణాలు మంజూరు కాగా లాటరీలో గెలుచుకున్న వారి వివరాలను ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.షాపు నెంబరు 113 బోడాల మురళీకృష్ణ, 114 కొల్లా శ్రీనివాసరావు, 115వ దుకాణం పాలేరు రామకృష్ణకు దక్కినట్లు చెప్పారు.

పర్చూరు : పర్చూరు ప్రాంతంలో అత్యధికంగా మద్యం దుకాణాల కోసం ఆశావాహులు ఎంతో ఉత్సాహంగా పాల్గొనగా వారి ఆశలు ఆవిరయ్యాయి. ఒకటి రెండు దరఖాస్తులు చేసుకున్న వారికి వైన్ షాపులు దక్కాయి. గతంలో పదుల సంఖ్యలో షాపులు నిర్వహించిన వారికి లాటరీలో చుక్కెదురైంది. పర్చూరు ఎక్సైజ్ సబ్‌డివిజన్ పరిధిలో మొత్తం 15 షాపులకుగాను 449 మంది పోటీపడ్డారు. మండల పరిధిలో మొత్తం 4 దుకాణాలకు 78, ఇంకొల్లు 3 షాపులకు 140, మార్టూరులో 6 షాపులకు 190, యద్దనపూడిలో 2 షాపులకు 41 మంది దరఖాస్తు చేసుకున్నారు.

పర్చూరు మండల పరిధిలో ఉన్న నాలుగు షాపులకు 103వ నెంబర్‌ను రంగినేని నాగరాజు, 104ను లింగిశెట్టి రామాంజనేయులు, 105ను శివనాగరాజు, 106ను సతీష్ దక్కించుకున్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

వేగం షార్ట్ ఫీల్మ్ సీడీ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి

బల్లికురవ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : యువత అన్ని రంగాల్లో రాణించి సమాజాభివృద్ధికి పాటుపడాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాడుకు చెందిన దమ్ము ఏడుకొండలు నిర్మాతగా రుపొందించిన వేగం షార్ట్ ఫీల్మ్ సీడీని మంత్రి రవికుమార్ మంత్రి అతిథి గృహంలో సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకులు ప్రజలకు విజ్ఞానాన్ని పెంచేలా షార్ట్ ఫీల్మ్‌ను తీయడం అభినందనీయం అన్నారు. ప్రజల నుంచి మంచి ఆదరణ లభించి షార్ట్ ఫిల్మ్ విజయవంతం కావాలని అయన కోరారు. కార్యక్రమంలో దర్శకుడు వెంకట్, నిర్మాత దమ్ము ఏడుకోండలు, గ్రామస్థులు గుర్రాల శ్రీనివాసరావు, దమ్ము అంజనేయులు, అంజయ్య మనికె రామారావు, నాగరాజు, శివ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్ధనలో పాల్గొన్న మంత్రి

సంతమాగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏల్చూరు గ్రామంలో గార్మియ పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. విద్యుత్ గొట్టిపాటి రవికుమార్ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఏల్చూరు గ్రామంలోని దర్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి వెంట తేలప్రోలు రమేష్, అలూరి శ్రీనివాసరావు, నక్కా పెద గాలియ్య, దుద్దే గాలియ్య పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో యువకుడు మృతి

ఈపూరుపాలెం (చీరాలటౌన్) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో కాటూరి భాను (28) సోమవారం ఉదయం మృతి చెందాడు. అతడు చీరాల మండలం ఈపూరుపాలెం పంచాయతీ ఈసూబ్‌నగర్ వాసి. ఆటో డ్రైవర్‌గా ఉంటూ భార్య కవిత, ఇద్దరు కుమారులను పోషిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన భాను అదే ప్రాంతంలోని రైలు గేటు సమీపంలో పట్టాలపై మృతిచెంది పడివున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టంకు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఏరియా హాస్పిటల్‌కు స్ట్రెచ్చర్ బహూకరణ



స్ట్రెచ్చర్‌ను బహూకరించిన దాత


చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా హాస్పిటల్‌కు ఈపూరుపాలెంకు చెందిన మునగాల షైమిత, నారాయణ దంపతులు స్ట్రెచ్చర్‌ను బహూకరించారు. రూ.10వేలు విలువైన వస్తువును హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణికి అందజేశారు. రోగుల సౌకర్యార్థం ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

న్యాయం చేయాలి

పోలీసులను ఆశ్రయించిన మహిళ, సంఘ నాయకులు

చీరాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తన భర్తను వేధించి అతని మృతికి కారణమైన మహిళపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వేటపాలెంకు చెందిన గిరిజన మహిళ గంటా వాణి, సంఘ నాయకులు సుబ్బారావు డిమాండ్ చేశారు. ఇటీవల గంటా శేఖర్ బలవన్మరణం చెందిన సంఘటన పాఠకులకు విదితమే. ఈక్రమంలో అతని మృతి వెనుక మరో మహిళ ప్రమేయం ఉందని ఆరోపించారు. దీనిపై న్యాయపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సోమవారం ఎస్పీ తుషార్‌డూడీని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణకు ఎస్పీ డీఎస్పీ జగదీష్ నాయక్‌ను ఆదేశించారు. ఈ ఘటనపై వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసి ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఎంఈవో మృతి


సత్యనారాయణ (ఫైల్

అద్దంకి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఎంఈవో యలగాల సత్యనారాయణ(70) ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత అద్దంకిలోని రామ్‌నగర్‌లో మృతి చెందారు. సత్యనారాయణ అద్దంకి, తాళ్లూరు, బల్లికురవ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేశారు. అతనికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతదేహనికి పలువురు నివాళులర్పించారు.

ఈ-పంట ముసాయిదాల ఏర్పాటు

పంగులూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఈ-పంట నమోదు వివరాల ముసాయిదా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచడం జరిగిందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. పంగులూరు రైతు సేవా కేంద్రంలో ఈ పంట ముసాయిదాను ఏవో సుబ్బారెడ్డి రైతలుతో కలసి పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతులు ఈ నెల 16లోగా సరి చూసుకుని ఏవైనా తప్పులుంటే సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియపరచాలన్నారు. 18వ తేదీన తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. 18 నుంచి 22 వరకు డిజిటల్ ఎకనామిట్లు, ఫిజికల్ ఎకనామిట్లు రైతులకు ఇస్తామని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వర్షం కొనసాగితే మినుముకు నష్టం

అల్ప పీడనం కారణంగా కురుస్తున్న వర్షాలు ఎక్కువైతే కాపు దశలో ఉన్న మినుము పైరుకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని కొండమూరు, ముప్పవరం, రేణంగివరం, బయటమంజులూరు పరిసర గ్రామాలలో మినుమును విసారంగా సాగు చేశారన్నారు. మండలంలో 3వేల 500 ఎకరాల్లో మినుము పైరు సాగవుతున్నట్లు తెలిపారు. రెండు వేల ఎకరాల వరకు కాపు దశలో ఉన్నట్లు తెలిపారు.

పంట కాలువల్లో పూడికతీతకు రూ.29 కోట్లు

నెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువలను బాగు చేసేందుకు ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. వ్యవసాయ సీజన్ దగ్గర పడుతుండడంతో ఈ ఏడాదైనా పూడిక తీస్తారా.. లేదా..? అన్న ఆందోళనలో రైతాంగం ఉండగా ఈ లోపే రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న ఖరీఫ్ సీజన్‌కు పంట కాలువల్లో పూడిక తీసేందుకు ప్రభుత్వం నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్‌కు రూ.29 కోట్లు మంజూరు చేసింది. వీటితో కాలువల్లో పూడిక, గుర్రపుడెక్కాకును తొలగించనున్నారు. అలానే తెలుగుగంగ ప్రాజెక్టుకు మరో రూ.4 కోట్లు, సోమశిల ప్రాజెక్టుకు రూ.14 కోట్లు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వంలో గడిచిన మూడు సీజన్లుగా కాలువల్లో పూడిక తీయకుండానే నెట్టుకొచ్చారు. ఎక్కడైనా సీజన్ ప్రారంభానికి ముందు కాలువలను బాగు చేస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వంలో మాత్రం సీజన్ మొదలయ్యాక కాలువల్లో పూడిక తీసినట్లుగా చూపించి బిల్లులు చేసుకున్నారు. ఈ అవినీతిపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. అదే సమయంలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా సీజన్ కన్నా ముందుగానే పనులు చేసేందుకు నిధులు మంజూరు చేసింది. ఒకటి, రెండు రోజుల్లో ఈ పనులకు టెండర్లు ఆహ్వానించనున్నారు. ఈ నెలాఖరులోపు ఎలాగైనా పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే నెల నుంచి పంటల సాగు ప్రారంభం కానుంది.



జలదంకి మండలం జమ్మలపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

'పల్లె పండుగకు వర్షం దెబ్బ

నెల్లూరు జడ్పీ, (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో మౌళిక సదుపాయల కల్పనకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న పల్లెపండుగ కార్యక్రమం తొలిరోజే మూడు నియోజకవర్గాలకే పరిమితమైంది. తుఫాన్ ప్రభావం, పనుల ప్రతిపాదనలను కొంతమంది ఎమ్మెల్యేలు ఖరారు చేయకపోవటం తదితర కారణాలు. కావలి, ఆత్మకూరు మినహా మిగతా నియోజవర్గాల నుంచి ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందాయి. దీంతో తొలిరోజు నెల్లూరు రూరల్, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాల్లో మాత్రమే ఈ కార్యక్రమం ప్రారంభమైంది. కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో నిర్వహించే అవకాశం లేకుండా పోయింది.



'సోమశిల' అభివృద్ధికి ప్రణాళిక

ఎత్తయిన కొండలు, పచ్చని చెట్లు, గలగల పారే పెన్నమ్మ నెలవైన సోమశిల త్వరలో మరెన్నో అందాలతో ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా మారనుంది. ఇందుకోసం కూటమి ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళికలు రచిస్తోంది. ఎకోటూరిజం ద్వారా సుమారు రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు జరగనున్నాయి. అనుకున్నస్థాయిలో అన్నీ పూర్తయితే 'సోమశిల'కు పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు స్థానిక యువతకూ ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది.

6



డ్రైవర్ నిద్రమత్తు.. ఇద్దర్ని బలిగొంది!

మనుమరాలి పెళ్లి చూశానన్న ఆనందం ఆ వృద్ధురాలిలో ఎంతోసేపు నిలవలేదు. సోమవారం తెల్లవారుజామున వలేటివారిపాళెం మండ లం కొండారెడ్డిపాళెం వద్ద డ్రైవర్ నిద్రమత్తుతో కారు అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు మహిళలు మృతి చెందగా, ఐదుగురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి.

6

అర్జీదారుడి సంతృప్తే ముఖ్యం

- 'గ్రీవెన్స్' సమస్యలన్నీ పరిష్కరించాల్సిందే!
- ఉచిత ఇసుక పాలసీ పటిష్టంగా అమలు
- చివరి దశకు ఫ్రీహోల్డ్ భూములపై విచారణ
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ఆనంద్

6 లో..

'ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా ప్రధాన కర్తవ్యం. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో వస్తున్న ప్రతి అర్జీని పరిశీలిస్తున్నాం. అర్జీదారుడి సంతృప్తి చెందేలా వీటిని పరిష్కరిస్తున్నాం. కోర్టు పరిధిలో ఉన్న వివాదాస్పద సమస్యలు మినహా మిగిలిన అర్జీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. ఒక అర్జీదారుడు మళ్లీ మళ్లీ వస్తుంటే అలాంటి కేసులను నేనే స్వయంగా చూస్తున్నా. పరిష్కరించగలిగిన సమస్యలను కూడా పరిష్కరించలేకపోతున్న అధికారులపై చర్యలకు ఉపక్రమిస్తున్నాం. అంతిమంగా సమస్యను పరిష్కరించి, ఫిర్యాదిదారుడు సంతృప్తి చెందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని కలెక్టర్ ఓ ఆనంద్ వెల్లడించారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.



రోజంతా వర్షం!

నేడు కూడా కురిసే అవకాశం

- గ్రామీణ, పట్టణ రోడ్లన్నీ జలమయం
- నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు
- లోతట్టు ప్రాంతాలపై దృష్టి : కలెక్టర్
- నేడు కూడా విద్యాసంస్థలకు సెలవు
- సమస్యను నా దృష్టికి తేవాలి : మంత్రి నారాయణ
- కలెక్టర్‌తో చర్చించిన మంత్రి ఆనం



నెల్లూరు నగరంపై కమ్ముకున్న మేఘం



నెల్లూరు : అరవింద్‌నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద..

జిల్లా వర్షపాతం 95.4 మిమీ

జిల్లాలో సగటు వర్షపాతం 95.4 మి.మీగా నమోదైంది. అత్యధికంగా జలదంకిలో 169.4మిమీ వర్షపాతం నమోదవగా, అత్యల్పంగా సీతారామపురంలో 38.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

మండలం	మి.మీ
అనంతసాగరం	107.2
జలదంకి	169.4
సంగం	126
కావలి	133.6
అల్లూరు	153.6
ఉలవపాడు	94.8
కలువాయి	91.2
చేజర్ల	94.2
బోగోలు	132.4
ఆత్మకూరు	79
గుడ్లూరు	87.2
కందుకూరు	112.2
దగదర్తి	107.8
లింగసముద్రం	74.2
కొడవలూరు	140.6
ఏఎస్‌పేట	84.4
వలేటివారి పాళెం	822
కలిగిరి	109.4
కొండాపురం	68.0
బుచ్చిరెడ్డిపాలెం	116.0
విడవలూరు	168.6
దుత్తలూరు	61.6
ఉదయగిరి	67.6
నెల్లూరు రూరల్	89.8
మర్రిపాడు	63.8
సీతారాంపురం	38.4
వరికుంటపాడు	43.6
వెంకటాచలం	90.8
వింజమూరు	75.6
కోవూరు	113.8
పొదలకూరు	74.2
ఇందుకూరుపేట	90.8
టీపీ గూడూరు	87.0
నెల్లూరు అర్బన్	100.4
మనుబోలు	54.6
ముత్తుకూరు	102.0
రాపూరు	54.6
సైదాపురం	59.0

నెల్లూరు హరనాథపురం (ఆంధ్రజ్యోతి) : ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి జిల్లాలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. మంగళవారం కూడా జిల్లాలో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ, అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. కొన్నిచోట్ల పిడుగుల పడే అవశాశం ఉందని తెలిపింది. సోమవారం కురిసిన వర్షానికి జిల్లాలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. నెల్లూరు నగరంలోని మురుగునీటి కాలువలు పొంగి ప్రవహిస్తున్నా యి. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు రావటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్, ఎంజీబీ మాల్ వద్ద రోడ్డుపై నీరు నిల్వ చేరింది. వైఎస్ఆర్ నగర్‌లో వర్షపునీరు వచ్చి చేరింది. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. గిరిజన కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. కనుపర్తిపాడు వద్ద మేజర్ డ్రైయిన్స్‌లో ఉన్న వ్యర్థాలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. పొదలకూరు ప్రధాన రహదారి ప్రాంతంలో చెట్టు కూలింది. మొత్తం మీద జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

● లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టాం : కలెక్టర్

జిల్లాలోని లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టామని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సముద్రంలోకి వేటకు వెళ్లిన 161 బోట్లను వెనక్కు రప్పించామని తెలిపారు. 650 మంది మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు రప్పించామని చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 146 పునరావాస కేంద్రాలను పరిశీలించినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి 9 మండలాల్లోని 42 గ్రామాల్లో ఈ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. సోమశిల, కండలేరు జలాశయాలకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. సోమశిలకు వరద పెరిగితే ముంపునకు గురయ్యే 127 గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తం చేశామని చెప్పారు. పెన్నా కరకట్టలక రక్షణకు ఇసుక బస్తాలు సిద్ధం చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. వెంకటగిరిలో ఒకటి, నెల్లూరులో ఒక ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కాగా సోమవారం సాయంత్రం కలెక్టర్ ఆనంద్ ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు, తహసీల్దార్‌లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కావలి ఆర్డీవో మురళీకృష్ణ కలెక్టర్‌తో మాట్లాడుతూ కావలి, కొడవలూరులోని కొన్ని ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని వివరించారు.



చెరువు కాదు... అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వర్షపునీరు



బిట్రగుంట : ఒడ్డుకు చేరిన పడవలు

● నేడు కూడా సెలవు

కాగా అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు, కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటించామని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా మంగళవారం కూడా సెలవు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

● సమస్యను నా దృష్టికి తేవాలి : మంత్రి నారాయణ

వర్షాలకు ఏ సమస్య వచ్చినా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకుని రావాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీతోపాటు మున్సిపల్ వ్యవస్థ, విపత్తు నిర్వహణశాఖ అధికారులు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాల వల్ల గండ్లు పడే కాలువలు, గట్లను గుర్తించి పర్యవేక్షించాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తాను 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు.

● కలెక్టర్‌తో చర్చించిన మంత్రి ఆనం

భారీ వర్షాల ప్రభావం, తీసుకున్న జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ ఆనంద్‌తో రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో సోమవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ద్వారా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్నీ ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలలో ఉంచేందుకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి ఆనం సూచనలతో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్ర మత్తం చేస్తున్నట్లు ఆర్డీవో పావని తెలిపారు.



కావలి : నీటమునిగిన ముసునూరు గిరిజనకాలనీ

● అప్రమత్తంగా ఉండండి

భారీవర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఎక్కడా ముప్పు వాటిల్లకుండా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకో వాలని కోరారు. చెరువులు, కాలువలను పర్యవేక్షించా లన్నారు.

ఉత్కంఠ.. ఉద్వేగం!

- ఎట్టకేలకు వైన్‌షాపుల ఖరారు
- లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.115.7 కోట్ల ఆదాయం
- 182 మద్యంషాపులకు లైసెన్సులు
- మహిళలను వరించిన 24 దుకాణాలు
- కలెక్టర్, జేసీల ఆధ్వర్యంలో లాటరీ
- సిండికేట్‌లో నష్టపోయినవారు ఎక్కువే
- రేపటి నుంచి మద్యం ప్రైవేటు అమ్మకాలు

నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో సోమవారం ఉదయం 8 గంటలకు కలెక్టర్ ఓ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ మద్యం షాపుల కేటాయింపునకు లాటరీ తీశారు. విజేతలు అయిన జిల్లాలోని 182 షాపుల వ్యాపారులకు లైసెన్సులు అందజేశారు. ఈ షాపుల లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.115.70 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, ఈ లాటరీలో 24 దుకాణాలు మహిళలకు దక్కాయి. విజేతలుగా నిలిచిన వారు ఆనందంతో కేకలు, ఈలలు వేయగా, నష్టపోయిన వారు తల వంచుకొని దెబ్బ పడిందిరా అనుకుంటూ బయటకు వెళ్లిపోయారు. మొత్తం మీద లాటరీ ప్రక్రియ ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా ముగిసింది.





లక్కీడ్రాలో విజేతను ప్రకటిస్తున్న కలెక్టర్

నెల్లూరు క్రైం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: వైన్‌షాపుల లాటరీ ప్రక్రియకు ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కళాక్షేత్రంలోని వేదికపై రెండు టేబుళ్లను ఏర్పాటు చేశారు. మొదటి టేబుల్‌లో ఎన్ఎల్ఆర్-1 షాపు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ లాటరీ ప్రక్రియను ప్రారంభించగా, రెండో టేబుల్‌లో ఎన్ఎల్ఆర్-95 షాపు నుంచి జేసీ లాటరీ ప్రారంభించారు. ఎక్సైజ్ సిబ్బంది ఒక్కో షాపునకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు మైక్‌ద్వారా ప్రకటించి, వారికి కేటాయించిన టోకెన్ నెంబర్లను చూపించి వాటిని ఓ డబ్బాలో వేశారు.అనంతరం మూత వేసి బాగా కలియతిప్పి కలెక్టర్ వద్ద పెట్టగా, ఆయన టోకెన్‌ను తీసి మైక్‌లో విజేత పేరు ప్రకటించారు. ఆ తర్వాత మరో రెండు టోకెన్లకు లాటరీ తీశారు. ఇలా 182 షాపులకు లాటరీ నిర్వహించి విజేతలుగా నిలిచిన వ్యాపారులను ప్రకటించారు. మొదటి టోకెన్ తీసిన వ్యాపారులు షాపు తీసుకునేందుకు ఆసక్తి చూపక పోయినా, సోమవారం సాయంత్రానికి లైసెన్సు ఫీజు చెల్లించక పోయినా తర్వాత తీసిన నెంబర్లకు షాపులు కేటాయించేందుకు మూడు నెంబర్లను లాటరీలో తీశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.10 గంటల వరకు కలెక్టర్, జేసీ దగ్గరుండి లాటరీ తీసి విజేతలను ప్రకటించారు. షాపులు పొందిన వారు కళాక్షేత్రంలోనే ఏర్పాటు చేసిన బ్యాంకు కౌంటర్‌లో లైసెన్సు ఫీజు చెల్లించి లైసెన్సు పొందారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా వైన్‌షాపుల లాటరీ ముగిసిందని, ఈనెల 16వ తేదీ నుంచి వ్యాపారులు వైన్‌షాపులను ప్రారంభించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ టీ శ్రీనివాసరావు, ఏసీ పీ దయాసాగర్, ఈఎస్ ఏ శ్రీనివాసనాయుడు, ఏఈఎస్‌లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

● సిండికేట్లతో నష్టపోయాం..

గతంలో వైన్‌షాపులు, బార్లకు టెండర్లు పడుతున్నాయంటే ఏళ్ల తరబడి మద్యం వ్యాపారంలో పాతుకుపోయిన వ్యాపారులు సిండికేట్‌లుగా మారేవారు. అయితే ఈ ఏడాది మాత్రం పాత వ్యాపారులు వైన్‌షాపులకు దరఖాస్తులు వేసేందుకు పెద్దగా ఆసక్తి చూపలేదు. కొత్తగా వేలమంది వ్యాపారులు దరఖాస్తు చేశారు. వీరిలో అత్యధికులు అధికార పార్టీ నాయకులకు దగ్గరగా ఉండే నాయకులు, కార్యకర్తలే. అధికార పార్టీ నేతల పర్యవేక్షణలో 10 నుంచి 12 మంది కలిసి సిండికేట్‌గా మారి పలు వైన్‌షాపులకు 100కుపైగా దరఖాస్తులు వేసినట్లు సమాచారం. అయితే ఒక్క నియోజక వర్గం నుంచి మూడు నాలుగు సిండికేట్లు ఏర్పడటంతో వందల దరఖాస్తులు చేసుకున్నా, సిండికేట్‌లుగా మారిన వారికి మూడు నుంచి ఐదులోపే దుకాణాలు వచ్చినట్లు తెలిసింది. వందలాది దరఖాస్తులు వేస్తే ఒక్క షాపే వస్తే దాన్ని ఎవరు.. ఎలా పంచుకోవాలి అబ్బా..? భారీగానే నష్టపోయామని వ్యాపారులు చర్చించుకుంటూ కన్పించారు.



మా పరిస్థితి ఏమిటో..!?



నగదు లెక్కేసుకుంటున్న వ్యాపారులు

● లైసెన్సుదారులకు ఫోన్లు

జిల్లా వ్యాప్తంగా సిండికేట్‌లో లేకుండా లైసెన్సులు పొందిన వ్యాపారులకు సిండికేట్ల నుంచి ఫోన్‌లు వచ్చాయని పలువురు వ్యాపారులు తెలిపారు. సమావేశానికి రావాలని మీ లైసెన్సులో కొందరికి భాగం ఇవ్వాలంటూ వారిని కోరినట్లు సమాచారం. భాగం ఇవ్వకపోతే వ్యాపారాలు చేసుకోవడం కష్టమని, ఆ ప్రాంతానికి చెందినవారు ఆ షాపులో భాగస్తుడిగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు, గొడవలు ఉండవని సున్నితంగా హెచ్చరించినట్లు పలువురు వ్యాపారులు చెబుతున్నారు. కొంతమంది అయితే లాటరీలో మొదట గెలుపొందిన వ్యాపారులను 'మీరు షాపు వదిలేయాలని, అందుకు ఎంత కావాలో చెబితే ఇచ్చేస్తామని, రెండో టోకెన్ మాది ఉందని, మేము షాపు లైసెన్సు పొందుతామని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. ఏది ఏమైనా నాయకుల అండ లేకుండా వ్యాపారం చేయలేమని పలువురు వ్యాపారులు భాగాలకు ఒప్పుకున్నట్లు సమాచారం.

● పురుషులకు పోటీగా మహిళలు

రాష్ట్రంలోనే సారా వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించిన మహిళలు పుట్టిన జిల్లా ఇది. అయితే కాలం మారే కొద్దీ పురుషులకు తాము ఎందులోనూ తక్కువ కాదంటూ వైన్‌షాపులకు దరఖాస్తు చేయడంలో మహిళలు కూడా పోటీ పడ్డారు. తక్కువ సంఖ్యలో వారు దరఖాస్తులు వేసినా అదృష్టం మాత్రం ఎక్కువగా వారినే వరించింది. జిల్లా వ్యాప్తంగా 24 వైన్‌షాపులను వారు దక్కించుకున్నారు.

న్యూస్ బాక్స్



'సోమశిల' అభివృద్ధికి ప్రణాళిక

- రూ.600కోట్ల పనులకు ప్రతిపాదన

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: 'సోమశిల' అందాలను పెంచేలా కూటమి ప్రభుత్వం ఎకో టూరిజం దిశగా అడుగులు వేస్తోంది. ఇందుకోసం రూ.600 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేసేలా అధికార యంత్రాగం ప్రణాళికలు వేస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే పనులు త్వరలో ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి. టూరిజం అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి ఇటీవల ప్రకటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఈ పనులను త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించారు. ఆశించినస్థాయిలో అభివృద్ధి పనులు జరిగితే స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎకో టూరిజంలో ద్వారా ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న పచ్చని కొండలను మరింత అభివృద్ధి చేయనున్నారు. ఖాళీ ప్రదేశాల్లో ఉద్యానవనాలు, అతిథి గృహాలు, వన్యప్రాణుల కేంద్రాలు, రీసార్ట్ పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఇక బోటు షికారు ఏర్పాటుతో సోమశిల నుంచి ఎగువన కడప జిల్లా సిద్ధవటం వరకు అందాలు పెంచి.. అవి తిలకించేలా నీటి ప్రవాహం లో వెళ్తూ కొండలు, కోనలు వీక్షించేలా పనుల రూపకల్పన జరగనున్నాయి. కూటమి ప్రభుత్వంపై ఆశలు పెంచుకొన్న యువత ఎకో టూరిజం అభివృద్ధిపై ఆశలు పెంచుకుంటోంది.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ కోచింగ్

నెల్లూరు హరనాథపురం (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పరీక్షకు సిద్ధపడుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడునెలలు ఉచిత బోధన, భోజన వసతి కల్పిస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి బీ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల వారు ఈనెల 21లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్జీటీ పరీక్షకు ఇంటర్‌తోపాటు, డైట్, టెట్ అర్హత ఉండాలని, స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థుల వార్షికాదాయం రూ.2.50 లక్షల లోపు ఉండాలని, ఆశావహులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

26న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు జడ్పీ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమా వేశాన్ని ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జడ్పీ 7 స్థాయి సంఘ సమావేశాలు జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అనం అరుణమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతాయని తెలిపారు. గృహనిర్మాణ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, నీటి పారుదల, పంచాయతీరాజ్, పంచాయతీ శాఖ, నెడ్‌కాప్, ఉపాధి కల్పన, పరిశ్రమలు, వ్యవసాయ, అటవీ, విద్యా వైద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖలతోపాటు పౌర సరఫరాలు, సాంఘిక సంక్షేమ శాఖ, షెడ్యూల్డు కులాల సహకార సంఘాలకు సంబంధించి స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో సమీక్ష జరుగుతుందన్నారు.

వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం



నెల్లూరు సాంస్కృతికం (ఆంధ్రజ్యోతి) : మాగుంట లేఅవుట్‌లో ఉన్న ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో సోమవారం నవకలిశ తిరుమంజనం జరిగింది. అనంతరం నిత్యహోమం, స్వామి వారికి పవిత్ర అలంకరణ, విశేష పూజలు జరిగాయి.

నయా ట్రెండ్!

నారీలోకం.. సాధనలో మమేకం!

- మగువల్లో ఫిట్‌నెస్ మంత్రం
- మంచి ఆరోగ్యం, శరీరాకృతి కోసం పట్టు
- రోజుకు కనీసం గంటసేపయినా వ్యాయామం తప్పనిసరి
- కళకళలాడుతున్న జిమ్ కేంద్రాలు



'బమ్ చిక్ బమ్ చిక్.. చెయ్‌బాగా..
ఒంటికి యోగా మంచిదేగా..
రేజీగా ఒళ్లు పెంచుకోక.
నాజుగ్గా ఉండు తీగలాగా..!'

ఎప్పుడో విన్నట్టుంది కదా ఈ పాట. అవును.. ఈ గేయానికి తగ్గట్టుగానే నేటి నారీమణులు ఫిట్‌నెస్ కోసం జిమ్‌ల బాట పడుతున్నారు. అమ్మాయిలతోపాటు ఉద్యోగినులు, గృహిణులు కూడా మరింత అందంగా కనిపించేందుకు గంటల తరబడి వ్యాయామం చేస్తున్నారు. ఎంత బిజీగా ఉన్నా జిమ్ కోసం సమయం కేటాయించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. దీనికితోడు ఏ సమయంలోనైనా జిమ్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో ఆ కేంద్రాలు నిత్యం కలకళలాడుతున్నాయి.

- నెల్లూరు విద్య, (ఆంధ్రజ్యోతి)

నేటి ఆధునిక జీవనంలో ఉరుకులు, పరుగులతో శారీరక, మానసిక ఒత్తిడిని దూరం చేసుకునేందుకు వ్యాయామం తప్పనిసరి అయ్యింది. సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఫిట్‌నెస్ పెంచుకునేందుకు నేటి యువ తరం జిమ్‌లబాట పడుతోంది. కాస్త టైం దొరికితే చాలు రోజూ ఉదయం, సాయంత్రం కసరత్తు చేస్తూ శరీరాకృతిని పెంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంతోపాటు పట్టణ, మండల కేంద్రాల్లోనూ జిమ్‌లు వెలుస్తుండటంతో అన్నీ రద్దీగా కనిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వ్యాయామంతోపాటు రన్నింగ్ ఇతర వ్యాయామాలు చేసి కొలువులు సాధించిన వారు ఎందరో ఉన్నారు. బాడీఫిట్‌నెస్ అంటే యువకులకే అనుకుంటే పొరపాటే.. తామేమీ తక్కువ కాదంటూ అమ్మాయిలూ పోటీ పడుతున్నారు. మహిళలకు ప్రత్యేకంగా జిమ్‌లు లేకపోవడంతో కంబైండ్ జిమ్‌లకే వెళుతున్నారు. అమ్మాయిలైతే ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించి కసరత్తు చేస్తున్నారు. పాటకు తగ్గట్టుగా ఏరోబిక్స్ చేస్తూ అలసట లేకుండా వ్యాయామం చేస్తున్నారు. బాడీబిల్డింగ్, సిక్స్‌ప్యాక్, కసరత్తులు చేయడం వంటివి అబ్బాయిలకు మాత్రమే కాదని తమకు కూడా అవసరమేనంటున్నారు అమ్మాయిలు.

వ్యాయామం తప్పనిసరి

సన్నగా ఉన్నా.. లావుగా ఉన్నా ప్రతిరోజూ కొంత సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాలని నిర్ణయించుకుని క్రమం తప్పకుండా జిమ్‌లకు వెళుతున్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులైనా సరే తమకు వీలైన సమయాన్ని కేటాయించుకుని వ్యాయామం చేయడం అలవర్చుకుంటున్నారు. స్లిమ్‌గా ఉండటం పలు అవకాశాలకు క్వాలిఫికేషన్‌గా గుర్తించి మరీ సాధన చేస్తున్నారు. ఒత్తిడితోపాటు బీపీ, షుగర్, కీళ్లనొప్పులు, తల, నడుం నొప్పుల వంటి వ్యాధుల నుంచి ఉపశమనానికి వ్యాయామమే కరెక్ట్‌గా భావించి, కసరత్తు చేస్తున్నట్లు చెబుతున్నారు. డాక్టర్‌లు కూడా వీటికే ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పడంతో జిమ్‌లకు వెళ్లే మహిళల సంఖ్య అధికమైంది.

ఫీజులు ఇలా..

నెల్లూరులో జిమ్‌లకు వెళ్లే వారి కోసం ఆయా నిర్వాహకులు పలు రకాల ఫీజు వసూలు చేస్తున్నారు. నెలకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు ఫీజు ఉంటుంది. అలాగే ఏడాదికి ఒకేసారి చెల్లిస్తే రూ.10వేల నుంచి రూ.15వేల వరకు తీసుకుంటున్నారు. దీంతోపాటు జిమ్‌లో ప్రత్యేక శిక్షణ అందించేందుకు పర్సనల్ ట్రైనింగ్ (పీటీ) కూడా అందు బాటులో ఉంటుంది. వీరికి ఒకరికి నెలకు రూ.2వేల నుంచి 3వేల వరకు ఫీజు తీసుకుంటారు. శరీరాకృతిని మార్చుకునేందుకు, సిక్స్‌ప్యాక్ పొందేందుకు, ఏ రోజు ఏ శిక్షణ పొందాలో పీటీలు దగ్గరుండి నేర్పిస్తారు. జిమ్‌లో చేరేవారు వారి అవసరాలకు అనుగుణంగా ఫీజులు చెల్లించి శరీర సౌష్టవాన్ని పెంచుకుంటున్నారు. వ్యాయామం చేసే వారి సంఖ్య పెరుగుతుండటంతో జిమ్‌ల సంఖ్య కూడా పెరుగుతున్నాయి.

నిత్యం వ్యాయామం చేయాల్సిందే!



మహిళల్లో అధికశాతం మంది ఆరోగ్యంపట్ల చైతన్యం పెంచుకున్నారు. నిత్యం వ్యాయామాలు చేయడం, ఆరోగ్య సూత్రాలను పాటిస్తున్నారు. నేను కొన్నేళ్లుగా ఫిట్‌నెస్‌పై శ్రద్ధ చూపుతూ నాతోటివారిలో కూడా అవగాహన కలిగిస్తున్నాను. 80 శాతం మంచి న్యూట్రీషియన్ ఆహారం, 20శాతం ఫిజికల్ ఎక్సర్‌సైజులు చేస్తే అందంగా ఉండటంతోపాటు ఎటువంటి ఆరోగ్య సమస్యలు దరిచేరవు.

- మమత

అందంతోపాటు ఆరోగ్యం



గత ఏడాది నుంచి జిమ్‌లో ఎక్సర్‌సైజులు చేస్తున్నాను. దీనివల్ల అందంతో పాటు ఆరోగ్యం కూడా పెరుగుతుంది. శారీరకంగా, మానసికంగా ఎంతో ధృడంగా ఉంటాము. శరీరాకృతిని మనకు అనుకూలంగా మలచుకోవచ్చు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండకపోవడంతో నిత్యం ఓ గంట సేపు జిమ్‌కు కేటాయిస్తున్నా.

- శ్రావ్య

బరువు తగ్గేందుకు..



శరీరంలోని అధిక బరువును తగ్గించుకోవడంతో పాటు శరీరాకృతిని అందంగా మలచుకోవచ్చు. గత నాలుగు నెలల నుంచి సాధన చేస్తున్నాను. మొదట్లో 75 కేజీల బరువుతో జిమ్‌లో చేరిన నేను ప్రస్తుతం 15 కేజీలు తగ్గి 60 కేజీలతో ఆరోగ్యంగా ఉన్నాను. మరింత తగ్గేందుకు సాధన చేస్తున్నా.

- చరిష్మా

ఫిట్‌నెస్ ఎంతో అవసరం



ఫిట్‌నెస్ అనేది కేవలం కొందరికే పరిమితం కాదు. అన్ని వర్గాలవారికి ఎంతో అవసరం. ప్రతిరోజూ కనీసం ఒక గంటసేపు అయినా ఎక్సర్‌సైజులు చేయాలి. దీనివల్ల ఆరోగ్య సమస్యలు దరిచేరవు. జిమ్‌లో ప్రధానంగా జనరల్ ఫిట్‌నెస్, ఫిగర్ కంట్రోల్, వెయిట్ రిడక్షన్, ఏరోబిక్స్ చేయిస్తాము. కంబైండ్ జిమ్‌తోపాటు మహిళలకు ప్రత్యేక సమయాన్ని కూడా అందిస్తున్నాము.

- జిమ్ వంశీ, పల్స్ 72 జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్ నిర్వాహకుడు



అర్జీదారుడి సంతృప్తే ముఖ్యం

ఇంటర్వ్యూ

- 'గ్రీవెన్స్' సమస్యలన్నీ పరిష్కరించాల్సిందే!
- లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు
- ఉచిత ఇసుక పాలసీ పటిష్టంగా అమలు
- డిమాండ్ తగ్గించేందుకు బుకింగ్‌లు పెంచుతాం
- 'కండలేరు' భూములన్నీ ఆన్‌లైన్ చేస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ ఆనంద్

'ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఉచిత ఇసుక పాలసీని జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నాం. కొత్త పాలసీ కాబట్టి ఆరంభంలో చిన్నచిన్న సమస్యలు ఎదురైనా వాటిని అధిగమించాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా బుకింగ్‌లో జాగ్రత్తలు తీసుకుంటున్నాం. దళారుల ప్రమేయం లేకుండా ప్రజలు నేరుగా యార్డుల నుంచే ఇసుకను తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు అన్ని అవకాశాలు కల్పించాం. ట్రాన్స్‌పోర్టర్లు ఎక్కువ ధరకు విక్రయించకుండా వారిపైనా నిఘా ఉంచాం. యార్డుల్లో ఇసుకను అక్రమంగా తరలించకుండా నిరంతరం సీసీ కెమెరాల నిఘాతో పర్యవేక్షిస్తున్నాం. తరచూ ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహిస్తున్నాం. మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి యార్డుల్లో విక్రయాలు జరుపుతున్నాం. జిల్లా అవసరాలకు తగ్గట్లుగా రోజూ బుకింగ్‌లు ఇస్తున్నాం. అయితే ప్రకాశం జిల్లాకు కూడా మన దగ్గర నుంచే ఇసుకను తీసుకెళుతుండడంతో కొంత డిమాండ్ ఏర్పడుతోందన్న ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో డిమాండ్‌ను తగ్గించేందుకు బుకింగ్‌లు పెంచుతాం. ప్రస్తుతం రోజుకు 6 వేల టన్నుల వరకూ విక్రయాలు జరుపుతుండగా, దాన్ని 9 వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఓపెన్ రీచ్‌లలో కూడా ఇసుక తవ్వకాలకు టెండర్లు పిలిచాం. వీలైనంత త్వరగా ఈ రీచ్‌లను కూడా అందు బాటులోకి తెస్తాం. ఇసుక డెలివరీ తర్వాత ఆడిటింగ్ నిర్వహిస్తున్నాం. నిజంగానే ఆ వ్యక్తికి ఇసుక అవసర మా!? యార్డు నుంచి తెచ్చిన ఇసుక అక్కడ ఉందా!? ఆ ఇసుకతో నిర్మాణం జరిపారా!? లేదా!? అన్న వివరాలను సచివాలయ సిబ్బంది ద్వారా విచారిస్తాం. ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా బుకింగ్‌లు చేసి ఆ ఇసుకను మార్కెట్లో అమ్మినట్లు తేలితే చర్యలు తప్పవు.

చివరి దశకు ఫ్రీహోల్డ్ విచారణ

జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై జరుగుతున్న విచారణ చివరి దశకు చేరుకుంది. ఫ్రీహోల్డ్ భూములతోపాటు అసైన్‌మెంట్ భూములపై కూడా విచారణ జరుగుతోంది. ఇది పూర్తి కాగానే ఆ నివేదికలను ప్రభుత్వానికి అంది స్తాం. ఆ తదుపరి నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి. కండలేరు ముంపు ప్రాంతాల నుంచి పరిహారం కోసం అనేక అర్జీలు వస్తున్నాయి. వీటిపై చాలా కాలంగా వివా దాలు కొనసాగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నా యి. ఈ నేపథ్యంలో ఈ వివాదాలను తగ్గించేందుకు కండలేరు ప్రాజెక్టుకు అప్పగించిన భూములన్నింటినీ ఆన్‌లైన్ చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాం. వెబ్ ల్యాండ్ రికార్డుల్లో కండలేరు ప్రాజెక్టు పేరు చేర్చితే చాలా వరకూ భవిష్యత్‌లో సమస్యలు తగ్గుతాయి. కలెక్టరేట్‌లో ఇక అన్ని ఫైళ్లను ఈ-ఫైల్ ద్వారానే నడపాలని ఆదేశా లిచ్చాం. ఫలితంగా వేగంగా ఫైళ్లు కదులుతాయి. అలానే ఏ సెక్షన్‌లో ఎన్ని ఫైళ్లు పెండింగ్ ఉన్నాయన్న వివరాలు కూడా ఇవ్వాలని సూచించాం. ఈ ఫైళ్లన్నింటినీ ప్రయారిటీ బేస్‌లో క్లియర్ చేయడానికి కృషి చేస్తాం. గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీలన్నీ త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. అలసత్వం వహించిన అధికారులపై కఠినంగా వ్యవహరిస్తున్నా' అని కలెక్టర్ వివరించారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)



'రాళ్లపాడు'లో 8.7 అడుగులకు

చేరిన నీటిమట్టం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రాళ్లపాడు ప్రాజెక్టులో సోమవారం సాయంత్రం 8.7 అడుగులకు నీటి మట్టం చేరింది. ప్రాజెక్టు ఎగువ భాగాన కురుస్తున్న వర్షాలకు, సోమశిల నుంచి వస్తున్న 70 క్యూసెక్కుల నీటితో కలిపి ప్రాజెక్టులోకి 130 క్యూసెక్కుల నీరు వస్తున్నట్టు ఏఈ జి.చంద్రమౌళి తెలిపారు. ఈ వర్షాలకు ముందు ప్రాజెక్టులో 7.6 అడుగుల నీరు ఉన్నట్లు చెప్పారు. రాత్రికి ప్రాజెక్టు నీటి ప్రవాహాన్ని బట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

'సోమశిల' పెరుగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : కడప, అన్నమయ్య జిల్లాలతోపాటు పెన్నా పరివాహక ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఎగువ నుంచి వచ్చే ప్రవాహం పెరుగుతుండగా ఇంజనీర్లు అప్రమత్తమయ్యారు. వరద రాకపై నెల్లూరులో కలెక్టర్ ఆనంద్ ఎస్ఈ వెంకటరమణారెడ్డితో చర్చించి పలు సూచనలు చేశారు. ఈమేరకు లోతట్టు గ్రామాల ప్రజలను రెవెన్యూ, పంచాయతీ అధికారులు అప్రమత్తం చేశారు. పెన్నానది, వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. సోమశిలకు ఇన్‌ఫ్లో సోమవారం ఉదయానికి 7,982 క్యూసెక్కులు నమోదవగా మధ్యాహ్నం నుంచి రెండు గంటలకోసారి అధికారులు పరిశీలిస్తున్నారు. మంగళవారం ఉదయానికి వరద పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ 77.988 టీఎంసీలు కాగా.. 52.011 టీఎంసీలుగా నమోదైంది. కండలేరుకు 6000, ఉత్తర కాలువకు 40, దక్షిణ కాలువకు 5, డెల్టాకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

చేనేతలకు సబ్సిడీపై నూలు

- చేనేత, జౌళి శాఖ అధికారి వరప్రసాద్

నెల్లూరు వ్యవసాయం(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14 : చేనేత కార్మికులకు ముడి పదార్థాల సరఫరా పథకం (ఆర్ఎంఎస్ఎస్) కింద కేంద్ర ప్రభుత్వం 15శాతం సబ్సిడీతో నూలు సరఫరా చేస్తుందని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చేనేత కార్మికులు, కార్మికులుగా సభ్యత్వం ఉన్న స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, మాస్టర్ వీవర్లు కూడా ఈ సబ్సిడీ పథకానికి అర్హులని తెలిపారు. సబ్సిడీ మొత్తం నేరుగా చేనేతల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని అర్హులైన వారందరూ ముందుగా జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. చేనేత ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహించేందుకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కామర్స్(ఓఎన్‌డీసీ) అనే ఈ-కామర్స్ వేదిక అందుబాటులో ఉందని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం కింద గృహ అవసరాలకు విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే సోలార్ రూఫ్ టాప్‌ను రాయితీతో పొందవచ్చని తెలిపారు. దీనికోసంగా బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు కూడా అందిస్తాయని, పూర్తి వివరాలకు చేనేత, జౌళిశాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదులను చట్టపరిధిలో పరిష్కరించాలి

- అదనపు ఎస్పీ సౌజన్య

నెల్లూరు క్రైం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించాలని ఏఎస్పీ సీహెచ్ సౌజన్య పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 30 మంది బాధితులు పాల్గొని వారి సమస్యలను ఏఎస్పీకి విన్నవించుకున్నారు. వాటిపై ఆయా ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో ఏఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ సౌజన్య

కునుకుపాటు ప్రాణాలు తీసింది!

- డ్రైవర్ నిద్రమత్తుతో అదుపు తప్పి కారు బోల్తా
- ఇద్దరు మహిళల మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు
- కొండారెడ్డిపాలెం మలుపు సమీపంలో ఘటన

వలేటివారిపాలెం(ఆంధ్రజ్యోతి) అక్టోబరు 14 : డ్రైవర్ నిద్ర మత్తు ఇద్దరిని బలిగొంది. సోమవారం తెల్లవారుజామున కొండారెడ్డిపాలెం మలుపు సమీపంలోని రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్ దాటి గట్టు పొలం తగిలి బోల్తా పడింది. దీంతో ఇద్దరు మహిళలు మరణించగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పోకూరు ఎస్సీ కాలనీకి చెందిన కాలే సామ్రాజ్యం (55), లింగాబత్తిన సులోచన (65, పర్రె చినకొండమ్మ, ప్రియదర్శిని, అమరావతి, ఉదయశ్రీలు కారులో సామ్రాజ్యం పెద్ద మనుమరాలు లావణ్య పెళ్లికి ఆదివారం రాత్రి నలదలపూరు వెళ్లారు. అక్కడ నుంచి తెల్లవారుజామున 4 గంటల సమయంలో కారులో తిరిగి వస్తుండగా డ్రైవర్ నిద్రమత్తు కారణంగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కాలే సామ్రాజ్యం (55) అక్కడిక క్కడే మృతి చెందగా లింగాబత్తిన సులోచన (65) కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందింది. పర్రె చినకొండమ్మ, ప్రియదర్శిని, అమరావతి, ఉదయ శ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో అమరావతి, ఉదయశ్రీలను మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న వలేటివారిపాలెం ఎస్ఐ మరిదినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, కందుకూరు ఆసుపత్రిలో క్షతగాత్రులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈయన వెంట పార్టీ స్థానిక నాయకులు ఉన్నారు.



కందుకూరులో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు



జై భవాని.. జైజై భవాని!

రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ భక్తులు ఇరుముడి ధరించి సోమవారం నెల్లూరు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారి విగ్రహం ముందు జై భవాని.. జైజై భవాని అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.

- నెల్లూరు

ఆంధ్రజ్యోతి
కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి
మంగళవారం 15 అక్టోబరు 2024 8

తీరప్రాంతంలో సబ్ కలెక్టర్ పర్యటన


బాలకోటయ్య సంఘం ఎస్టీ కాలనీవాసులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 14 : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తీరప్రాంత, లోతట్టు గ్రామా లు కరేడు, చాకిచర్ల, పెద్దపట్టపుపాలెం, రామాయపట్నం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ సూచించారు. సోమవారం కరేడు పంచాయతీ పరిధిలోని బాలకోటయ్య సంఘం ఎస్టీ కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తుఫాన్ షెల్టర్‌ను పరిశీలించారు. రెండు రోజుల్లో అధికారులు అన్నింటికి సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ లావణ్యను ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి రూరల్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున వాగులు, వంకలు పొంగే అవకాశమున్నందున ప్రజలు వాటి వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కరీముల్లా, నాగూర్‌బీ, చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటరమణ, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: తుపాన్ సూచనలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్లు ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా పట్టణ ప్రజలకు అత్యవసర సేవలు అందించేందుకు సమాచార నిమిత్తం కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపారు. పట్టణ ప్రజలు అత్యవసర సహాయం కోసం 08627-796692 నెంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు.

మత్స్యకారుల చేపల వేటకు వెళ్లొద్దు


వీర్లగుడిపాడులో పర్యటిస్తున్న ఆర్డీవో పావని, సీఐ వేమారెడ్డి

కావలి (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కావలి ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని తీరప్రాంతంలో పర్యటించి మత్స్యకా రులు, ప్రజలను అప్రమత్తం చేశారు. తుమ్మలపెంట తీరంలో మత్స్యకారులతో మాట్లాడారు. సముద్రంలో వేటకు వెళ్ల వద్దని సూచించారు. కరేటి వారిపాలెం, చినరాముడిపాలెంలలో తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పుడు అవసరమనుకుంటే అప్పుడు తుఫాన్ షెల్టర్లకు తరలించేందుకు అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు.

● సంగం(ఆంధ్రజ్యోతి): భారీ వర్ష సూచనలతో ఆత్మకూరు ఆర్డీవో పావని సోమవారం గ్రామాల్లో పర్యటించారు. మొదట స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి మండలంలోని పెన్నా ముంపు ప్రాంతమైన వీర్లగుడిపాడు గ్రామాన్ని సందర్శించి అప్రమత్తంగా ఉండాలని, వర్షంతో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని గ్రామస్థులకు సూచించారు. ఆమె వెంట సీఐ వేమారెడ్డి, ఆర్ఐ రాజనారాయణ, వీఆర్వో నాయబ్‌రసూల్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా నిమజ్జనోత్సవం


గ్రామోత్సవంలో అమ్మవారు

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాజీనగర్‌లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని సోమవారం నిమజ్జనానికి తరలించారు. అలాగే నవరాత్రుల సందర్భంగా ప్రతి రోజు వివిధ అలంకరణల్లో పూజ లందుకున్న అమ్మవారి విగ్రహాలను బాలాజీనగర్, మెయిన్‌బజార్‌లతోపాటు శివాలయం వరకు గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం అమ్మవారి ప్రతిమను మండలంలోని గండిపాళెం జలాశయంలో నిమజ్జనం చేశారు.

భూములు పంపిణీ చేయాలి

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి),అక్టోబరు 14: సాగు భూములు పంపిణీ చేయాలని స్థానిక ముస్లింలు తహసీల్దారుకు సోమవారం వినతిపత్రం అందచేశారు. ఆత్మకూరు మండలంలోని ముస్లింలు చాలా మంది వ్యవసాయ కూలీలు, బీడీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారని, వారికి సాగు భూములు పంపిణీ చేయాలని కోరారు. ఐయుఎంఎల్ పార్టీ స్టేట్ మీడియా ఇన్‌చార్జ్ మహమ్మద్ మసన్ బేగ్, జిల్లా ఇన్‌చార్జి సయ్యద్ షు కూర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందచేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి) అక్టోబరు 14: మొగిలిచెర్ల మన్నేరు వాగు ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుభానీ తెలిపారు. ట్రాక్టరును పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు.

ముళ్లచెట్లలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో సోమవారం ఆర్టీసీ బస్సు అదుపుతప్పి ముళ్లచెట్లలోకి దూసుకెళ్లింది. ఉదయగిరి నుంచి నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ బస్సు నందిపాడు గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చేందుకు మార్జిన్ దిగింది. వర్షం కురుస్తున్నందున మార్జిన్ కుంగడంతో బస్సు అదుపుతప్పి ముళ్లచెట్లలోకి దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఇటీవల విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్ల కోసం రోడ్డు మార్జిన్ వెంట గుంతలు తీసి సక్రమంగా పూడ్చకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పలువురు అధికారులు

కావలి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డిని నూతనంగా బాధ్యతలు చేపట్టిన పలువురు అధికారులు సోమవారం కావలిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందచేశారు. కావలి ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణ ఎమ్మెల్యేను కలవగా రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే విద్యుత్‌శాఖ ఏడీఈగా రవికుమార్, కావలి సబ్ రిజిస్ట్రార్ సుమలత, డ్వామా పీడీ గంగా భవానీలు ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉన్నారు.

రేపు జాబ్ మేళా

కావలి టౌన్ (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా బుధవారం పెద్దపవని వీసీయు పీజీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ఆఫీసర్ అబ్దుల్ ఖయూమ్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ మేళాలో ప్రముఖ కంపెనీలు నిర్వాహకులు పాల్గొని ఇంటర్వూలు చేపడతారన్నారు. పాల్గొనదలిచిన అభ్యర్థులు ఆధార్ కార్డు జెరాక్స్, బయో డేటా, ఇతర ధృవీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సెల్: 63015 43185, 72868 22789 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఆవుదాడిలో గాయపడిన మహిళకు ఆర్థిక సాయం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: మండలంలోని పీకే పాడులో ఇటీవల ఆవు దాడి చేయడంతో గాయపడిన నీరుకట్టు లక్ష్మమ్మకు హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం రూ. 10వేల ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వెంకటరమణారెడ్డి, బోమిళ్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం

● కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో భారీ వర్షం ● నీట మునిగిన కాలనీలు , పంట పొలాలు
● ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు ● రోడ్లపై ప్రవహించిన వర్షపు నీరు


జలమయమైన కావలిలోని ఇందిరమ్మ దివ్యాంగుల కాలనీ


మత్స్యకారులతో మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మీనారాయణ

ఉదయగిరి రూరల్(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మెట్టప్రాంతమైన ఉదయగిరిలో సోమవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేని వర్షం కురిసి 67.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా పట్టణంలోని మురుగు కాలువలు పొంగి పొర్లాయి. వీధుల్లో వర్షపు నీరు కురవడంతో జనజీవనం స్తంభించింది. ఈ వర్షం రబీ సీజన్‌లో సాగు చేసే పంటలకు ఊరటనిచ్చింది.

సంగం: మండల పరిసర ప్రాంతాల్లో ఉదయం8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్షం కురిసింది. 113.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు. గ్రామాల్లో వీధులు జలమయమై జనజీవనం స్తంభించింది.

అనంతసాగరం: మండలంలో ఎడతెరపిలేని వర్షంతో వాగులు, వంకలు నిండాయి. అనంతసాగరం చెరువుకు నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల వరికోతలు నిలిచిపోయాయి. కమ్మవారిపల్లి, పీకేపాడులో వేరుశనగకు నష్టం వాటిల్లింది. కొత్తపల్లి, కచ్చేరిదేవరాయపల్లి, రేవూరులో తహసీల్దారు వీరవసం తరావు పర్యటించి రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆత్మకూరు సీఐ గంగాధర్ పోలీసు సిబ్బందితో కలిసి వాగులు పరిశీలించారు.

కావలి: పట్టణంలోని వైకుంఠపురం, అన్నపుగుంట, పాతూరు, దివ్యాంగుల కాలనీ, ముసునూరు ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాలు సోమవారం కురిసిన వర్షానికి నీట మునిగాయి. ప్రధానంగా వర్షపు నీరు వేళ్లే మార్గాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో ఈ సమస్య నెలకొంది. అన్నపుగుంటకు అటవీ ప్రాంతం నీరంతా వచ్చి చేరుతుంది. ఆ నీరు వెళ్లే వరవ కాలువ ఆక్రమణలతో కుదించుకుని పోవటం, రైల్వే ట్రాక్ వెంబడైనా వర్షపునీరు వెళ్లేందుకు కాలువలు తీయకపోవటంతో ఈ ప్రాంతాలు నీట మునిగాయి. పట్టణంలోని నీరంతా పాతూరు ప్రాంతం నుంచి దిగువకు పొలాల మీదుగా వెళ్లేది. ఆ పొలాలను లేఅవుట్లుగా మార్చి గోడలు నిర్మాణం, కాలువలను ఆక్రమించటంతో ఆ ప్రాంతం నీట మునుగుతోంది. ముసునూరు గిరిజన కాలనీ వెంబడి ఉన్న వర్షపునీటి కాలువలను ఆక్రమించారు. అలాగే దివ్యాంగుల కాలనీలో కూడా వర్షపు నీరు వెళ్లే కాలువలు లేక నీట మునుగుతోంది. అధికారులు ముందు జాగ్రత్తగా వర్షపు నీరు వెళ్లే మార్గాలను ఏర్పాటు చేయకుండా వర్షం వచ్చిన రోజు హడావుడి చేసి వదిలేస్తుండటంతో పట్టణ ప్రజలకు నీటి మునక సమస్య తప్పటం లేదు.

కావలి టౌన్: కావలిలో ఆదివారం రాత్రి నుంచి ఎడ తెరిపి లేని వర్షంతో కాలనీల్లోని రోడ్లన్నీ జలమయమై రాకపోకలకు అంతరాయం కలిగింది. ముసునూరు గిరిజన కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరడంతో సమీప బంధువుల ఇళ్లలో తలదాచుకున్నారు. ముసునూరు అయ్యప్ప గుడి, ఆటోనగర్ ప్రాంతాల్లోని ట్రంకురోడ్డుపై పెద్దఎత్తున వర్షపు నీరు ప్రవహించింది. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాలతో మున్సిపల్ అధికారులు సిబ్బంది రంగంలో దిగి జేసీబీ సహకారంతో పూడిపోయిన కాలు వలను తవ్వి వర్షపునీరు ముందుకు పారేలా తాత్కాలిక చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి స్వీయ నిధులతో ముసునూరు ఆటోనగర్ ట్రంకురోడ్డు వద్ద దెబ్బతిన్న రోడ్డు నిర్మాణం చేపట్టడంతో వాహనాలు రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఏర్పడ లేదు.

అల్లూరు: కుండపోత వర్షంతో కాలువలు, గుంటలు నిండిపోయాయి. తీరప్రాంతమైన ఇస్కపల్లిలో తహసీల్దారు లక్ష్మీనారాయణ పర్యటించి వారికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక చర్యల్లో భాగంగా ప్రతి ప్రాంతానికి ఒక అధికారిని నియమించామన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకూడద ని చెప్పారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జలదంకి: వర్షంతో రోడ్లతో పాటు పంట పొలాలు జలమయయ్యాయి. వరినారు మళ్లకు సిద్ధమైన రైతులకు ఈ వర్షం ఉపయోగకరంగా ఉందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరం కానున్నాయి.

లింగసముద్రం: మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. కలెక్టరు ఆనంద్ ఆదేశాల మేరకు అన్నిశాఖల అధికారులు అప్రమత్తయ్యారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి వాటర్ ప్లాంటు వరకు రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్లను ఆక్ర మించి ఎత్తుగా మట్టి పోయడంతో కాలువను తలపిస్తోంది. అయితే ఈ వర్షాలకు జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద గుడారాలలోని రెండు కుటుంబాలను తహసీల్దార్ ఎస్.సీతా మహాలక్ష్మి వీఆర్‌ఓలు మస్తాన్‌వలి, నాగరాజులతో పెంట్రాల పాఠశాలకు తరలించి వసతి సౌకర్యం కల్పించారు. వీరికి పెంట్రాల టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య ద్వారా భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.మాధ వరావు, మహిళా పోలీసు ప్రియాంక పాల్గొన్నారు.

కొండాపురం: మండలంలో 44.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కలెక్టరు ఆదేశాలతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఎమ్.కోటేశ్వరరావు తెలిపారు. వీఆర్‌వోలు వారి గ్రామాల ప్రజలకు తుపాను సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలపాలన్నారు.

చిట్రగుంట: అల్పపీడన ప్రభావంతో మత్స్యకారులు వలలు, పడవలను ఒడ్డుకు చేర్చుకున్నారు. జువ్వలదిన్నె కార్యదర్శి శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది తీరప్రాంత వాసులను అప్రమత్తం చేశారు. స్థానిక ఎస్సై భోజ్య సిబ్బందితో కలసి తీరప్రాంతాల్లో పర్యటించి లోతట్టు ఉన్న వారికి సురక్షిత స్థావరాల ఏర్పాటు గురించి వివరించారు. ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు సురేష్ బాబు, ఏవో గోవిందరావు మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

కందుకూరు: ఈ ఏడాదిలో మొదటిసారిగా ఎడతెరిపి లేని వర్షం కురవడంతో చెరువులు, కుంటలకు స్వల్పంగా నీరు వచ్చి చేరింది. రబీ పైర్ల సాగుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఏర్పడినట్లు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కందుకూరులోని అనేక కాలనీల్లో మురుగు కాలువలు పొంగడంతో రోడ్లపైకి నీరు చేరింది. మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికతో కందుకూరు సబ్ కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

కలిగిరి: పరికోట వాగు ఉధృతిని తహసీల్దారు చొప్ప రవీంద్రబాబు ఆర్ఐ అన్నపూర్ణ, వీఆర్వో వనితలతో కలిసి పరిశీలించారు. అనంతరం వెంకన్నపాలెం ఎస్టీ కాలనీలోకి వర్షపునీరు రావడంతో ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి జేసీబీతో నీరు తరలింపునకు చర్యలు తీసుకున్నారు.

ఉలవపాడు: సోమవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి మన్నేటికోట తిరుపతికుంట, ఉలవపాడులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కోటిరెడ్డి కుంట, వెంకారెడ్డి కుంట కట్టపై ఉన్న ఎస్టీల గుడిసెల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సోమవారం ఒక్కరోజు మండలంలో 8 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. లోతట్టు ఎస్టీ కాలనీవాసులకు అధికారులు అప్రమత్తతతో ఉండి పునరావాసం, వసతులు, ఆహారం అందించే ఏర్పాటు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం వర్షంతో కుంటల నీరు చేరుతుంది.


కావలి: నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగిస్తున్న ఎక్సకవేటర్


రేవూరులో ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దారు వీరవసంతరావు

పంచాయతీల అభివృద్ధికి నిధుల వరద : ఎమ్మెల్యే కాకర్ల


శిలాఫలకం వద్ద కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి

జలదంకి(ఆంధ్రజ్యోతి), అక్టోబరు 14: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా మంజూరు అయిన పంచాయతీల నిధులను కూడా పక్కదోవ పట్టించగా నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధుల వరద కురిపిస్తోందని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. జోరువానను కూడా లెక్కచేయకుండా సోమవా రం ఎమ్మెల్యే మండలంలో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్నారు. జమ్మలపాలెంలో రూ.20లక్షలు, జలదంకిలో రూ.27.50లక్షలు, బ్రాహ్మణక్రాకలో రూ.25లక్షలు, చినక్రాకలో రూ.28లక్షలు ఉపాధిహామీ నిధులతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురే ష్ మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు బీజేపీ సహకారంతో అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలు పూర్తికాకముందే పంచాయతీలకు కేంద్రం నుం డి వచ్చే 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్‌ల బ్యాంకు ఖాతాల్లో వేయించడం కూట మి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వం సర్పంచ్‌లను దిష్టిబమ్మలుగా మార్చారని, కనీసం వారు బ్లీచింగ్ పౌడర్ చల్లించేందుకు ఖాతాల్లో నగదు లేని పరిస్థితి ఉండేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించడమే తన ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య, పార్టీ మండలా ధ్యక్షుడు మధుమోహన్‌రెడ్డి, నేతలు పూనూరు భాస్కర్‌రెడ్డి, వంటేరు జయ చంద్రారెడ్డి, మందపల్లి మాల్యాద్రియాదవ్, కంచర్ల వినోద్‌నాయుడు,నక్కా మాధవ రావు, ఏగూరి రఘు, గుర్రం ప్రవీణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి : ఇంటూరి

ఉలవపాడు (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. పెద్దపట్టపుపాలెంలో రూ.34.86 లక్షలు, చాకిచర్లలో రూ.30.53 లక్షలు, చాగొల్లులో రూ.27లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న నమ్మకానికి అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవ న్‌కల్యాణ్ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తు న్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.విజయ, పంచాయతీరాజ్ డీఈ వెంకటేశ్వర్లు, పార్టీ గ్రామ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసులు, ఆవుల రఘు, మల్లికార్జున, నేతలు కారసాల అంకపనాయుడు, వల్లూరి వెంకటరమణ్య, కడియాల సుబ్బారావు, వర్దినేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

● సీసీరోడ్లకు శంఖుస్థాపన

కలిగిరి (ఆంధ్రజ్యోతి): సిద్దనకొండూరు, పోలంపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, స్థానిక నాయకులు గంగినేని రంగారావు, దారా రాఅయుడు, గెనేడు పెంచల నరసింహ, గొట్టిపాటి వెంక టేశ్వర నాయుడు, బాల మస్తానయ్య నాయుడు, కల్లూరు చంద్రమౌళి పాల్గొన్నారు.